ఒక ముహూర్తకాలములో మీ సాంగత్యము వలన నా అజ్ఞానము తొలగిపోయెను. గర్వము, అహంకారము నుండి విముక్తుడనైతిని. భగవంతుని శరణు జొచ్చుటయే మానవుని యేకైక విధి యని మీరు నాకు బోధించితిరి పదేపదే శిరస్సు వంచి నమస్కారము చేయుచున్నాను. ఇంకే విధముగాను నా కృతజ్ఞతను తెలుపుకొనలేను''

భరతు డతని నాశీర్వదించి, భగవంతుడిచ్చిన యీ శరీరములో ప్రాణముండునంతవరకు, భూమిపై సంచారము గావించుటకు వెళ్ళిపోయెను.

షష్ఠ స్కంధము

65 అజామీళుని మరణము

ప్రాపంచిక వస్తువులయందు, భౌతిక సుఖములందు మునిగి, నిత్యమూ ప్రాపంచిక సుఖాన్వేషణలో నుండే మానవుని మనస్సు అజ్ఞానముతో నిండి, నిత్యసత్యమును గ్రహింపక యుండును అట్టి మానవునకు జనన మరణములనే సంసార చక్రము నిరంతరమూ ఉండును. జ్ఞానము చేతనే అజ్ఞానమను తెరను తొలగించవచ్చును భౌతిక ప్రపంచముతో అనుబంధము త్రెంచుటకు నియమము అనగా అధ్యాత్మిక నియమము అత్యావసరము. పరిశుద్ధమైన సంపూర్ణ ఆహారమును భుజించు మానవుని యెట్టి రోగములు బాధించవు అదే రీతిగా ఆధ్యాత్మికాహారమును భుజించే మానవుడెన్నడూ బాధలకు గురికాడు. నియమ నిష్టలే ఆధ్యాత్మికాహారము. మనోనిగ్రహ మవసరము బ్రహ్మముపై మనసు లగ్నముచేసి ధారణ చేయుట, భౌతిక సుఖములనుండి ఇంద్రి ఇంద్రియలోలత్వమున ్నను జయించుట, నిస్స్వ ర్థము, నిత్యము సత్యము పలుకుట, అంతర్బహిశ్శౌచము, అన్ని జీవులందు కరుణ కలిగి యుండుట, యితరుల వస్తువులను పరిగ్రహించకుండుట, యితరులిచ్చే కానుకలను స్వీకరింపకుండుట - యివన్నియు మనస్సులో నున్న అజ్ఞానమును నిర్మూలించుటకు దోహదము చేయును కట్టెలందు ఉన్న అగ్నిచేత అరణ్యము దగ్ధమగు రీతిగా మానవుని అజ్ఞానము దగ్ధమగును. మోక్షమును పొందు శక్తిమానవుని యందేకలదు మానవుడు స్వయం కృషి చేత దానిని సాధించగలడు

కొందరు సంపూర్ణ శరణాగతి చేత భగవంతుని చేరగలిగిరి సూర్యుని వేడిచేత మంచు కరిగినట్లు, వారి పా భగవంతునికి తనను తాను అర్పించుకున్న మానవుడు, యితరులకన్న ఉన్నత స్థితిలో నుండును భక్తిమార్గము అన్నింటికన్న ఉత్తమమైనది, ఇది నిశ్చయముగా గమ్యమును చేర్చును భగవద్భక్తికి తపస్సు, జపము సాటిరావు భగవంతుని పాదములపై మనసును స్థిరపరచుకొన్న మానవుని దరికి స్వప్నము నందైనను పాపము, మృత్యువు చేరలేవు ఈ భక్తియోగము మిక్కిలి శక్తివంతమైనది.

నారాయణుని యందు భక్తికి గల శక్తిని తెలుపు పురాణగాథ ఒకటి గలదు

కన్యాకుబ్జమను దేశములో అజామీళుడనే బ్రాహ్మణుడు నివసించుచుండెను అతడు బ్రాహ్మణుడుగా పుట్టినప్పటికీ, దుష్ట మార్గములో పడి మంచిని పూర్తిగా విడిచిపెట్టెను అధమ జాతి స్త్రీతో అతడు సుఖించుచుండెను. ఒకప్పుడు అందరియెడల కరుణా స్వభావముతో నుండిన అజామీళుడు క్రూరుడుగా నుండెను జూదరిగా, మో లిగి యుండెను. ఇతరుల సంపదను దోచుకొనుచు జీవితము పాపకార్యములందే గడపుచుండెను. న్యాయముగా అతని క్షింపకుండెను. అందుచేత అందరు అతనిని యేవగించుకొనుచుండిరి.

కాలము గడువగా అతడు ముసలివాడయ్యెను అధమజాతి స్త్రీ యందు పదిమంది పుత్రులు కలిగిరి. వారిలో ఆఖరివానిపేరు నారాయణ తల్లిదండ్రులకు అతడు మిక్కిలి ప్రీతిపాత్రుడు ఆ బాలునితోనే అజామీళుడు కాలమంతయు వెళ్ళబుచ్చుచుండెను. ఆ బాలునియందుండు అమిత ప్రేమచేత అజామీళుడు

యింకే విషయము ఆలోచించకుండెను భుజించునపుడు తానొక్కడే భుజింపకుండెను పుత్రుని పిలిచి, ''నారాయణా! నువ్వుకూడ వచ్చి నేను భోజనము చేయకమునుపే నీవుచెయ్యి'', అదే విధముగా తాను యేదైనా త్రాగేముందు దానిని కుమారునికిచ్చి, ''నారాయణా! ముందు నీవు త్రాగు'' అనుచుండెను.

ఈ విధముగా అజామీళుడు ఆ స్త్రీతోను పిల్లలతోను కాలము గడుపుచూ, తనకు మృత్యువు సమీపించుచు న్నదనే విషయము గ్రహింపకుండెను. మృత్యువు దగ్గరపడగా, అతని ఆలోచనలు చేతలు ఆఖరి కుమారునిపైననే యుండి, అతనిని పేరుపెట్టి ప్రతిక్షణమును పిలుచుచుండెడివాడు. ఇంతలో యమదూతలు అజామీళుని కడకు వచ్చిరి. వారిని దూరము నుండి అజామీళుడు చూచెను. వాకిటిముందు ఆడుకుంటున్న కుమారుని జూచి, ''నారాయణా! నావద్దకు రా నారాయణా!'' అని పలికి ప్రాణము విడిచెను.

అజామీళుడు, అఖరి శ్వాసలో ''నారాయణా! నావద్దకురా'' అన్న మాటలను నారాయణుని సేవకులు విని తక్షణము అక్కడకు వచ్చిరి వారు, యమదూతలు ఆ బ్రాహ్మణుని శరీరము నుండి జీవుని యీడ్చుట జూచి అడ్డుపడిరి యమదూతలు నారాయణుని సేవకులపై ఆగ్రహము చెంది యిట్లనిరి ''యమదూతలమైన మమ్ము మా విధిని నిర్వర్తించకుండా అడ్డుపడుటకు సాహసించిన మీరెవరో తెలుపవలెను? మీరెక్కడి నుండి వచ్చినారు? మీరు యెవరికి చెందినవారు? మీరు దివ్యపురుషులా లేక దేవతలా? మమ్ములను యేల అడ్డగించెదరు?'' నారాయణుని సేవకులు యమదూతలను జూచి నవ్వి యిట్లనిరి. ''మీరు అన్నట్లుగా యమధర్మరాజా సేవకులైనచో, ధర్మము గూర్చి వివరింపుడు ధర్మబద్ధముగా ప్రజలను శిక్షించు విధానము తెలుపుడు ఎట్టి మానవులకు శిక్షపడవలెను? ఎట్టి కార్యములు శిక్షార్హములు? శిక్ష మానవులకేనా, లేక జంతువులకు కూడ నున్నదా? మాకు తెలుసుకొన: నే వివరించి చెప్పవలెను''.

యమదూత లిట్లనిరి ''వేదములు నిర్దేశించినదే ధర్మము ధర్మమే నారాయణుని శ్వాసయని చెప్పవ చ్చును. వేదానుసారము కానిదంతయు అధర్మము. భగవంతుడే ధర్మము ఎవరికి విధించిన ధర్మమును వారనుసరించనిచో, యముడు వారిని శిక్షించును మానవుడు తన కర్మలకు తగినట్లు జీవించును. కర్మలు చేయక యెట్టివారును ఉండరు వారు చేయు కర్మలను బట్టి, అనగా సత్కర్మలు దుష్కర్మలు, శిక్షగాని, ప్రతిఫలముగాని లభించును భవిష్యత్తులో కలుగబోవు జన్మ, మానవుడు యీ జన్మలో చేయు కర్మలను బట్టి నిర్ణీతమగుచున్నది, పూర్వ జన్మలో చేసిన కర్మల ననుసరించి ప్రస్తుత జన్మ నిర్ణయమైనది. వసంత ఋతువులోని యీ క్షణము అనేక వసంతముల కొనసాగింపు, యివి వచ్చి పోవుచుండును. రాబోయే వసంతమునకు, యీ వసంతములో విత్తనములు పడును. సంయమని పేరుగల నగరంలో నివసించే యముడు, మానవులు యీ జన్మలో చేసిన కర్మల ననుసరించి, రాబోవు జన్మను నిర్ణయించును

''మానవుడు, అజ్ఞానము చేత, యీ శరీరము అశాశ్వతమని గమనించుటలేదు అజ్ఞానము చేత బుద్ధి కలుషితమై, యీ శరీరమే తానని యీ జన్మమాత్రమే గలదని భావించుచున్నాడు. పూర్వజన్మ గురించిగాని, రాబోవు జన్మగురించి గాని అతడు తలచుటలేదు స్వప్నములో నున్న మానవుడు, మెలకువస్థితిలోని తన శరీరమును గురించి యెరుగడు అనేక స్వప్నములలో అతడు ధరించిన శరీరములను గూడ యెరుగడు తనకు తానుగా పట్టుపురుగు పట్టుదారము చుట్టుకొన్నట్లు మానవుడు తన ఆత్మకు కర్మలు చుట్టుకొని, బంధితుడననే భ్రమలో పడుతున్నాడు అందునుంచి బయటపడలేక పోతున్నాడు ఈ బంధము నుంచి స్వేచ్ఛను పొందుటకు తనయందే శక్తిగలదని గ్రహించునంతవరకు, మానవుడు కర్మలకు బద్ధుడు

''అజామీళుని గురించి చెప్పెదము. ఒకప్పుడితడు చాలా మంచివాడు, సద్బ్రాహ్మణుడు, ధర్మపరుడు. బాగా చదువుకుని మంచి నడవడి గలిగి ధర్మమార్గమునందే సంచరించెను

''ఒకనాడు, భగవంతుని పూజకొరకు, తన తండ్రిచేయుచున్నట్లే, ఫలములు, పుష్పములు, కుశలను. తీసుకు వచ్చుటకు అడవికి వెళ్ళెను అడవిలో ఒక త్రాగుబోతు అధమజాతి స్త్రీతో సంగమించుట చూచెను. ఆ దృశ్యము చూచినంతనే, శారీరక యింద్రియ సౌఖ్యములు, వాటివలన కలిగే ఆనందము గురించి ఆలోచించుట మొదలిడెను. ఆమెతో తాను కూడ సంభోగించి, త్రాగుబోతు పొందిన ఆనందమును అతని ముఖమందుగాంచి, తాను కూడ అట్టి ఆనందమును పొందవలెనని తలంచెను.

''అజామీళుడు తన బుద్ధిని, నిగ్రహశక్తిని వినియోగించుటకు ప్రయత్నించెను కాని ప్రయోజనము లేకపోయెను శరీర సౌఖ్యమునకు బానిస అయ్యెను. కొన్ని క్షణములలో తాను అంతవరకూ నేర్చిన జ్ఞానమునూ, పాటించిన నియమ నిష్ఠలనూ మరచిపోయెను ధర్మమార్గమును తప్పెను ఆ స్త్రీకి బానిసయై, ఆమె తన సర్వస్వమను మోహములో పడెను. ఆమె ఆశలను కోర్కెలను తీర్చుటకు, జూదము, దొంగతనము చేయ మొదలిడెను. సూక్ష్మముగా చెప్పవలెనన్న, అన్ని పాపకార్యములు అతనికి సహజమయ్యెను. తల్లిని, శాస్త్రవిధిగా వివాహమాడిన భార్యను విడిచి, యీ అధమజాతి స్త్రీతో జీవించుచూ పాపకార్యములు చేయుచుండెను ఇతడు పాపి. అందుచేత శిక్షార్హుడు''.

యమకింకరుల మాటలు నారాయణుని సేవకులు విని యిట్లనిరి. ''ఈతని గురించి మీరు చెప్పినదంతయూ సత్యమే అతడు పాపాత్ముడనుటలో సందేహములేదు. కాని అతని ప్రాణము శరీరమును విడుచు సమయములో, ''నారాయణా! నావద్దకురా'' అని గట్టిగా అనెను

''అదియే అతడిని మిమ్ములనుండి రక్షించెను. గొంతెత్తి పిలిచిన వారిని భగవంతుడెన్నడూ ఉపేక్షించడు. అట్టివారిని తన భక్తులుగా పరిగణించి వారి పాపములను కడిగివేయును భగవంతుని దృష్టిలో అతడు పాపాత్ముడు కాడు, అందుచేత యమసామ్రాజ్యములో అతనికి స్థానములేదు. బహుశః మీరు, అతడు భగవంతునుద్దేశించి 'నారాయణ' అని అనలేదు, ఆ పేరుతో అతని కుమారుని పిలిచెనని అనవచ్చు. ఆ విషయము మాకు తెలియును. అయినప్పటికీ భగవంతుని నామమునకు అంతటి మహత్తర శక్తి కలదు ఆ శక్తివలన యథాలాపముగా నామము నుచ్చరించినప్పటికీ, భగవంతుడు వారిని రక్షించును. బలమైన ఔషధమును తెలియక సేవించినప్పటికీ, దాని శక్తివలన రోగి యొక్క రోగము శమించును. అదే తీరున, అజామీళుడు, ''నారాయణా! ఇక్కడకు''రా అని అనుటవలన యమ శిక్షనుండి రక్షితుడయ్యెను.

''మనిషి దొంగకావచ్చు, త్రాగుబోతుకావచ్చు. స్నేహితుని మోసగించవచ్చు, బ్రహ్మ హత్య గావించవచ్చు. గురుపత్నీగమనము చేయవచ్చు, రాజును, స్త్రీని, తండ్రిని, గోవులను హత్యచేయవచ్చు, లేక వీటన్నింటి కన్న మించిన యింకే పాపమునైన చేసియుండవచ్చు. కాని భగవంతుని నామమును ఉచ్చరించినచో, అట్టివారు అన్ని పాపములనుండి రక్షణ పొందుదురు భగవంతుని పేరుతో కుమారుని పిలిచినను, భగవంతుని నామమును యథాలాపముగా లేక వేళాకోళముగా ఉచ్చరించినను, కేవలం ఆనందము కొరకు పాడేపాటలో ఒక పదముగా భగవంతుని నామము ఉన్నను, భగవంతుని నిందిస్తూ నామమును ఉచ్చరించినను, యీ పరిస్థితులన్నిటియందు భగవన్నా   భగవంతుడు కరుణాపూరితుడై ఆ మానవుని రక్షించును ఒక మనిషి అకస్మాత్తుగా జారి మెట్లనుండి పడిపోయినప్పుడుగాని, లేక పాము కరచినప్పుడుగాని,

లేక రోగముతో బాధపడుచున్నప్పుడుగాని, అంతరంగము నుండి అలవాటుగా భగవంతుని పిలిచినచో అతడు తప్పక రక్ష పొందును. మహర్షులు, పాపములను పరిహరించుకొనుటకు అనేక మార్గములు సూచించిరి. ఒక్కొక్కపాపమును ఒక్కొక్క విధముగా పరిహరించుకొనవలెను. ఇట్లు జరిగినప్పటికీ ఆ వ్యక్తి తిరిగి పాపము చేయడని నమ్మకము లేదు. ఇవి రోగమును తాత్కాలికముగా నివారించునట్టి ఔషధములు. ఈ పద్ధతులు హృదయము నుండి పాపములను సమూలముగా నాశనము చేయలేవు. కాని నారాయణుని పాదములకు శరణాగతులైన వారి పాపములు సంపూర్ణముగా తొలగిపోవును.

''చీకటి అంతటా వ్యాపించినపుడు ఒక చిన్న దీపము ఆ చీకటిని పోగొట్టుటకు చాలదా? ఆ దీపము ప్రమ్మెయందు సరియైన నూనెను వేసి దీపము వెలుగునట్లు చేసినచో, ఆ ప్రదేశమును చీకటి ఆవరించదు. భగవన్నామము భగవంతునిపై మనస్సు కుదుర్చును. దీని పర్యవసానముగా పాపపు చింతలు మనస్సు నుండి తొలగిపోవును. అతనిలోని వాసనలు వాటంతటవి నశించిపోయి, తిరిగి పాప కార్యములను చేయకుండును. ఈ అజామీళునికి భగవన్నామము శక్తి తెలియదు. అందుచేత బహుశః నామము ప్రభావమతనికి ఉండదని మీరనవచ్చు. అది సరికాదు. ప్రమాదవశాత్తు నిప్పురవ్వ కట్టెకు తగిలినప్పటికీ, అది పూర్తిగా దగ్ధమగును. అదే విధముగా అజామీళుని పాపములన్నియు దగ్ధమయ్యెను మా మాటల యందు మీకు నమ్మకము కుదరకున్న, మీ యజమాని యమధర్మరాజును మా మాటలు సత్యమగునో కాదో అడిగి తెలుసుకొనుడు''.

66 యముని వివరణ

యమదూతలు అజామీళుని విడిచిపెట్టి తమ యజమాని వద్దకు వెళ్ళిరి. వారి అనుభవమును యజమానికి పూర్తిగా నివేదించిరి అజామీళుని తీసుకువచ్చుటకు వెళ్ళగా నారాయణుని సేవకులు యే విధముగా అడ్డుపడిరో వివరించిరి ఆ సేవకులతో జరిగిన సంభాషణ పూసగ్రుచ్చినట్లు చెప్పిరి. యమదూతలిట్లనిరి. ''ప్రభూ! ఇది వరకెన్నడును యిట్లు జరుగలేదు. మీరు ధర్మప్రభువులు. ఇంతవరకు మీరు విధించిన శిక్షనుండి యెవ్వరూ తప్పించుకొనలేదు. ఈనాడు నలుగురు విచిత్ర వ్యక్తులు మీ అధికారమున కడ్డుపడిరి. మేము అజామీళుని పట్టుకొనగా, వారు యమపాశము నుండి అజామీళుని విడిపించిరి. ప్రాణము విడుచుటకుముందు 'నారాయణ' అనెను. తక్షణమే వారు అజామీళుని చెంతకు వచ్చిరి. మా విధిని నిర్వర్తింపకుండ జేసిరి. భగవన్నామము గొప్పతనము వారు వివరించి, దానిని మీరు పూర్తిగా విశదపరచగలరని చెప్పిరి. అదెట్టిలో మాకు తెలియచెప్పవలెను వారు అధికారపూర్వకముగా చెప్పుటచేత వారి మాటలను మన్నించవలసి వచ్చెను. యమపాశము నుండి పాపాత్ములను రక్షించు యీ వింతశక్తి యేమిటో?''

యమదూతలు ఊహించిన దానికి వ్యతిరేకముగా యముడు చిరునవ్వు నవ్వి సంతోషముతో అతి సరళముగా యిట్లనెను ''మానవుల జీవితముపై నాకు విశేషమైన అధికారమున్నది. వారిని శిక్షించు అధికారము కలదు. అంతవరకు మీరు తలచినది సత్యము. కాని, నాపై మరొకరు గలరు. వారిని నేను గౌరవించి మన్నించవలెను. అతడే నారాయణుడు మీరు వస్త్రమును చూచితిరా? అది నిలువుగా అడ్డుగా దారములు వేయగా నేర్పడినది అదే విధముగా యీ లోకమను వస్త్రము భగవంతుడు నేసెను. అతడే యీ లోక

సృష్టిస్థితిలయలకు కారకుడు.

''ముక్కుకు కట్టిన త్రాళ్ళను యిటునటు లాగి యెద్దుని తోలినట్లు, యీ లోకము నందలి జీవులు వేదములనే త్రాళ్ళతో నడచుచున్నవి. మనము, ఇంద్రుడు, వరుణుడు, వాయువు, సూర్యుడు, అష్టదిక్పాలకులు, బ్రహ్మ, అగ్ని — వేయేల దేవతలందరూ కూడ నారాయణుని వైభవమును గ్రహించలేకున్నారు. అతని మాయను అంతకన్న తెలియలేకున్నారు. మానవునకు జ్ఞానేంద్రియములు — కళ్ళు, ముక్కు, చెవులు, నోరు, చర్మము — కలవు. వస్తు ప్రపంచమును జ్ఞానేంద్రియముల ద్వారా అనుభవించుటకు, అతనిలో వేరొక వస్తువు కలదు, దాని చేతనే జ్ఞానేంద్రియములు పనిచేయగలుగుచున్నవి మానవుని హృదయములో నున్న యీ వస్తువును ద్రష్ట, అనగా చూచువాడు, అందురు అతనిలో నున్న యీ వస్తువు స్వభావమును మానవు డెఱుగలేడు. మాయ మానవుని ఆవరించి యుండుట చేత, అతని బుద్ధి కలుషితమై, అతనిలో దాగియున్న ఆత్మను గుర్తించలేక పోవుచున్నాడు

''భగవంతుడు నిర్ణయించిన న్యాయమును చాలా కొద్దిమంది ... లో నేనొకడను. ఇతరులు : బ్రహ్మ, నారదుడు, సనత్కుమారుడు, కపిలుడు, మనువు, ప్రహ్లాదుడు, జనకుడు, బలి, వ్యాసుని కుమారుడు శుక్రబ్రహ్మ.

''భగవన్నామమును పదేపదే పలుకుటను భక్తి యోగమందురు భగవంతుని చేరుటకిది సులభమైన మార్గము. ఇదియే మానవు డాచరించదగు అత్యుత్తమ ధర్మము. అజామీళుడు ఒకసారి భగవన్నామము నుచ్చరించినందుకు పాపవిముక్తుడై, నా నుండి రక్షితుడయ్యెనుకదా! నిత్యమూ భగవంతుని స్మరించుట వలన పాపములు నాశమగుట మాత్రమే కాదు, ముక్తి మోక్షముకలిగి కర్మబంధముల నుండి విముక్తిని పొందును భగవద్భక్తులను సులభముగా గుర్తింపవచ్చు వారు సమబుద్ధి కలిగి యుందురు ద్వంద్వములచేత బాధనొందరు. వారు ప్రశాంత మనస్కులై యుందురు. భగవన్నామమనే కవచము వారిని రక్షించుచుండును.

''మీరెప్పుడును అట్టివారి దగ్గరకు పోగూడదు. ప్రపంచ సుఖములందు మునిగి, యితర ఆలోచనలు లేనట్టి వారి వద్దకే మీరు వెళ్ళవలెను. వారు భార్య, పిల్లలు, యిల్లు, సంపద, సుఖ సంతోషములపై ప్రేమ యను మాయలో పడుచుందురు. భగవంతుని నామమును ఒక్కసారైనా ఉచ్చరించని వారిని, భగవత్కథలను ఒక పర్యాయమైనను వినని వారిని నా దగ్గరకు తీసుకు రండు. భగవన్నామము సకల పాపములను కడిగివేయునని మీరు బాగుగా గుర్తుపెట్టుకొనవలెను. జపతపములు, వ్రతములు మొదలైన వాని వలన భగవదనుగ్రహము యెక్కువగా కలుగదు. నారాయణుని భక్తులకు నా నుండి యెట్టి శిక్ష ఉండదని మీరు గుర్తుంచుకొనుడు''.

ఇంతలో అజామీళుడు, మృత్యు పాశము నుండి తనను రక్షించిన వారి పాదములపై బడెను. అతడు మాట్లాడబోవునంతలో, వారు అదృశ్యమైపోయిరి. నారాయణుని సేవకులకు యమదూతలకు జరిగిన సంభాషణను అజామీళుడు పూర్తిగా విని యుండెను.

ఇంత వరకు గడిపిన జీవితమును తలచుకుని అజామీళుడు విచారముతో నుండెను తనలో తానిట్లనుకొనెను. ''నేను చాలా పాపాత్ముడను. దేహ సౌఖ్యముల ప్రలోభములకు వశుడనై అధమ స్థితికి దిగజారితిని సత్పురుషులందరూ నా ప్రవర్తనను నిరసించి ద్వేషింతురు. నా భార్యను, తల్లిదండ్రులను వదలిపెట్టితిని వారిని చివరవరకు పోషించి గౌరవించవలసి యుండెను.

''నేను మిక్కిలి పాపాత్ముడ నన్నది నిజమే, కాని భగవంతుని సేవకులను చూచు భాగ్యము కల్గినది. పూర్వ జన్మలో నేను కొన్ని సత్కార్యములు చేసియుండవచ్చు, లేకున్న యిట్లు జరుగుట అసంభవము. ఈ పాపాత్ముని నోరు భగవన్నామము పలుకుటయూ జరుగదు. అహో ఆ పవిత్ర నామమునకు అతి పాపాత్ముడనైన నాకు యెంతటి అంతరమో కదా? నాకు మరొక అవకాశము కలిగినది. నా పాపములన్నియు ప్రక్షాళితములైనవని భగవంతుడే అభయమిచ్చినాడు. ఇక నూతన జీవితమును జీవించెదను. నాకు నూతన జీవితము ప్రసాదించినాడు. దీనిని సద్వినియోగ పరచెదను. అజ్ఞానము నరికట్టెదను. కర్మ బంధముల నుండి విముక్తికి ప్రయత్నించెదను అందరి మానవులతో స్నేహపూర్వకముగా మెలగెదను. మనశ్శాంతి కలిగియుండి, పాపభూయిష్టమైన యీ లోకమునుండి స్వేచ్ఛను పొందుటకు శాయశక్తులా ప్రయత్నించెదను''.

క్షణ కాలము ఉత్తములైన నారాయణ సేవకుల సాంగత్యము చేత అజామీళుడు సన్యసించుట కుపక్రమించెను. నారాయణునికి అత్యంత భక్తుడయ్యెను. అతని కెట్టి అనుబంధములు లేవు. గంగా తీరము చేరి భగవంతుని ధ్యానించెను అతని శ్రద్ధాసక్తులు అతి తొందరలోనే అతనికి యీ శరీరము నుండి విముక్తిని కలిగించినవి. ఇది వరకు చూచిన నారాయణుని సేవకులను గాంచి, వారికి నమస్కరించెను. ప్రాణము నిష్క్రమించిన తర్వాత అతని శరీరము గంగాతీరమున పడియుండెను. అజామీళుడు భగవంతునిలో ఐక్యమయ్యెను.

67 దక్షుని వంశీయులు

ప్రచేతస సోదరుల కుమారుడైన దక్షుడు అశికిని వివాహమాడెను వారికి అరువది మంది పుత్రికలు కల్గిరి ఆమన్వంతరమందు వీరిచే మానవాభివృద్ధి జరిగెను వారిలో పదిమందిని ధర్మునకు, పద ముగ్గురుని కశ్యప ప్రజాపతికి, యిరవై యేడుగురిని చంద్రునకు యిచ్చి వివాహము చేసెను భూత, అంగిరస, కృశాశ్వులకు చెరి యిద్దరిని, తార్క్షునకు నలుగురిని యిచ్చి దక్షుడు వివాహము చేసెను కశ్యపునికి మరియొక పేరు తార్క్షుడని కొందరు చెప్పుదురు నంది దక్షుని వారసులలో ఒకడు దక్షుని కుమార్తెలలో ఒకరి పుత్రులు విశ్వేదేవులు. మరుద్వతి కుమారులు మరుద్వముడు, జయంతుడు. జయంతునకే ఉపేంద్రుడని మరియొక పేరు. ఉపేంద్రునియందు వాసుదేవుని అంశ గలదు. దక్షుని కుమార్తెలలో ఒకరైన సంకల్పకు ఒక కుమారుడు కలడు. అతని పేరు కూడ సంకల్పుడు అతని పుత్రుని పేరు కాముడు. దక్షుని కుమార్తె వసువుకు అష్ట వసువులు కలిగిరి. వారు : ద్రోణ, ప్రాణ, ధ్రువ, అర్క, దోష, వసు, విభావసు, అగ్ని

అష్ట వసువులలో ఒకడైన వసువు భార్య అంగిరసి. వారి పుత్రుడు విశ్వకర్మ. ఇతడు దేవతా మందిరములు నిర్మించు నేర్పు గలవాడు విశ్వకర్మ కుమారుడు చక్షుషుడు ఇతడు, తర్వాత మన్వంతరమందు మనువు అయ్యెను

భూతుని భార్య సరూపకు కోట్ల కొలది రుద్రులు జన్మించిరి వీరిలో పదునొకండ్రు రుద్రులు ప్రఖ్యాతి గాంచిరి వారు రైవత, అజ, భవ, భీమ, వామ, ఉగ్ర, వృషాకపి, అజైకపతి, అహిర్బుధన్య, బహురూప,మహా తార్క్షుని భార్యలు వినత, కద్రువ, పతంగి, యామిని. పతంగి పక్షులకు, యామిని క్రిమికీటకములకు తల్లులైరి వినతకు ఇద్దరు పుత్రులు, వారిద్దరు ప్రఖ్యాతి పొందిరి ఒకడు సూర్యుని రథసారథి యైన అరుణుడు

రెండవవాడు నారాయణునికి వాహనమైన గరుడుడు కద్రువకు సర్పములు - శేష, వాసుకి, తక్షక, కర్కోటకాదులు జన్మించిరి.

చంద్రుని భార్యలు తారలు ఇరువది యేడు తారలలో చిత్ర, కృత్తిక, రోహిణి ప్రధానమైనవారు

కశ్యపుని భార్యలు అదితి, దితి, ధను, కద్రు, అరిష్ట, సురస, ఇల, ముని, క్రోధవశ, తామ్ర, సురభి, సరమ, తిమి సముద్రములోని జంతువులకు తిమి తల్లి అయ్యెను. వీనిలో ప్రధానమైనది తిమింగిలము క్రూర మృగములు, తదితర జంతువులు సరమకు జన్మించెను. సరమకు జన్మించిన ఒక శునకము పేరు సారమేయుడు.

సురభికి ఆవులు గేదెలు జన్మించెను. తామ్రకు డేగలు, గ్రద్దలు మున్నగు వారు కలిగిరి. మునికి స్వర్గములోని అప్సరసలు కలిగిరి. క్రోధవశ విషపూరితమైన కోరలు గలిగిన సర్పములకు తల్లి అయ్యెను ఇలకు వృక్షములు పుట్టెను. అరిష్టకు గంధర్వులు పుట్టిరి. మెత్తని పాదములు గల జంతువులు కద్రుకు పుట్టెను

ధనుకు అరువది మంది పుత్రులు కలిగిరి. వారిలో శంబరుడు, హయగ్రీవుడు, విభావసుడు, వృషపర్వుడు, స్వర్భానుడు, వైశ్రవసుడు, మున్నగువారు కలరు స్వర్భానుని కుమార్తెయైన సుప్రభను నముచి పెండ్లాడెను వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ ఆమె నహుషుని కుమారుడైన యయాతికి భార్య అయ్యెను. ధను మరొక కుమారుడైన వైశ్వానరునకు నలుగురు అందమైన కుమార్తెలు కలిగిరి. వారు ఉపదానవి, హయశిర, పులోమ, కాలక. ఉపదానవి హిరణ్యాక్షుని వివాహమాడెను. ఆమె చెల్లెలు హయశిరను క్రతువు పెండ్లాడెను కశ్యప ప్రజాపతి పులోమ కలకలను వివాహమాడెను వీరిద్దరి పుత్రులు గొప్ప యుద్ధవీరులు వారు కాలకేయ, నివాతకవచు లను భీకర రాక్షసులుగా పేరు పొందిరి తరువాత కాలములో అర్జునుడు వారిని జయించెను ధను కుమారుడు విప్రచిత్తి, హిరణ్యకశిపుని కుమార్తె సింహికను వివాహమాడెను వారికి నూర్గురు పుత్రులు వారిలో జ్యేష్ఠులు రాహు కేతువులు. వీరు నవగ్రహములలో స్థానమును పొందిరి

దక్షుని కుమార్తె అదితి చాలా ధన్యురాలు భ అవతరించినపుడు అదితిని తల్లిగా యెంచుకొ ని మరియొక పేరు. అదితి కుమారులు వివస్వంతుడు, అర్యముడు, పూషుడు, త్వష్ట సవితృడు, భగుడు, ధాత, విధాత, వరుణుడు, మిత్రుడు, శక్రుడు, ఉరుక్రముడు

శ్రద్ధదేవ, మను, యమ, యమి వివస్వంతునకు కలిగిరి వివస్వంతుని భార్య సంధ్య ఆడ గుఱ్ఱము రూపుదాల్చి అశ్విని దేవతలకు తల్లి అయ్యెను

వివస్వంతుని మరొక భార్య ఛాయ ఆమెకు శనైశ్చరుడు, మనువైన సవర్ణి కుమార్తె తపతి కలిగిరి అర్యముని భార్య మాత్రిక. ఆమె సంతానము మానవులుగా ఉండునట్లు బ్రహ్మ నిర్దేశించెను

పూషునకు సంతానము లేకపోయెను మహాదేవుని దక్షుడు అవమానించినపుడు నవ్విన వారిలో పూషుడు ఒకడు. తరువాత అతని దంతములు విరిగెను. అందుచే అతడు నమలలేకపోవుట చేత ద్రవ పదార్థములను మాత్రమే గ్రహించుచుండెను త్వష్ట రచనను, ఆమె సోదరిని వివాహమాడెను. వారి కుమారులు విశ్వరూపుడు,సన్నివేశుడు దేవతలను వారి గురువు వదలి పెట్టినపుడు, వారు విశ్వరూపుని గురువుగా ఉండమని ప్రార్థించిరి

పరీక్షిత్తు అద్భుపడి యిట్లనెను. ''ఆహా! ఎంత అద్భుతముగా నున్నది! దేవతలను ఆ గురువు యెందుకు వదలిపెట్టెనో చెప్పవలెను? బహుశః వారు తమ గురువునకు తీరని అపచారము గావించి ఆగ్రహము కల్గించి యుండవచ్చు. లేకున్న బృహస్పతి యెన్నడూ ఇంద్రునిపై గాని అతని ప్రజలపై గాని క్రోపము వహించలేరు. నాలో కలిగిన యీ కుతూహలమును మీరు తీర్చవలెను.''

శుకబ్రహ్మ, పరీక్షిత్తు కుతూహలమునకు చిరునవ్వు నవ్వి యిట్లనెను.''అది పెద్ద గాథ. ఆ గాథను మీకు చెప్పుట నాకు చాలా సంతోషము''.

68 వృత్రాసురుని జననము

స్వర్గ లోకములకు ప్రభువగుటచేత ఇంద్రునికి గర్వము హెచ్చెను.ఒకప్పుడు శచీదేవితో కూడి సింహాసనముపై కూర్చుండెను. స్వర్గ లోకములోని ఇంద్రుని సేవకులందరూ ఇంద్రుని చుట్టూ జేరి యుండగా, గంధర్వులు అతని కీర్తిని శ్లాఘించుచుండిరి. తమ నృత్య కౌశలమును అప్సరసలు ఇంద్రుని సభలో ప్రదర్శించుచుండగా, గంధర్వ కిన్నరులు గానము చేయగా, ఇంద్రుడత్యంత వైభవముతో ప్రకాశించుచుండెను. సప్తర్షులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అశ్వినీ దేవతలు, అష్టదిక్పాలకులు ఇంద్రుని వైభవమును కొనియాడుచుండిరి.

దేవతలకు గురువైన బృహస్పతి ఇంద్రుని సభకు వచ్చెను. అహంభావ పూరితుడైన ఇంద్రుడు సింహాసనము నుండి లేచి గురువగు బృహస్పతిని గౌరవించకుండెను. ఈ అవమానమును బృహస్పతి సహించలేకపోయెను. ఏమియు మాట్లాడక, గర్వముగా సింహాసనముపై కూర్చున్న ఇంద్రుని చాలాసేపు తేరిపార జూచి, వెను దిరిగి అక్కడనుండి వెళ్ళిపోయెను. అక్కడ నుండి వెళ్ళిన బృహస్పతి యింటికి చేరుకొనెను. తన గురువు వెళ్ళిన తర్వాత, ఇంద్రుడు తాను చేసిన అపరాధ మెంతటి తీవ్రమైనదో గ్రహించెను. తనను తానిట్లు నిందించుకొనెను. ''గర్వము చేత నా కులగురువును అవమానపరచితిని. తక్షణమే వెళ్ళి అతని పాదములపై పడెదను. క్షమాపణ వేడుకొందును''. ఇంద్రుడు అతి తొందరగా బృహస్పతి గృహము సమీపించెను. కాని బృహస్పతి, ఇంద్రుని ఆలోచనలు ముందుగనే గ్రహించినవాడై, అదృశ్యుడయ్యెను. అందుచేత ఇంద్రుడు బృహస్పతిని కనుగొన లేకపోయెను. ఇంద్రుని కేమి చేయుటకు పాలుపోకుండెను.

ఇంద్రుని గురువు బృహస్పతి కనుపించకుండుటచేత, ఇంద్రుడు నిస్సహాయుడయ్యెనను వార్తనలుదిక్కులా వ్యాపించెను. ఇంద్రునకు గురువు లేకుండుట కనిపెట్టి, యిదే అరనని తలచి రాక్షసులు తమ గురువైన శుక్రుని సలహాపై స్వర్గలోక ప్రభువైన ఇంద్రునిపై యుద్ధము ప్రకటించిరి. దేవతలు చిత్తుగా ఓడిపోయిరి. అసురుల ఆయుధములకన్న పదవీచ్యుతి దేవతల నెక్కువగా బాధించెను. వారు బ్రహ్మ కడకేతెంచి తమ దుస్థితిని నివేదించిరి. వారేమి చేయవలెనో సలహా యివ్వమని బ్రహ్మను కోరిరి.

దేవతలపై, ముఖ్యముగా ఇంద్రునిపై జాలిపడి బ్రహ్మ యిట్లనెను. ''ఇంద్రుడా! గర్వముచేత నీవు గొప్పవాడైన బృహస్పతిని అవమానించినావు. ఇట్లు జరుగుట చాలా దురదృష్టకరము. నేనొక సలహా

యిచ్చెదము. త్వష్టుని కుమారుడైన విశ్వరూపుని వద్దకు యిప్పుడే వెళ్ళుము. అతడు నీకు సహాయము చేయగలడు. అతడు చాలా గొప్పవాడు, నీకు సహాయము చేయుటకు తగినవాడు. దేవతలకు గురువుగా నుండుటకు నీ వతనిని అంగీకరించునట్లు చేయవలెను. అత డసురుడగుట చేత అతని సానుభూతి అసురులపై నుండగలదు. ఆ విషయము నీవు విస్మరించి, అతనిని గురువుగా ఉండవలసినదిగా కోరవలెను. అతడు సహాయము చేయగలడు''.

దేవతలు విశ్వరూపుని వద్దకు వెళ్ళి అతని పాదములపై పడగా, ఇంద్రుడతనితో యిట్లనెను. ''మేము నీ వద్దకు యాచకులుగా వచ్చితిమి. నీకు మేము ధర్మ సూక్ష్మములు చెప్పుటకు రాలేదు. కాని వేదములను బోధించు గురువు వేదములు మూర్తీభవించిన వాడని నీకు గుర్తుచేయుచున్నాము. ప్రజాపతి ప్రతిబింబము తండ్రి, భూమి యొక్క ప్రతిబింబము తల్లి. సోదరుడు ఇంద్రుని ప్రతిబింబము, కరుణకు ప్రతిబింబము సోదరి. ఆహ్వానించని అతిథి ధర్మదేవత, ఆహ్వానించిన అతిథి అగ్నికి ప్రతిరూపము. అన్ని జీవులూ భగవత్స్వరూపములు. అందుచేత మమ్ములను నీతో సరిసమానముగా యెంచవలెను. నీవు మాకు గురువునై మాకు జయము కలుగునట్లు చేయవలెను. నా కంటె వయస్సులో నీవు చిన్నవాడవు. కాని నేనడిగిన వరము నీవు ప్రసాదించ నున్నావు కాబట్టి నీ పాదములకు ప్రణమిల్లుచున్నాము. నీవు మాకు గురువగుటచేత వయస్సుతో నిమిత్తము లేక నీకు నమస్కరించుచున్నాము. మా కోరికను మన్నించి మాలో ఒకరుగా నుండవలసినదిగా ప్రార్థించుచున్నాము''.

వారిని చూచి విశ్వరూపుడు చిరునవ్వుతో యిట్లనెను. ''గురు పదవి నాకు యోగ్యమైనది కాదు. గురుత్వము వహించినచో, ఋషుల బ్రహ్మ తేజస్సు కలుషిత మగునని జ్ఞానులు చెప్పుదురు. కాని మీరు క్లిష్ట పరిస్థితుల్లో నుండి నా సహాయము కోరుచున్నారు. కష్టములో నున్న వారిని ఆదుకొనుట ధర్మము. అందుచేత మీ కోరికను మన్నించెదను. ఈ గురు పదవిని చేబట్టి నన్ను త్యాగము చేయవలసినదని మీరు కోరుట చేత నేను సంధిగ్దములో పడినాను. అయినప్పటికీ మీ కోరికను కాదనలేను. మీకు గురువుగా నుండుట నాకు సమ్మతమే''.

విశ్వరూపుడు వారికి గురువయ్యెను. అతనికి అనేక కళలందు పరిచయముండుటచేత, వారు పోగొట్టుకున్న దానిని తిరిగి వారు పొందునట్లు చేసెను. అతి శక్తివంతమైన నారాయణ కవచమును అతడు ఇంద్రునకు తొడిగెను. మరియు దేవతలకు ప్రభువైన ఇంద్రునకు 'ఓం నమో నారాయణాయ' అను పవిత్ర మంత్రమును ఉపదేశించెను. ఈ మంత్రము ప్రతి అవయవము, మనస్సు, కర్మ నారాయణ చింతతో నిండియుండునట్లు చేసి, కీడు కలుగకుండ కవచమువలె రక్షించును. 'ఓం నమో నారాయణాయ' అని పదే పదే ఉచ్చరించుటయే యీ కవచము యొక్క రహస్యము. ఈ కవచమును తొడిగి ఇంద్రుడు అసురులతో యుద్ధము చేసి జయము పొందెను. ఒకప్పుడు విశ్వరూపుడు గురుత్వము వహించగా ఒక యజ్ఞమును జరిపెను. దేవతలకు ప్రభువైన ఇంద్రునికి గురువుగా, విశ్వరూపుడు యజ్ఞహవిస్సును దేవతలు స్వీకరించుటకు ఆయా దేవతలను ''ఇంద్రాయ ఇదం'', ''వరుణాయ ఇదం'' అని ఆవాహన చేయవలసి వచ్చెను.

విశ్వరూపుడు అసురజాతికి చెందిన వాడగుటచేత, సహజముగా అసురుల యెడ పక్షపాత వైఖరి గలవాడై, చిత్రమైన తంత్రము నుపయోగించి, యజ్ఞహవిస్సు అసురులకు చేరునట్లుగా మంత్రముల నుచ్చరించి ఆవాహన చేసెను. ఇంద్రుడు తన గురువు మోసగించుచున్నాడని కనిపెట్టెను. ముందుగానే యిటువంటిది జరుగగలదని

బ్రహ్మ ఇంద్రుని హెచ్చరించి, దానిని సహించవలెనని చెప్పెను. కాని ఇంద్రుడు, గురువు మోసము చూసి సహించలేకపోయెను తన ఖడ్గమును తీసుకుని విశ్వరూపుని మూడు తలలు నరికివేసెను. మూడింటిలో 'సోమపీత' మను దానిని మొట్టమొదట నరికివేసెను. ఆ తలతో సోమరసమును త్రాగుచుండుట చేత ఆ తలకు 'సోమపీత' మను పేరు కల్గెను. ఈ తల శరీరము నుండి విడివడగానే కపింజల అనే పక్షిగా రూపొందెను రెండవది సురను త్రాగుటచే 'సురపీత' మను పేరు పడిన తల కళావింగమను పేరుగల పక్షిగా మారెను మూడవ తల అన్నము తినుటచేత 'అన్నాదం' అను పేరు పడిన తిత్తిరి పక్షి అయ్యెను.

బ్రాహ్మణుని తలలు నరుకుట చేత ఇంద్రుడు బ్రహ్మహత్యా పాతకమునకు గురి అయ్యెను. ఒక ఏడాది ఇంద్రుడు బాధపడవలసి వచ్చెను సంవత్సరము తర్వాత భూమిని, వనితలను, వృక్షములను తన యొక్క బ్రాహ్మణ హత్యా పాపమును పంచుకుని, తనకు పాప విముక్తిని కల్గించమని ఇంద్రుడు కోరెను దానికి ఫలితముగా వారి కనేక వరముల నొసంగెను. వాటి వలన క్రమేపి బ్రహ్మహత్యా పాప ప్రభావము వారిపై అంతరించునట్లు చేసెను.

తన కుమారుని చంపినందుకు త్వష్టునకు ఇంద్రునిపై ఆగ్రహము కలిగెను త్వష్టుడు ఒక హోమ కార్యము జరిపి యిట్లు ఆవాహన చేసెను. ''ఓ ఇంద్రశత్రూ! లెమ్ము బయిటకు వచ్చి తొందరగా నీ శత్రువును వధింపుము''. హోమ కార్యము పూర్తి అయిన వెంటనే ఆ హోమాగ్ని నుండి ఒక భయంకర రూపము వెలువడెను అతడు నల్లగా లావుగా నల్లని మేఘముల గుంపువలె కన్పట్టెను అతని జుట్టు, కనులు రాగి వర్ణములో నుండెను మిట్ట మధ్యాహ్నపు సూర్యుని వేడిమివలె అవి తీవ్రముగా నుండెను అతని చేతిలో ఒక త్రిశూలము గలదు అతనిని చూచినవారు భయపడి అక్కడ నుండి పారిపోయిరి అతని రూపము, స్వరము, అరుపు చాలా భయంకరముగా నుండెను. అతని పేరు వృత్రుడు

69 ఇంద్రునకు వజ్రాయుధము లభించుట

వృ   యకత్వము వహించి దేవతలపై దండెత్తెను అతని మహత్తర శక్తిముందు దేవతలు నిలువలేకపోయిరి దేనివలననూ వృత్రుని అణచుటకు సాధ్యము కాకుండెను దేవతల అస్త్రము లన్నియు నిష్ఫలమయ్యెను. త్వష్టుని కుమారుడైన వృత్రుడు, దేవతల అస్త్రములను మ్రింగివేయుచుండెను దేవతల అస్త్రములు తనలో నుండుటచేత వృత్రుడు మరింతగా ప్రకాశించుచుండెను.

భయముతో నిలువలేక దేవతలు పారిపోయిరి ఆదిపురుషుడైన నారాయణుని వద్దకు దేవతలు వెళ్ళిరి నారాయణుడు వారికి దర్శనమిచ్చి యిట్లనెను ''మీరు నిర్భయముగా నుండుడు నేను మీకొక పద్ధతి సూచించెదను అది వృత్రుని నాశనము చేయగలదు మీరు దధీచి మహర్షి వద్దకు వెళ్ళవలెను. ఆ మహర్షి అశ్వినీ దేవతలకు బ్రహ్మ విద్యను బోధించెను దానికి ప్రతిఫలముగా అశ్వినీ కుమారులు అతనికి అమృతత్వము ప్రసాదించిరి. మీరు దధీచి వద్దకు వెళ్ళి, అతని బలమైన అత్యంత శక్తితో కూడిన ఎముకలను యివ్వవలసినదని కోరవలెను. త్వష్టునకు అజేయమైన కవచమును ప్రసాదించినవాడు దధీచి అతడు తన కుమారునకు దానినివ్వగా, తి   కిచ్చెను అతడు దానిని ఇంద్రుని కిచ్చెను మీరు అశ్వినీ దేవతలను

తోడుగా తీసుకువెళ్ళి, వారి సహాయముతో మీరు దధీచి మహర్షి శరీరమును కోరినచో అతడు తప్పక శరీరమును మీ కొరకు త్యాగము చేయును ఆ శరీరములోని ఎముకలను భయంకరమైన ఆయుధముగా తీర్చిదిద్ద వలసినదిగా విశ్వకర్మను కోరవలెను. అప్పుడది వజ్రాయుధమగును. నా సహాయ సంపత్తులు తోడుకాగా, ఆ వజ్రాయుధముచేత వృత్రుడు అంతమొందును. ఆ ఆయుధముచేత అతని తల తెగి మరణించిన వెంటనే మీ వెనుకటి ఔన్నత్యము, అస్త్రములు తిరిగి మీకు లభించగలవు''.

దేవతలు దధీచి మహర్షి వద్దకు వెళ్ళి, అతని యెదుట సిగ్గుతో తలవంచుకుని నిలబడిరి అతని పాదములపైబడి, ఇంద్రుడు సంకోచించుచు, తగ్గు స్వరముతో తనకొక సహాయము చేయవలసినదని అర్థించెను ముసలి మహర్షి మౌనముగా చిరునవ్వు నవ్వుచూ ఇంద్రుడు కోరు అభ్యర్థనకైవేచి చూచుచుండెను. ఇంద్రుడు దధీచి శరీరము నందలి యెముకలు కావలెనని కోరుచు, తన కోరికకు కారణమును వివరించెను

దధీచి చిరునవ్వుతో వారి అభ్యర్థన పట్ల నిరసన తెల్పుచు యిట్లనెను. ''దేవతలారా! మరణము యెంతో వైరాగ్యము పొందిన వారికి కూడ ఆమోద యోగ్యము కాదు. మీకు మతిపోయినట్లున్నది. భగవంతుడే వచ్చి అడిగిననూ, యే మానవుడూ తన ప్రాణమును త్యజించుటకు యిష్టపడడు నాకు మరణించవలెనని లేదు. నాకు అమృతత్వము లభించినది ఆ భాగ్యమును మీకొరకు నేనెందుకు పోగొట్టుకొనవలెను నేను మరణించుటకు యిష్టపడను, యీ శరీరమును త్యజించలేను ''

దేవత లిట్లనిరి ''ప్రభూ! మీరు చాలా గొప్పవారు. కష్టములో నున్న వారిపై మీ ప్రేమ, కరుణ అపారము. అటువంటి మీరు యీ విధముగా మాట్లాడుట యెట్లు తగును? ఏ మానవుడైననూ, తన బాధను నివారించుకొనుటకు తగిన శక్తి సంపదలను కలిగియున్నచో, ఇతరుల సహాయమును యెన్నడూ కోరడు కాని యిప్పుడు మేము క్లిష్ట పరిస్థితిలో ఉన్నాము దీనిని నివారించుటకు మేము యేమియు చేయలేని స్థితిలో మున్నాము. మేము కోరిన కోరిక యెంత నీచమైనదో గ్రహించి కూడా, యీ సహాయమును మీ నుండి కోరవలసి వచ్చెను మేము రక్ష పడయుటకు యిదొక్కటే మార్గము దయచేసి మీరు దీనిని మాకు ప్రసాదించవలెను''.

దధీచి యిట్లనెను. ''మీ వాదనను త్రోసిపుచ్చుటకు వీలులేని విధముగా నన్ను యిరకాటములో పెట్టినారు కష్టములో మన్న వానికి సహాయపడలేని మానవుడు ఉన్నత లోకములకు వెళ్ళలేడు మీ కొరకు నేను మరణించ నిశ్చయించుకున్నాను కరుణ కలిగిన మానవుడు, యితరుల కష్టములు తనవిగా భావించి పరిగణించును ఈ విషయము తెలిసికూడా, కష్టములో నున్నవారికి సహాయపడక వారికి కష్టముల నుండి విముక్తి కలిగింపని మానవునకూ వృక్షమునకూ భేదము లేదు మీ దుస్థితి నుండి కాపాడుటకు సహాయము చేసెదను మీరు ఆందోళన చెందవలసిన అవసరము లేదు నా శరీరమును పరిత్యజించిన, అది మీకు వినియోగపడునని నారాయణుడే స్వయముగా చెప్పెను ''

దధీచి మహర్షి బ్రహ్మముపై మనస్సు లగ్నము చేసి సమాధిలోనికి వెళ్ళెను దేవతలు కోరిన తన శరీరమును పరిత్యజించెను. అతని శరీరములోని బలమైన ఎముకలను తీసుకొని వెళ్ళి విశ్వకర్మకు యిచ్చిరి.

విశ్వకర్మ ఆ ఎముకలతో పిడుగువంటి అతి భయంకరమైన ఆయుధమును రూపొందించెను. అది లోకములో వజ్రాయుధమని పేరు గాంచెను

షష్ఠమ స్కంధము

70 ఇంద్ర వృత్రాసురుల యుద్ధము

తనకు యిష్టమైన ఐరావతము నధిరోహించి, ఇంద్రుడు వృత్రాసురునిపై యుద్ధమునకు సిద్ధపడెను. ఇంద్రుని నాయకత్వములో దేవతలందరూ వృత్రాసురుడు తన సేనతో నిలిచియున్న ప్రదేశమును చేరుకొనిరి నర్మదా నదీ తీరమున ఇంద్రునికి వృత్రాసురునికి మధ్య భయంకర పోరాటము సాగెను. అసురులందరూ వృత్రాసురుని వైపు చేరిరి. వారిలో నముచి, శంబర, హయగ్రీవ, పులోమ, వృషపర్వ, హేతి, ప్రహేతి, మాలి, సుమాలి, మున్నగువారు ప్రధానులు ఇంద్రుని పక్షమున ఏకాదశ రుద్రులు, అష్ట వసువులు, ద్వాదశాదిత్యులు, అశ్వినీ దేవతలిద్దరు, నలుగురు పితృ దేవతలు, నలుబది తొమ్మండ్రు అగ్నులు, నలుబది తొమ్మండ్రు మరుత్తులు, పదుగురు విశ్వేదేవతలు, యింకా మరెందరో గలరు.

యుద్ధము చాలా భీకరముగా నుండెను. అసురుల అస్త్రములు యిప్పుడు దేవతల నేమియు చేయలేకపోయెను. అల్ప మనస్కులాడు మాటలకు ధీరులైన సజ్జనులు చలించనట్లు దేవతలు స్థిరముగా నిలిచి పోరాడిరి దేవతలు పైచేయిగా నుండిరి అసురులు యుద్ధభూమి విడిచి పరుగెత్తి పారిపోవుచుండిరి అసురులలో ధైర్యము సడలుట జూచి వృత్రాసురుడు ఆగ్రహావిష్టుడయ్యెను అతడు స్వరము హెచ్చించి యిట్లనెను.

''మీరందరూ నేను చెప్పునది వినండి. మరణమునెవరూ తప్పించుకొనలేరు ఒకసారి జన్మించిన మీరందరూ మరణించుట తథ్యము. మరణము అనేక విధములుగా సంభవించును ప్రతి ఒక్కరినీ, యేదో ఒక విధముగా వంటప్పుడు, ఎప్పుడో ఒకనాడు మరణించవలసి యున్నపుడు, మీరు ఆగి మరణము గురించి ఒకసారి యోచించుట సమంజసము కాదా? మరణము అనివార్యమైనపుడు, యీ భూమిపై జీవితము ముగిసిన పిమ్మట ఆ మరణము వల్ల పేరు ప్రఖ్యాతులు పొంది స్వర్గము నలంకరించ గలిగినపుడు, మరణము కోరుట శ్రేయస్కరము కాదా? యోగములో యీ భౌతిక కాయమును విడనాడుట, యుద్ధ భూమిలో వెనుతిరుగక పోరాడుట, యీ రెండునూ కోరుకొన దగినవి. ఇవి అందరకూ సాధ్యము కాదు చాల కొద్ది మందికే యిది సాధ్యమగును అందుచేత మీరు మరణమునకు భయపడవలదు జీవితమున కంతము యెట్లును తప్పదు''

అసురు లతని మాటలను వినకుండిరి అప్పుడు దేవతలవైపు తిరిగి వృత్రాసురుడు కోపముతో యిట్లనెను. ''పారిపోవుచున్న యీ అసురులను వేధించి యేమి ప్రయోజనము? మీ దగ్గర నుండి భయముతో పారిపోవుచున్న వారికి బాధ కల్గించుట మీకు గౌరవప్రదము కాదు. మీకు ధైర్యమున్నచో నా యెదుట నిలిచి నాతో యుద్ధము చేయుడు''

వృత్రుడు పెట్టిన కేకకు దేవతల గుండెలు భయముతో అదిరెను. తన శూలమునెత్తి యేకాకిగా వృత్రుడు దేవ సేనలో ప్రవేశించి, వారిని నాశనము చేయ మొదలిడెను. ఇంద్రుడు వృత్రునిపైకి ఒక పెద్ద గదను విసరగా, వృత్రుడు యెడమ చేతితో పట్టుకుని, అటు యిటు దాని నూపి ఇంద్రుని ఐరావతముపైకి విసిరెను ఆ గదా ఘాతమునకు ఐరావతమునకు కొద్దిగా దెబ్బ తగులగా, ఆ యేనుగు కొన్ని అడుగులు వెనుకకు మరలెను విరోధి కష్ట పరిస్థితిని గమనించి, వృత్రుడు మరల గదను ప్రయోగించకుండెను ఇంద్రుడు తిరిగి వృత్రునిపై

దాడి సలుపుట గాంచి, వృత్రుడు నవ్వి ఇంద్రునితో యిట్లనెను. ''నీవంటి పాపాత్మునితో యుద్ధము చేయుట నా అదృష్టము. నాకు సోదరుడు, నీకు గురువు అయిన ఒక బ్రాహ్మణుని హత్య గావించినావు. అతడు నీ మంచినే తలపెట్టినాడు. ఈ శూలమును నీ హృదయములోనికి పోనిచ్చి, నా చనిపోయిన సోదరుని ఋణము తీర్చుకొందును. నీ వజ్రాయుధమును నాపై నీవెందుకు ప్రయోగించుటలేదు? నేనన్న నీకు భయమా? లేక ఆ ఆయుధము పనిచేయదని సంశయమా? నారాయణుని పనుపుపై ఒక మహావ్యక్తిశరీరము నుండి తీర్చిదిద్దినది యీ వజ్రాయుధము. దానికి శక్తి దధీచి వలన కలిగి, నారాయణునిచే పవిత్రమైనది. నాపై వజ్రాయుధమును ప్రయోగింపుము. భగవంతుడున్నచోట జయము తథ్యము. నా వరకు నేను భగవంతుని తలచి, నా ఆలోచనలు భగవంతుని చింతనలో నిండియుండునట్లు చేయుదును. నేను చనిపోయినచో యీ పాపభూయిష్ఠమైన శరీరమును వదలిపెట్టుదును. అందుకు నేను విచారించను. నాపై వజ్రాయుధము ప్రయోగించుము. ఒక పాపాత్మునికి చేసిన విన్నపము ఫలించనట్లు, యీ వజ్రాయుధము నాపై పనిచేయదని నీకు భయమా? నీవు విసరిన గద నిష్ఫలమైనట్లే యీ వజ్రాయుధము గూడ నిష్ఫలమగునని తలచుచుంటివా? ఆందోళన చెందకుము. నారాయణుని ఆశీర్వాదమొందిన యీ వజ్రాయుధము నిష్ఫలముకాదు. నీవు తప్పక నన్ను వధించెదువు''.

అనుకొనని యీ సంఘటనకు ఇంద్రుడు నిరుత్తరుడై నిలుచుండెను. ఇటువంటి మాటలను యెవ్వరును శత్రువునుండి వినబోరు. దేవతల సేన అంతయు నిశ్శబ్దముగా వృత్రుని మాటలను వినుచుండెను. వృత్రాసురుడు తిరిగి యిట్లు కొనసాగించెను.

''నావరకు నేను మనస్సును నారాయణుని పాదములపై లగ్నము చేసియున్నాను. నేను చనిపోయినట్లయితే యీ శరీరమనే బంధము నుండి విముక్తి కలుగును. తపస్సు చేసి యోగులు పొందు స్థితిని నేను పొందెదను. భగవంతుడు, తాను ప్రేమించిన భక్తులకు యీ ముల్లోకములలో సంపద నొసగడు. ఎందుచేతనో తెలుసా? సంపద ద్వేషమునకు, భయమునకు, మానసిక బాధకు, అహంభావమునకు, శత్రుత్వమునకు, విచారమునకు, నిస్త్రాణకు కారణమని భగవంతునికి తెలియును. ఇంద్రా! వీటన్నింటి నుండి భగవంతుడు స్వేచ్ఛను ప్రసాదించుటేగాక యింకను ఆశీర్వదించును. దీనిని నమ్ముము. భగవంతుని అనుగ్రహ వరములను అనుభవించవలెనే కాని వర్ణించుటకు వీలుకాదు. ధనవంతుడు దీని నెన్నడూ తెలియలేడు''.

అకస్మాత్తుగా వృత్రునకు యుద్ధభూమి దాని పరిసరముల గురించిన ఆలోచనలు మరుగయ్యెను. అతని మనస్సు నారాయణునిపై నుండగా నిట్లనెను. ''ఓ ప్రభూ! నీ సేవకులకు సేవకునిగా నన్ను గొనిపొమ్ము. నీ గుణములనే నా మనస్సు ఆలోచించునట్లు చేయుము. నా కంఠము నుండి నీ గొప్ప తనమును కీర్తించు స్వరములనే రానిమ్ము. ఈ శరీరము నీకు ప్రీతికరమైన పనులనే చేయునట్లు అనుగ్రహింపుము. నాకు నీవే కావలయును. ప్రభూ! నాకు బ్రహ్మస్థితిపై గాని ధ్రువ స్థితిపైగాని కోరికలేదు. ఈ భూమిపై చక్రవర్తి కావలెనని గాని, పరలోకమును పాలించవలెననిగాని కోరిక లేదు. నాకు మోక్షముగాని, యోగశక్తిగాని వలదు. పిల్లపక్షి తల్లిపక్షి కొరకు, దూడ తల్లియైన ఆవు కొరకు, తనను విడచి చాలా దూరముగా తెలియని దేశములకేగిన భర్తకొరకు ప్రేమతో భార్య, యెట్లు పరితపించునో, నేనును నీకొరకై అట్లే తపించుచున్నాను. పునర్జన్మయను సుడిగుండములో చిక్కుకుని యున్నాను. అందునుండి నాకు విముక్తిని ప్రసాదించుము. నీ భక్తుల యెడ నాకు ప్రేమ పెంపొందింప జేయుము. ఆ విధముగా నేను తప్పక నీకు ప్రియమైనవాడ నగుదును. నీవు కల్పించిన మాయచేత నేను యీ శరీరమునకు, భార్యకు, బిడ్డలకు, ఇంటికి, 'నావి' అని భ్రమించే యితర

వస్తువులకు కట్టుబడిపోయివాను. దయచేసి యీ మాయను తొలగించి, యీ వస్తు ప్రపంచముతో బంధమును త్రెంచుకొనుటకు సహాయము చేయుము''.

71 వృత్రాసురుని వధ

వృత్రుడు యుద్ధమునకు సన్నద్ధుడయ్యెను. త్రిశూలమునెత్తి ఇంద్రునివైపు పరుగిడి యిట్లు అరచెను. ''ఇంద్రా! నీవు మరణించుటకు సిద్ధము కమ్ము''. త్రిశూలమును త్రిప్పి అతి వేగముగా ఇంద్రునిపైకి విసరెను మండుచున్న గ్రహము ఆకాశములో సంచరించుచున్నట్లు గోచరించెను ఇంద్రుడు తన వజ్రాయుధము చేత త్రిశూలము ధరించిన వృత్రుని బాహువును నరికివేసెను. ఆ బాహువును ముక్కలు ముక్కలుగా జేసెను. తన బాహువును నరికివేయుటచే వృత్రునికి విపరీతమైన బాధ కలిగెను ఆ బాధ వలన కోపముతో పిచ్చివాడయ్యెను. వృత్రుడు రెండవ చేతితో ఇనుప గుదియ పట్టుకుని ఇంద్రుని సమీపించెను ఇంద్రుని చేతిలో వజ్రాయుధ ముండెను. వృత్రుడు ఇనుప గుదియతో ఇంద్రుని, ఐరావతమును బలముగా కొట్టెను ఐరావతము తొండమునకు బలముగా తగులగా, వృత్రుడు కొట్టిన ధాటికి ఇంద్రుని కుడి చేతి నుండి వజ్రాయుధము జారి క్రింద పడెను. శత్రువు సముఖములో క్రిందకు వంగి వజ్రాయుధమును తీసుకొనుట సిగ్గుమాలిన పని యని ఇంద్రుడు తలచి తీసుకొనకుండెను అది గమనించి వృత్రుడు ఇంద్రునితో యిట్లనెను ''ఇంద్రా! ఎందుకు సంకోచించుచున్నావు? ఆలోచించుటకుగాని, జరిగిపోయిన దానికి విచారించుటకుగాని యిది సమయము కాదు వజ్రాయుధము తీసుకుని, దానితో నీ శత్రువునైన నన్ను చంపుము

''జయాపజయములు మానవుని జీవితములో ప్రతినిత్యము కలుగుచుండును ఎల్లప్పుడూ ఒకడే విజయము పొందుట జరుగదు. ఈ లోకములో జరుగు సంఘటనలు వానిని నిర్దేశించుట భగవంతుని అధీనములో నున్నవి. పాపము సామాన్య ప్రజలు అజ్ఞానముచేత సత్యమును తెలియక, యీ జీవిత పరమావధి శరీర రక్షణమేనని భావించెదరు ఇంద్రా, యీ సత్యము గుర్తు పెట్టుకొనుము ఈ ఒక్క లోకమే కాదు, సమస్త లోకములు ఒక అద్వితీయ శక్తికి లోబడి యున్నవి. ఇది చాలామందికి తెలిసిన వాటికన్న అతీతమైనది. కర్రనుండి మానవ, జంతు రూపములుగా తీర్చిదిద్దిన బొమ్మలను బొమ్మలాటలో చిత్రవిచిత్రముగా ఆడించుట నీవు యెన్నడూ చూడలేదా? దారములతోలాగి వాటి యజమాని ఆడించగా అవి కదులుట లేదా? వాటంతట అవి కదలుటకు శక్తి కలదా? అదే విధముగా, మనమందరమూ భగవంతుడు ఆడించినట్లు ఆడుచున్నాము. ఈ లోకమును జీవులతో పోషించిన భగవంతుడే తిరిగి అదే జీవులతో యీ లోకమును నాశనము చేయుచున్నాడు. భగవంతుని చేతిలో మనమందరము పరికరములము. ఎట్టి కోరికలు లేని మానవుడు కూడ జయము పొందిన తర్వాత అతని ప్రవర్తన మరొక విధముగా నుండును. అతడు యీ జీవితము, వైభవము, ఖ్యాతి, సంపదలతో అనుబంధము పెంచుకొనుట ప్రారంభించును. అందుచేతనే సమబుద్ధి కలిగి యుండవలెనని ఋషులు చెప్పుదురు. జయాపజయములు, ఖ్యాతి అపఖ్యాతి, సుఖ దుఃఖములు, జీవన్మరణములు యెదురైన పుడు మానవుడు పొంగిపోరాదు, కృంగిపోరాదు. సత్వరజస్తమో గుణములు ప్రకృతి స్వభావము, వీనితో ఆత్మకు యెట్టి సంబంధము లేదు ఆత్మను తెలుసుకొని బ్రహ్మస్థితిని చేరిన మానవుని యీ ద్వంద్వము లేమియు చేయలేవు. నన్ను చూడుము. నా ఆయుధము నీ చేతిలో విరిగిపోయినది, నా భుజమును నీవు

నరికితివి. మన యిద్దరి మధ్య జరుగుచున్న యీ యుద్ధమను ఆటలో యెవరో ఒకరి జీవితము నాశము కాగలదు. ఎవరు గెలుచునదీ నిశ్చయముగా చెప్పుటకు వీలుకాదు ఇది ఒక జూదము వంటిది. ఫలితమును భగవంతునికి వదలిపెట్టి, మన శక్తిసామర్థ్యముల మేరకు మనము విధిని కానిచ్చెదము. ఇంద్రా, రమ్ము పోరును కొనసాగింపుము''

ఇంద్రునికి శత్రువైన వృత్రునిపై విపరీతమైన గౌరవాభిమానములు కలిగెను. వృత్రుని తెలివి, ఉదార బుద్ధి, వేదాంత జ్ఞానము చూచి ఇంద్రుడు యిట్లనెను. ''నీ గొప్పతనమునకు నేను అచ్చెరువందుచున్నాను. నీ మనస్సు యీ ప్రాపంచిక వస్తువులన్నిటి కన్న చాలా ఉత్తమమైనది నీవు సిద్ధపురుషుడవు. అందరికి భ్రాంతిని కల్గించు మాయకు నీవు అతీతుడవు. నీలో అసుర లక్షణములు లేవు అసురుడవైన నీవు రజోగుణముతో నిండియుండవలెను కాని నీలో అట్టి గుణము లేకుండుట విశేషము. నీవు శుద్ధ సాత్వికుడవు నీ మనస్సు భగవంతుని యందు సుస్థిరమై యున్నది. నీ గొప్పతనమునకు నా జోహారులు''.

ఆ తర్వాత వారిద్దరూ ధర్మ యుద్ధము గావించిరి. వృత్రుడు భయంకరమైన ఇనుప మేకును ఇంద్రునిపై విసరగా, అది ఇంద్రుని వజ్రాయుధము చేత ముక్కలు ముక్కలయ్యెను. వృత్రుని రెండవ భుజము కూడ ఇంద్రుడు నరికివైచెను వృత్రుడు తన నోరుని విప్పి విశాలమొనర్చెను అది భూమి నుండి ఆకాశమునకున్నంత విశాలముగా నుండెను. వృత్రుడు ఇంద్రుని, అతని యేనుగును మ్రింగివేసెను. ఇది జరిగిన తర్వాత దేవతలలో కలకలము చెలరేగెను వృత్రుడు ఇంద్రుని మ్రింగినప్పటికీ అతడు నారాయణ కవచము ధరించి యుండుటచేత చావకుండ రక్షణ పొందెను. ఇంద్రుడు తన వజ్రాయుధముతో వృత్రుని శరీరము లోపలి భాగములను తెగనరికి, తనకెట్టి హాని కలుగకుండ వెలుపలికి వచ్చెను పైకి వచ్చిన ఇంద్రుడు తన వజ్రాయుధముతో వృత్రుని శిరస్సు ఖండించెను ఈ దృశ్యము నందరూ చూచుచుండగా, వృత్రుని ప్రాణము శరీరము నుండి తేజో రూపములో బయటకు వచ్చి నారాయణుని పాదముల వద్ద అదృశ్యమయ్యెను

72 బ్రహ్మ హత్యా పాపము

వృత్రుడు మరణించిన తర్వాత, యీ లోకమందు, స్వర్గలోకమందు ప్రతి ఒక్కరూ నిర్భయముగా సంతోషముగా నుండిరి. కాని ఇంద్రునకు అట్లుకాదు అంతకు పూర్వము వృత్రుడు దేవతలను వేధించుచున్నపుడు, వారు వృత్రుని హతము గావింపుమని ఇంద్రుని వేడుకొనిరి కాని ఇంద్రునికి యిష్టము లేకుండెను. బ్రహ్మహత్యా పాపము కలుగునని అతడు భయపడెను ఇంద్రుడిట్లనెను ''ఇదివరలో విశ్వరూపుని చంపినపుడు బ్రహ్మహత్యా పాపము నాకు చుట్టుకుని ఒక సంవత్సరము వరకు వదలకుండెను భూమి, వృక్షములు, స్త్రీలు దయతో నా పాపములో పాలు పంచుకుని నన్ను పాప విముక్తుని చేసిరి. హోమాగ్ని నుండి పుట్టిన వృత్రుని నేను హతమార్చినచో, తిరిగి నన్ను యీ పాపము చుట్టుకొనినపుడు, నాతో పాలు పంచుకుని రక్షించు వారెవ్వరు?''

ఋషులు ఇంద్రునితో యిట్లనిరి. ''భయపడకుము. నీవు చేయబోవు అశ్వమేధ యాగమునకు మేము అధ్వర్యము వహించెదము. ఆ యజ్ఞము నిన్ను యీ పాపమునుండి విముక్తుని గావించును'' ఇంద్రుడు

సందేహముగా చూచుట గాంచి ఋషులు తిరిగి యిట్లనిరి. ''అశ్వమేధ యాగమునందు భగవంతుడైన నారాయణుడు పూజలొందును. అతడు మానవుని అన్ని పాపములను పరిహరించును. అతని నామములను కీర్తించుటచేత మహాపాతకములైన బ్రహ్మహత్య, గోహత్య, పితృహత్య, మాతృహత్య, గురుహత్యల నుండి మానవుడు విముక్తుడగును. అటువంటపుడు, లోక కళ్యాణమునకై యీ వృత్రుని సంహరించుట వలన ఆ పాపము నిన్ను చుట్టుకొనదు''.

ఋషులు చెప్పిన విషయములు ఇంద్రునికి నమ్మకము కల్గించగా, అతడు వృత్రుని సంహరించెను. వృత్రుని వధానంతరము బ్రహ్మహత్యా పాపము ఇంద్రుని వెంబడించెను. ఇంద్రుడొక్కడే దీనివలన బాధపడుచుండెను. ఇతరులెవ్వరూ అతని బాధలో పాలుపంచుకొనలేరు ఈ భూమి అంతయు ఇంద్రుడు పరుగెత్తి, చివరకు మానస సరస్సునందు ప్రవేశించెను. వెయ్యి సంవత్సరముల వరకు ఆ సరస్సులోని పద్మ కాండము నాశ్రయించి అందు వసించుచుండెను. ఈ సమయమందు జరిగిన యజ్ఞములలో తన భాగమైన హవిస్సును గ్రహించక యుండెను మానస సరస్సును లక్ష్మిదేవి రక్షించుచుండుట చేత బ్రహ్మహత్యా పాపము అతని దరికి రాలేకపోయెను ఆ పద్మ కాండమునందు ఆశ్రయము పొంది యున్నప్పుడు నిత్యమూ యీ పాపము నుండి విముక్తి పొందు మార్గములను గురించి ఆలోచించుచుండెను. తపస్సు తప్ప మరొక మార్గము లేదని నిశ్చయించుకొనెను.

వేయి సంవత్సరములు తపస్సు చేయుట చేత ఇంద్రుడు బ్రహ్మహత్యా పాపము నుండి విముక్తిపొంది, తిరిగి బ్రహ్మ ఆహ్వానింపగా స్వర్గము చేరుకొనెను. తర్వాత ఇంద్రుడు అశ్వమేధ యాగము నిర్వర్తించెను

ఇంద్రుడు స్వర్గమున లేని సమయమందు, నహుషుడు తాత్కాలికముగా ఇంద్ర పదవిని చేబట్టి స్వర్గమును పాలించెను

73 చిత్రకేతు మహారాజు

పరీక్షిత్తు అద్భుపడి శుకబ్రహ్మతో యిట్లనెను. ''ప్రభూ! వృత్రుని రాక్షస జన్మము గురించి చెప్పుచుండిరి. దేవతలతో యుద్ధము చేయునపుడు అతని క్రూరకృత్యములను గూడ తెలిపిరి కాని వృత్రుడు ఆడినమాటలు నారాయణుని గొప్పభక్తుని మాటలవలె నున్నవి ఈ భయంకర రాక్షసుడు నారాయణుని భక్తుడగుట యెట్లు సాధ్యమయ్యెను? ఇది నాకు బోధపడక గందరగోళముగా నున్నది. దీనిని మరికొంత విశదముగా తెలుపవలెను. వృత్రునికి భగవంతుని యెడల ఉన్నటువంటి భక్తి, సాత్త్విక గుణములు కల్గిన దేవతలకు, ఋషులకు గూడ లేదని తోచుచున్నది ఈ లోకములో సముద్రతీరమున నున్న యిసుక రేణువుల కన్న యెక్కువ మంది జీవులు ఉన్నారు వారిలో అతికొద్దిమంది మాత్రము ధర్మమార్గ మనుసరింతురు. ఈ కొద్దిమందిలో చాల తక్కువ మంది మోక్షము జీవిత ధ్యేయమని తలచెదరు. మోక్షమును ఆపేక్షించువారిలో వెయ్యికి ఒక్కరు [illegible] ధములను త్రెంచుకొనగలుగుచున్నారు అట్టి జీవులలో కోటికొక్కరు నారాయణుని పాదములు చేరగలుగుచున్నారు అటువంటి సందర్భములో, దేవతలను బాధించి అనేక పాపకృత్యములు గావించిన అసురుడైన వృత్రునకు నారాయణునిపై అంతటి భక్తి యెట్లు కలిగెను? చివరకు అతని ప్రాణము

నారాయణుని పాదములనెట్లు చేరగల్గెను? ఇది చాలా విచిత్రముగా గోచరించుచున్నది. దీనిని విశదముగా తెలుపవలెను''

పరీక్షిత్తు సందర్భోచితముగా వేసిన ప్రశ్నకు శుకబ్రహ్మ సంతసించి యిట్లనెను ''నీ ప్రశ్న ఉచితమైనది వృత్రాసురుని అధ్యాత్మిక తత్త్వము వెనుక ఒక గాథ కలదు. నీకు ఆ గాథను వివరించుటకన్న సంతోషకరమైనది మరియొకటి లేదు శూరసేన దేశమందు చిత్రకేతు మహారాజు గలడు అతడు యీ లోకమును ధర్మయుతముగా పాలించెను అతడు చాలా మంచివాడు కాని ఒకే ఒక సంఘటన ఆ మహారాజు సుఖసంతోషములను కూలద్రోసెను. అతనికి అనేకమంది భార్యలున్నప్పటికీ సంతానము లేకుండెను అతనికి సర్వము ఉన్నప్పటికీ పుత్రుడు లేకుండుటచే అతడు విచారముగ నుండెను.

''ఈ భూమిపై సంచారము చేయుచున్న అంగిరస మహర్షి ఆ దేశమునకు వచ్చుట తటస్థించెను. చిత్రకేతు మహారాజు అంగిరస మహర్షిని వినయపూర్వకముగా ఆహ్వానించి తగిన గౌరవ మర్యాదలు చేసెను. రాజు సద్గుణములకు సంతోషించి మహర్షి యిట్లనెను ''విశేషమైన మర్యాదను చూపి ప్రవర్తించు రాజును దర్శించుట చాలా సంతోషమైన విషయము నీవు సత్పురుషుడవు, పెద్దలను గౌరవించుచున్నావు. సాధారణముగా మానవులు వేనికొరకు పరితపింతురో అవన్నియు నీకున్నవి నీకు లభించిన అదృష్టమునకు నీవు పూర్తిగా అర్హుడవు. కాని, నీవు విచారముతో నున్నట్లు కన్పడుచున్నావు నీ ముఖమందు విచారము స్పష్టముగా గోచరించుచున్నది నీ విచారమునకు కారణమేమిటో తెల్పుము?''

రాజు తన దురదృష్టమునకు కారణమును వివరించి యిట్లనెను ''నీవు గొప్ప ద్రష్టవు నాలో ప్రవేశించి నా సంతోషమును హరించి దొలిచివేయుచున్న యీ పురుగును ఊహించగలరు! అయినప్పటికీ, మీరు అడిగితిరి కాబట్టి చెప్పుచున్నాను నాకు అందమైన భార్యలు గలరు, వారందరూ మంచివారు నాకు సర్వస్వమూ ఉన్నప్పటికీ, పుత్రునికి తండ్రికాలేని చింత మిగిలిపోయెను ఇతర వస్తువులు యెన్ని ఉన్నప్పటికీ అవి నాకు సంతోషము నిచ్చుటలేదు ఆకలిగానున్న వానికి పువ్వులు, గంధము యిచ్చినచో అతని ఆకలి తీరదు. ఆహారముతోనే ఆకలి తీరగలదు మీరు నాయందు దయ తలచినట్లైన, నాకు సహాయము చేసి, పుత్రులు లేని వారికి కలిగే నరకము నుండి రక్షింపవలెను తప్పక నాపై దయ చూపుదు.''

బ్రహ్మ కుమారుడైన   ని జాలిపడి, ఒక దివ్య పదార్థమును త్వష్టుని ఆధిపత్యములో తయారుచేసి రాజునకిచ్చి, దానిని జ్యేష్ఠభార్యకు యిమ్మని చెప్పెను. రాజు జ్యేష్ఠభార్యను పిలిచి, యిరువురు పరిశుద్ధులై మహర్షికి నమస్కరించిరి తర్వాత రాజు ఆ పదార్థమును మహర్షి ఆజ్ఞాపించినట్లుగా తన భార్యకు యిచ్చెను ఆమె దానిని సేవించిన తర్వాత, మహర్షి వారి దగ్గరనుండి నిష్క్రమించి తన సంచారమును కొనసాగించెను తరువాత కొంతకాలమునకు ఆ రాజునకు పుత్రుడు కలిగెను రాజ్యములో అందరూ యెంతో ఆనందించిరి

షష్ఠమ స్కంధము

74 రాకుమారుని మృతి

రాజు ఆనందమునకు అవధులు లేకుండెను పుత్రునిపై విశేషమైన అనుబంధము కలుగగా, ఆ బాలునితోనే యెక్కువ కాలము గడుపుచుండెను. రాజునకు ఆ బాలుని తల్లి యెక్కువ ప్రేమపాత్రురాలు కాగా, మిగిలిన భార్యలు రాజు తమ్ము అలక్ష్యము చేయుచున్నాడని భావించిరి. ఇప్పుడు తమ్ము దాసీల కన్న చులకనగా చూచుచున్నట్లు వారు తలచిరి. రాకుమారుడు పుట్టకమునుపు తమ్ము చూచుటకు రాజు వచ్చుచుండెను, యిప్పుడు వచ్చుట పూర్తిగా మానివేసెను. అంతేగాక, వారికి రాకుమారుని తల్లి, అనగా జ్యేష్ఠభార్యపై అసూయకలిగెను ఆమెకు మాత్రమే మాతృత్వము దానివలన కలిగే ఆనందము లభించినది ఇతర భార్యలకు యీ అదృష్టము లేకపోవుటచేత వారికి రాజు జ్యేష్ఠభార్యపై అసూయ పెరిగెను ఈ అసూయచేత వారు వివేకమును కోల్పోయి, విపరీత చర్యకు నిశ్చయించుకొనిరి. ఒకరోజు ఆ శిశువుకు విషము పెట్టిరి

రాజు జ్యేష్ఠభార్య పుత్రుని పరుండబెట్టి, తాను లేచివెళ్ళెను. పుత్రుని చూచి నిద్రపోవుచున్నాడని ఆమె తలచెను. ఆమె నిత్యకృత్యములను గావించు కొనుచుండెను కొంతసేపయిన తర్వాత, తన పుత్రుడు చాలాసేపు నిద్రపోయినాడని తలచి, సేవకురాలిని పుత్రుని లేపి తీసుకురమ్మని పంపెను. ఆ సేవకురాలు వెళ్ళి చూడగా శిశువు మరణించి యుండెను ఆ దృశ్యము చూచి ఆమె బిగ్గరగా కేకపెట్టగా, శిశువుతల్లి యేమి జరిగెనో యని హుటాహుటి వచ్చెను. ఒక క్షణములో రాకుమారుడు మరణించెనన్న వార్తనలుదిశలా ప్రాకెను మహారాణి మూర్ఛపోయెను రాజు ఆమె అంతఃపురమును చేరెను మరణించిన పుత్రుని చూడగానే రాజు తనలోని వివేకము నశించెనని తలచెను మతిచెడిన వారివలె ఆ రాజదంపతులు చేయు రోదనముతో రాజ భవనములో శోకము తాండవించెను దేశమంతయూ శూన్యము నిండినట్లయ్యెను.

వారివద్దకు పుత్రుని ప్రసాదించిన అంగిరస మహర్షి నారదునితో వచ్చెను. వారు రాజును సమీపించి, విచారగ్రస్తుడైన రాజునకు జ్ఞాన బోధచేయు మాటలతో నిట్లు పలికిరి. ''ఓ రాజా! నీవు నీ కుమారుని మరణమునకు శోకించుచున్నావు కాని నీవు చక్కగా యోచించినట్లయితే నీవు శోకించుట చాలా తెలివితక్కువ పని యని గ్రహించగలవు నీవు అంతగా విచారించుటకు అతనికి నీకు యేమి సంబంధము? నీకు అతనితో గల బంధుత్వమేమి? నీవు తండ్రివని, అతడు నీ కుమారుడని భావించుచున్నావు ఒక క్షణమాలోచింపుము నీ పూర్వజన్మమున, అతని పూర్వ జన్మమున, నీ రాబోవు జన్మమున, అతని రాబోవు జన్మమున, యిప్పుడు మీయిద్దరికి ఉన్న సంబంధము గిలదా? మీమీ పూర్వజన్మలలో యీ సంబధము గిలదా? ఇప్పుడు నీకు కుమారుడైన యితడు రాబోవు జన్మలో నీకు పుత్రుడుగా కలుగబోడు అతడు నీకొక స్నేహితుడు, శత్రువు, లేక పూర్తిగా అపరిచితుడు కావచ్చు ఈ తండ్రి పుత్రుల సంబంధము స్థిరమైనది కాదు నది వేగముగా ప్రవహించునపుడు, యిసుకరేణువులు కొంతదూరము ప్రవాహముతో ప్రయాణము చేయును. అటు తర్వాత అవి మరి యెన్నటికీ కలియక విడిపోవును అదే విధముగా, కాల ప్రవాహములో, నీవు, నీ పుత్రుడు కొంతకాలము కలిసి ప్రయాణించినారు ఇప్పుడు మీరు విడిపోవు సమయము ఆసన్నమయ్యెను. మరొక చెట్టు విత్తనముల నుండి చెట్టు పుట్టినట్లు యీ లోకమున శిశువులు పుట్టుచున్నారు ఎవ్వరికీ ఆ శిశువులపై అధికారము లేదు. దేని గురించియు విచారించవలసిన పనిలేదు. మాయ చేత భ్రాంతి చెంది, నీవు తండ్రివని యితడు పుత్రుడని తలచి రోదించుచున్నావు ఈ భ్రాంతిని వదిలి పెట్టుము

''నీవు, నేను, సకల జీవులు, జడపదార్థములు యీ భూమిపై జన్మించి కొంతకాలము మాత్రమే ఉండును. మరణము తర్వాత తిరిగి ఒకరినొకరు కలియబోరు. ఈ భూమి మన మందరము కలిసి నివసించుటకు ఒక తాత్కాలిక గృహము. అందుచేత నీవెందుకు విచారించెదవు? భగవంతుడు, సృష్టించి, పోషించి, లయము చేయును. ఇది ప్రకృతి న్యాయము

''తండ్రిగా పేర్కొను 'దేహి' శరీరమువలన, తల్లిగా పేర్కొను 'దేహి' శరీరమునుండి పుత్రుడని పేర్కొను 'దేహి' శరీరము ఉద్భవించుచున్నది. విత్తనము నుండి చెట్టు పుట్టుట యెంత సహజమో, ఇదియూ అంతే. 'పుట్టుట గిట్టుట కొరకే' అను న్యాయము ననుసరించి, శరీరములు నశించును ఇది ప్రకృతి న్యాయము. కాని, దేహి అనగా ఆత్మ యెన్నడూ నశించదు. కాబట్టి నశించనటువంటి దాని గురించి మరణించినట్లు భావించి విచారించనవసరము లేదు. ఆత్మ సహజ స్వభావమును తెలియకుండుటచేత, శరీరము ఆత్మ వేర్వేరు కారమనట్లు తోచును. ఈ అవిద్యను విడిచిపెట్టినంతనే నీ విచారము నమసిపోవును ఈ బాధలు, నష్టములు కేవలము అసత్యములని తలంచి ధైర్యము తెచ్చుకొని లెమ్ము. నీవు యిందుకై బాధపడుట అనవసరము''.

చిత్రకేతు మహారాజు మహర్షి మాటలను విని, చేతులతో కన్నీరు తుడుచుకుని యిట్లనెను. ''నన్ను యింతగా సముదాయించి, విచారమును మానమని చెప్పు మీరెవ్వరు? మీ వంటి ఉత్తమ జీవులు లోకమంతా సంచరించి, భ్రాంతిలో నున్న నా వంటి సామాన్య మానవులు అనుబంధము వల్ల కలిగే దుఃఖముతో మతి చెడినపుడు, సత్యము బోధించి ధైర్యము కలిగింపుదురు. అజ్ఞాన సముద్రములో కొట్టుమిట్టాడుతున్న నావంటి అభాగ్యజీవులకు మీరు ప్రభువులు దయచేసి, చీకటితో నిండిన నాహృదయములో జ్ఞానజ్యోతి వెలిగించి, నాకు ఆనందమును ప్రసాదింపుడు''.

అంగిరసుడిట్లనెను ''ఓ రాజా! నేను అంగిరస మహర్షిని ఒకప్పుడు నీవు కోరగా, నీకు పుత్రుని ప్రసాదించినాను ఇతడు బ్రహ్మ కుమారుడు నారదుడు, నాకు సోదరుడు నీ పుత్రుని పోగొట్టుకున్న దుఃఖములో ఉండుటచేత నీవు నన్ను గుర్తింపకుంటివి. నిన్ను రక్షించుటకు మేము వచ్చితిమి భగవంతుని యెడల భక్తిగల నీవు విచారించుట తగదు. ఇంతకు పూర్వము నేను నీవద్దకు వచ్చినపుడు బ్రహ్మవిద్యను బోధించి యుండవలసినది. కాని అప్పటికి నీవు పరిపక్వత చెందలేదని గ్రహించినాను అప్పుడు నీవు యింకా భగవంతుని మాయలో చిక్కుకుని యున్నావు పుత్రుడు కావలెనను ప్రాపంచికమైన కోరిక నీలో బలముగా నుండెను. అందుచే నీకు పుత్రుని ప్రసాదించితిని. ఇప్పుడు పుత్రుని కోల్పోయిన తండ్రిపడే వ్యథను నీవు అనుభవిస్తున్నావు

''ఓ రాజా! భార్య, ఇల్లు, సంపద, కీర్తి భోగ్యవస్తువులు, రాజరికము, సేవకులు, బంధువులు - యివన్నీ బాధ, విచారము, భ్రాంతి, భయము, దుఃఖమునకు కారణములు ఒక క్షణమాలోచించు. నీవు యెప్పుడైన యీ సౌధముపై కెక్కి, మేఘములు ఒకదానినొకటి వెంటాడుట చూచితివా? ఒకొక్కప్పుడు, అవి పెద్దనగరములో నేలుగను, పొడనైన గోపురములు గల భవనములుగను కన్పించుట గమనించితివా? నీ ఊహలో యెన్నడైనా శూన్యము నుండి ఒక మహానగరము ఆవిర్భవించినట్లు గమనించితివా? జ్ఞానులు యీ మేఘ నగరమును గంధర్వనగరి అందురు. ఇది ఊహాశక్తిచేత రూపొందిన నగరము

''నీవెప్పుడును స్వప్నము గాంచలేదా? స్వప్నములో నీవు అందు ఒక పాత్రవని తలంచలేదా? స్వప్నము ముగిసి మెలకువస్థితికి వచ్చిన తర్వాత, స్వప్నములోని అనుభవములు అసత్యమని, మెలకువస్థితిలోని

అనుభవములు సత్యమని భావించెదవు చల్లని గాలి వీచుటతోనే గంధర్వనగరి చెదరిపోయి అది అంతయు అసత్యమని, అటువంటి నగరము లేదని గ్రహించెదవు. నీవెన్నడూ యిట్లు తలంచలేదా? ఈ లోకములోని అనుభవములు కూడ అట్టివే

''ఈ రాజ్యము, సంపద, భార్యలు, యెవరి మరణమునకు విచారించుచున్నావో ఆ పుత్రుడు, యివన్నియు స్వప్నములో కాంచు వస్తువుల వంటివి అవి నిజముగా లేవు. మెలకువస్థితిలో నీవు స్వప్న లోకములోని అనుభవములు అసత్యములని గ్రహించినట్లే, బ్రహ్మస్థితిని చేరినపుడు యీలోకములోని అనుభవములు కూడ స్వప్నలోకములోని అనుభవములవలె అసత్యమని గ్రహించగలవు. ఈ స్వప్నము నుండి తెలివితెచ్చుకుని లెమ్ము. ఈ లోకములో యేదియు సత్యము నిత్యము కాదని తెలుసుకొనినచో, నీవు యీ విచారమునుండి తేరుకొనగలవు''

అటుపిమ్మట నారదుడిట్లనెను ''నీకు ఉపనిషత్తులలో నొక మంత్రమును బోధించెదను. ఒకవారము రోజులు నీవు ఆ మంత్రము నుచ్చరించిన తర్వాత ఆదిశేషుని చూడగలవు అప్పుడు నీవు ద్వైతభావము వీడి, ఉత్తమజీవులు పొందిన సద్గతిని పొందగలవు''

నారదుడు తన యోగశక్తిచేత అక్కడి వారందరూ చనిపోయిన రాకుమారుని చూచునట్లు చేసెను. నారదుడతనితో యిట్లనెను ''నీకు అభివందనము. మరణించిన రాకుమారుని ఆత్మవునీవు. నీ బంధుజనమును పరికింపుము నీ తల్లి, తండ్రి, యితరులు నువ్వువారిని విడిచివెళ్ళినందుకు విచారిస్తున్నారు నీవు వదలిపెట్టిన యీ శరీరములోనికి తిరిగి ప్రవేశింపుము నీ తండ్రి నీకు యిచ్చుటకు సిద్ధముగా నున్న యీసంపదను, రాజ్యమును అంగీకరింపుము. ఈ సింహాసనముపై కూర్చుని అందరికీ ఆనందము చేకూర్చుము''.

రాకుమారుని ఆత్మ యిట్లు పలికెను. ''దివ్యమైన ఆత్మ కర్మలలో చిక్కుకొనుటవలన, యీ లోకములో మానవుడుగా, పక్షిగా, లేక మృగముగా జన్మించును. ఆ విధముగా చూచినట్లయితే, యీలోకములో జన్మించిన ప్రతిఒక్కరూ, యెప్పుడో ఒకప్పుడు మరొకరికి పుత్రుడుగానో, తండ్రిగానో, తల్లిగానో, స్నేహితుడుగానో, బంధువుగానో, లేక శత్రువుగానో ఉండియుందురు బంగారము, యితర వస్తువులను అమ్మట- కొనుటచేత నిత్యము ఒకరి చేతులనుండి మరొకరి చేతులలోనికి మారుచున్నది. అదే రీతిగా, ఆత్మ ఒక శరీరమునుండి మరొక శరీరమునకు, ఒక తండ్రి నుండి మరొకనికి మారుచున్నది. ఈ బంధుత్వము అనిత్యము, అసత్యము. ఈ బంధుత్వము ఉన్నంతవరకు మమకారముండును. కాని ఆత్మకు, శరీరములో ఉంటూన్నప్పటికీ, యీ భ్రాంతి ఉండదు సంబంధము వలననే బాధ జనించుచున్నది. ఇది ఒక బంగారపు కడ్డీ వంటిది

''ఉదాహరణకు ఒక బంగారు కడ్డీని తీసుకొనుము. ఈరోజు అది ఒక లోభి పెట్టెలో నున్నది. నిన్నటి దినము అది బంగారువస్తువులు చేయు కంసాలి ఇనుపపెట్టెలో నుండెను. కొన్ని సంవత్సరముల తర్వాత మహారాజు కోశాగారములో నుండును ప్రతిఒక్కరూ బంగారు కడ్డీ తమ పెట్టెలో నున్నదందురు అది లోభి పెట్టెకావచ్చును, కంసాలి ఇనుపపెట్టె కావచ్చును, లేక రాజు కోశాగారము కావచ్చును కాని వారు, బంగారు కడ్డీకి పెట్టెతోగాని, దాని స్వామితోగాని అనుబంధములేదని గ్రహించలేరు. అదే విధముగా ఆత్మకు యెటువంటి అనుబంధములులేవు. అందుచే బాధకాని, సుఖముగాని ఉండదు. అందుచేతనే శరీరములో నున్న ఆత్మ, శరీరము విడిచిన తర్వాత విచారించదు''. ఆ విధముగా రాకుమారుని ఆత్మపలికి, వారందరి నుండి అదృశ్యమయ్యెను.

ఈ దృశ్యమును చూచి అచ్చెరువొంది, మరణించిన రాకుమారుని మాటలు వినగా, వారి దుఃఖము తొలగిపోయి, నిర్విచారముగ నుండిరి. వారికిగల గొలుసుల బంధము త్రెగుటచేత యెటువంటి బాధయు లేకుండెను ఆ తర్వాత రాకుమారుని మృతదేహమునకు అంత్యక్రియలు జరిపిరి. సవతితల్లులు తమ అకృత్యమునకు పశ్చాత్తాప పడి, పాపవిముక్తికి వ్రతములు చేపట్టిరి.

అంగిరస, నారద మహర్షులు పలికిన పలుకులకు చిత్రకేతు మహారాజా మనస్సు, ప్రశాంత సరస్సువలె, నిశ్చలముగా నుండెను. బురదతోనిండిన సరస్సును విడిచి యేనుగు వెళ్ళినట్లు, రాజా దేశము విడిచి లోకసంచారమునకు వెడలెను.

సప్తమ స్కంధము

75 బ్రహ్మవిద్య

చిత్రకేతు మహారాజు యమునా నదీ తీరమును చేరెను. పవిత్ర నదీ జలములో స్నానమాచరించి ధ్యానమున కుపక్రమించెను అంగిరస నారద మహర్షులు అతని మనసులో మెదలగా, మానసికముగా వారి నావాహన చేసి, మనస్సునందే వారికి నమస్కారములు చేసెను. వెంటనే నారదుడు, అంగిరసునితో ప్రత్యక్షమయ్యెను. ఇది వరలో మంత్రము నుపదేశించెదనని మాట యిచ్చిన ప్రకారము రాజున కామంత్రము నుపదేశించిరి ఆ మంత్రము, రాజు ఆదిశేషుని చేరుటకు సహాయపడునని చెప్పి, రాజును మహర్షులిద్దరూ ఆశీర్వదించి వెళ్ళిపోయిరి.

చిత్రకేతు ఆ మంత్రమును యేడు దినములు, యేడు రాత్రులు నిర్విరామముగా నుచ్చరించెను అతడు కేవలము జలము మాత్రమే ఆహారముగా గ్రహించుచుండెను. ఏడవరోజు రాత్రి అతడు విద్యాధరుడయ్యెను అతని మనస్సు నిర్మలముగా ప్రకాశవంతముగా నుండెను మరికొద్ది రోజులకే భగవంతుని మరొక రూపమైన ఆదిశేషుని చేరెను రాజు పొగడ్తలకు సంతసించి, ఆదిశేషు డిట్లనెను ''నీ భక్తి నాకు సంతోషము కలిగించెను. నా వద్ద జ్ఞానము పొందుటకు వెళ్ళుమని నారద, అంగిరసులు నీతో చెప్పియున్నారు నీకు బ్రహ్మవిద్యను బోధించి, నీ మనసు నుండి మాయ అనే తెరను తొలగించి నిర్మలము గావించెదను.

''ఈ ప్రపంచమంతయు నే నావరించియున్నాను. నేను ద్రష్టను, దృష్టమును. దర్శన విధానము నేను నేను ద్రష్టను, దృష్టమును, యీ రెండింటికి భేదము లేదు చూచువాని యందును, అతడు చూచు వస్తువు నందును నేను ప్రవేశించి ఉంటున్నాను. ఒకప్రక్క వస్తు ప్రపంచము కలదు; మరొక ప్రక్క యీ వస్తు ప్రపంచము ననుభవించు మానవుడు కలడు నిజముగా యీ రెండును ఒకటే. నేనే యీ రెండు రూపములు ధరించుచున్నాను కాని యీ రెండింటికీ భేదము లేకపోవుట సత్యము నేను రెండింటియందు వ్యాపించి యున్నాను. స్వప్నము, స్వప్నము ననుభవించు వానిని ఉపమానముగా తీసుకుని మరికొంత విపులముగా చెప్పెదను.

''మానవుడు నిద్రపోవుచున్నపుడు స్వప్నమందు అనేక వృక్షములు, పర్వతములు, యితర వస్తువులతో కూడిన లోకమును చూచును ఈ స్వప్నలోకమును సృష్టించినది నిద్రించుచున్న మానవుడు, అతని మనస్సు నందు మాత్రమే యీ లోకము కలదు. అతను లేక స్వప్నలోకము లేదు. మరియు, స్వప్నమునందు తాను మెలకువ కలిగియున్నట్లు, లేక స్వప్న ప్రపంచములో ఒకచోట, తాను నిద్రించి యున్న స్థలము కాక, ఉన్నట్లు కలగనును కోసల దేశములో నిద్రించుచున్న వ్యక్తి గాంధార దేశములో యేదో జరుగుచున్నట్లు కలను గనును ఇవన్నియు కలలు గనేవారి సామాన్య అనుభవములు నీ దృష్టిని కొద్దిగా మళ్ళించి, ఆత్మయే కలను గనుచున్నవాడుగా పరిగణించినట్లయితే, యీ లోకమంతయు సామాన్య మానవుడు చూచుదానికి భిన్నముగా నుండును. బ్రహ్మస్థితిని పొందినవానికి, యీ లోకము స్వప్నతుల్యమగును. ఈ లోకమంతయు స్వప్నమును గనుచున్న ఆత్మ సృష్టించుకొన్నది; ఇది నిద్రలో మానవుని మనస్సు సృష్టించు స్వప్న లోకములవలె నుండును ఆత్మ, తాను గనుచున్న స్వప్నము నుండి మేలుకొన్నంతనే, అనగా జ్ఞానోదయము కలిగినదని గ్రహించినం

తనే, యీ వస్తు ప్రపంచమంతయూ మాయ యని గ్రహించును

''మానవుడు మూడు అవస్థలను పొందుచున్నాడు. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ ఇవి ఒకదాని తర్వాత ఒకటి ప్రతి ఒక్కరికీ కలుగుచుండును. జాగ్రదవస్థలో స్వప్న లోకముండదు స్వప్నములో నున్నపుడు జాగ్రత్ లోక ముండదు. నిద్రావస్థలో జాగ్రత్ లోకముగాని, స్వప్నలోకము గాని యుండవు. కాని యీ మూడు అవస్థలందు ప్రత్యేకముగా ఒకటి ఉంటున్నది అది 'నేను మెలకువలో నున్నాను', 'నేను నిద్రించుచూ స్వప్నము గాంచుచున్నాను', 'నేను గాఢ నిద్రలో నున్నాను', అని అంటున్నది. అదియే ఆత్మ, నీలో, నాలో ఉన్నది 'నేను' అందరిలో ఉన్నాను ఈ సత్యమును గ్రహించినట్లయితే సుఖ దుఃఖములకు, యితర ద్వంద్వానుభూతులకుగాని తావు లేదు. ఎందుకనగా అప్పుడు యీ బహుళ ప్రపంచము అదృశ్యమగును. అప్పుడు నీకు సమదృష్టి యేర్పడి అన్నీ ఒకే విధముగా గోచరించును వృక్షము-గడ్డిపోచ, పర్వతము-యిసుక రేణువు; ఇవన్నియు ఒకటేయని, ఆత్మ వ్యక్త రూపములని తలచెదవు రెండునూ ఒకటేయని గ్రహించుట వలన వానిలోగల భేదములు కనుపించవు అన్నింటిలో నేను వ్యాపించి యున్నట్లు గ్రహించగలిగిన స్థితినే బ్రహ్మస్థితి యందురు

''ఈ సత్యము తెలియనంతవరకు జీవుడు యీ వస్తు ప్రపంచములో కొట్టు మిట్టాడుచుండును సత్యమును యెఱుగ కుండుట చేత, ద్వంద్వములకు లోబడి బాధల ననుభవించును అందుచే జ్ఞా ద్ధిని పెంపొందించుటకు యత్నించవలెను. దీనివలన అన్నింటియందు సమదృష్టి కలుగును బ్రహ్మవిద్య యందు ఆరితేరిన వారికి అన్నియూ ఒకే విధముగా గోచరించును

''జ్ఞానవంతులు మొదట వైరాగ్యము నలవరచుకొనవలెను ఇది స్వేచ్ఛను అనగా బ్రహ్మస్థితిని పొందుటకు మొదటి మెట్టు

''మానవులు లోకములో సుఖప్రాప్తికి, దుఃఖ నివృత్తికి తీవ్రముగా ప్రయత్నించెదరు వారు చేయు కర్మలన్నిటికీ యిదే ధ్యేయము. కాని, చిత్రమేమనగా వారు ఆశించినది లభ్యమగుట లేదు వారికి సుఖప్రాప్తిగాని, దుఃఖ నివృత్తిగాని కలుగుట లేదు మానవుడు తీవ్రముగా ప్రయత్నము చేసి పొందవలసినది ఒకే ఒక్కటి: అది మూడు అవస్థలందు ఉండునది. ఓ రాజా! ఈ సత్యమే 'నేను' అని గ్రహింపుము. నాయందే మానవుని మనస్సు లగ్నము కావలెను. నన్ను ధ్యానించుము.

''నేను యింతవరకు బోధించిన దానిని చక్కగా తెలిసికొనినచో, నీవు నన్ను చేరుకుని నాలో ఐక్యము కాగలవు''.

అటుపిమ్మట ఆదిశేషుడు అదృశ్యమయ్యెను. రాజు వర్ణింప సాధ్యముకాని శాంతిని పొందెను ఇంకెప్పుడూ తనకు వికారము కలుగదని గ్రహించి మిక్కిలి ఆనందించెను ఆకాశములో యెగురగలిగే రథమునెక్కి చిత్రకేతుడు ప్రయాణము చేసెను అనేక వేల సంవత్సరములు అతడట్లు నిర్వికారముగా యెట్టి బంధములు లేక సంచరించెను భగవంతుని కీర్తించుచూ కాలమును వెళ్ళబుచ్చెను

సప్తమ స్కంధము

76 సతీదేవి శాపము

ఒకప్పుడు మహాదేవుని నివాసమైన కైలాస పర్వతము మీదుగా ప్రయాణించుచుండగా, చిత్రకేతుడు మహాదేవుని ప్రకాశవంతమైన రూపమును చూచెను. నారాయణుడు తనకు ప్రసాదించిన రథము నుండి, చిత్రకేతుడు కైలాస పర్వతమును, అందు ప్రమథగణములు మహాదేవుని చుట్టూ చేరియుండగా చూచెను. మహాదేవుడు ఋషులందరి మధ్య కూర్చుండెను. అతని ఒడిలో సతీదేవి కూర్చుని యుండెను. ఒక చేతితో మహాదేవుడామె నాలింగనము చేయుచుండెను ఇది చూచి చిత్రకేతుడు విరగబడి, వారందరికీ వినబడునంత గట్టిగా నవ్వెను చిత్రకేతుడు యిట్లనెను. ''మహాదేవుడిట్లు చేయుట చాల ఆశ్చర్యముగా నున్నది అతడు యీ లోకమునకు ప్రభువని అందురు అతడు అందరకూ గురువుగా ప్రసిద్ధినొందెను. అతడు ఋషుల సమావేశమునకు అధ్యక్షత వహించుచుండెను మరి నేను చూచునదేమి? బాహాటముగా అందరి సమక్షములో, తన భార్యతో రతికేళి జరుపుచుండెను సన్యాసి వస్త్రములు ధరించి, జడలు కట్టిన వెంట్రుకలతో, పవిత్ర శాస్త్ర గ్రంథముల నెరిగియూ, యీ మహాదేవుడు, అజ్ఞాని కుసంస్కారుడైన సామాన్య మానవునివలె, అందరిలో తన భార్యతో రతికేళి జరుపుచున్నాడు ఎందుచేత? అజ్ఞానులు కూడను సిగ్గు విడచి యిట్లు ప్రవర్తింపరు రహస్యముగా భార్యతో రతి సలిపెదరు మరి యీ దృశ్యము నెట్లు అర్థము చేసుకొనవలెను?''

ఈ మాటలను మహాదేవుడు విని ఊరకుండెను. అతడు నవ్వుచు మౌనముగా నుండుట జూచి, యితరులుకూడ అట్లే మౌనము వహించిరి ఎవ్వరూ ఒక్కమాట కూడ పలుకకుండిరి. కాని సతీదేవి రాజు మాటలను విని సహించలేకపోయెను తనకు గల ఇంద్రియ నిగ్రహము యితరులకు లేదని గర్వముతోనున్నాడని సతీదేవి తలచి, అతని కొక గుణపాఠము నేర్పి అతని గర్వము నణచవలెనని భావించెను. ఆమె కనులు క్రోధముతో యెర్రబడగా యిట్లనెను ''ఈ మనిషి చాలా గొప్పవాడననుకుని మనవంటి 'సిగ్గులేని' వారలకు ప్రవర్తనా నియమావళిని బోధించుట కర్హుడ ననుకొనుచున్నాడు.

''బ్రహ్మ, బ్రహ్మ పుత్రులైన భృగు నారదుల సందేశములను వినినవారు, తదితరులు యిక్కడ చేరియున్నారు వీరికెవరికీ ప్రవర్తన తీరు తెలియదనియూ, తనకొక్కనికే తెలుసుననుకొనుచున్నాడు ఇప్పుడే కళ్లు తెరిచిన యీ రాజు, వీరంతా మూర్ఖులని, నా భర్త మహాదేవుడు గౌరవమునకు అనర్హుడని భావించుచున్నాడు ఈ రాజు గర్వము నణచవలసిన సమయము వచ్చినది; ఇతనిని శిక్షింపక తప్పదు ఇతడు నారాయణుని పాదముల దరిదాపులలో నుండుటకేమాత్రము అర్హత లేదు అందుచేత, ఓ చిత్రకేతూ! నీ అహంకారమునకు శిక్షగా, నీవు అసుర జాతిలో జన్మించవలసినదిగా శపించుచున్నాను''.

చిత్రకేతు మహారాజు రథము దిగి, వినయపూర్వకముగా సతీదేవికి ప్రణమిల్లెను అతడిట్లనెను ''జగజ్జననీ! ఈ రెండు చేతులు జోడించి నీ శాపము స్వీకరించెదను. మానవుడు, యిదివరలో తాను చేసిన కర్మలకు ఫలితమును భగవంతుడు నిర్ణయించును మానవుడనే జంతువు మాయచేత భ్రాంతిలో చిక్కుపడి, యీ సంసార వలయములో గిరగిర తిరుగుచూ, బయటపడు మార్గము తెలియక, ఒక దాని వెంట ఒకటి వచ్చే సుఖ దుఃఖముల ననుభవించుచుండును ఈ ద్వంద్వములతో ఆత్మకు యెట్టి సంబంధము లేదు ఇతరులెవరూ వీటిని కలిగించలేరు అనంత ప్రవాహముగా భ్రాంతితో నిండిన యీ లోకములో, శాపమునకు, వరమునకు ఒక స్థానమున్నదా? స్వర్గమేది? నరకమేది? సుఖమేది? దుఃఖమేది? పరమాత్మ, మాయచేత జీవులను

సృష్టించును అతడే వారికి బంధమును, బంధ విముక్తిని యేర్పరచును. కాని పరమాత్మ వీటి కతీతముగా నుండును. అతనికి ఒకరిపై రాగము మరియొకరిపై ద్వేషము లేవు. అతనికి బంధువులుగాని, స్నేహితులుగాని లేరు. అతని కన్నియు ఒకే విధముగా గోచరించును. అతనిలో ద్వంద్వములు లేవు. తల్లీ! నీవు నాకు శాపమిచ్చినందుకు నీపై నాకు కోపము లేదు. శాపమును ఉపసంహరింపమని గాని, మార్చమని గాని అడుగను. నా మాటలు కష్టము కల్గించినచో నన్ను మన్నించవలెను''.

వారిద్దరకూ నమస్కరించి, చిత్రకేతుడు, రథమునెక్కి ముఖముపై చిరునవ్వు చిందగా అక్కడ నుండి వెళ్ళిపోయెను

మహాదేవుడు చిరునవ్వుతో రాజును గమనించుచుండెను అతడు సతీదేవివైపు తిరిగి యిట్లనెను. ''నారాయణుని భక్తుల గొప్పతనమును చూచితివా? వారిని యేదియు కలుషితము గావించలేదు నారాయణుని భక్తులకు స్వర్గము, నరకము, శాపము, వరము, అన్నియూ సమానమే. వారు యెట్టి ఉద్రేకములకు లోనుకాకుండ, యెక్కడ ఉన్నప్పటికీ శాంతముగా నుండెదరు వారికి అన్నియు ఒక్క రీతిగనే గోచరించును అతడు బ్రహ్మవిద్యలో నిష్ణాతుడు ద్వంద్వముల కతీతుడు. అతని ముఖములోని ప్రశాంతతను చూడుము అట్టి వానికి దారుణమైన శాపము నిచ్చితివి''. సతీదేవి కోపము అణగారగా, ఆమె చిత్రకేతుని, అతని ప్రశాంత వదనమును గాంచెను చిత్రకేతునకు తిరిగి శపించగల శక్తి యుండినప్పటికీ, అతడు ఆమెను శపింపకుండెను ఆమె శాపమును ప్రశాంత వదనముతో స్వీకరించెను.

ఆ చిత్రకేతుడు, సతీదేవి శాప కారణముగా, వృత్రుడుగా జన్మించెను

77 మరుత్తుల జననము

నారాయణుని సహాయ సంపత్తులతో ఇంద్రుడు అసురులను సంహరించునపుడు, దితికి విచారమును కోపమును వచ్చెను తోబుట్టువులను చంపిన, ఇంద్రియలోలుడు, క్రూరుడు, పాపాత్ముడు అయిన ఇంద్రుడు మరణించవలెనని ఆమె నిశ్చయించుకొని, యిట్లనెను ''ఈ ఇంద్రుడొక మూర్ఖుడు తన ప్రాణమును సంరక్షించుకొనుటకు ధర్మ సూత్రములను విస్మరించెను రాజు కావచ్చు, పాలకుడు కావచ్చు, దేవత కావచ్చు, అందరి శరీరము ఒకటి కాదా? మరణించిన రెండు మూడు రోజుల తర్వాత యీ శరీరము గ్రద్దలకు, నక్కలకు, పురుగులకు విందగును. శరీరమును దహించిన, పిడికెడు మాత్రము బూడిద మిగులును అటువంటపుడు, యీ శరీర రక్షణము కొరకు పాపములు చేయుట మూర్ఖత్వము, స్వార్థము కాదా? ఈ ఇంద్రుని చంపుటకు నేనొక పుత్రుని బడయుదును ''

దితి తన భర్త కశ్యపునకు తన కోరికను తెలిపి అది నెరవేరునట్లు సహాయపడవలసినదిగా అర్థించెను. ఆమె భర్తనుండి వాగ్దానము పొందుటకు ఒక కుతంత్రమును ప్రయోగించెను. ఆమె భర్తకు చాల రోజులు అతడు మెచ్చుకునే టంతగా సపర్యలు గావించెను కశ్యపుడు సంతసించి యిట్లనెను. ''నీవు చేసిన సపర్యలు నాకెంతో సంతోషము కల్గించినవి. నీవు యేమి కోరిన దాని నొసగుదును. నన్ను అడుగుము''. అప్పుడామె

తనకొక పుత్రుడు కావలెనని, అతడు ఇంద్రుని సంహరించవలెనని కోరెను. ఆమె యిట్టి అపవిత్రమైన కోరిక కోరినందుకు కశ్యపుడు చాల చింతించెను. అనాలోచితముగా చేసిన వాగ్దానమునకు అతడు పరితపించెను కాని మాట నిలబెట్టుకొనదలచి అతడిట్లనెను "నేను ఒక వ్రతము చేయు మంత్రములను నీకు బోధించెదను. ఒక సంవత్సర కాలము నీవు ఆ వ్రత నియమములను శ్రద్ధగా పాటించవలెను. ఇది చాల కఠినమైనది. నీవు తు.చ తప్పకుండా నా సూచనలను అనుసరించవలెను. నీవు అట్లు చేసినచో, సంవత్సరము తర్వాత నీ ప్రార్థనలకు సమాధానముగా ఒక పుత్రుడు కలుగగలడు". ఆ తర్వాత పుంసవనమనే వ్రతమును కశ్యపుడు దితికి బోధించెను.

దితి తన గర్భములో కశ్యప కుమారుడు పెరుగుచుండగా, భర్త ఉపదేశించిన వ్రతమును నిష్ఠతో ఆచరించుచుండెను ఇట్లుండగా ఇంద్రుడు దితి ఆగ్రహమును తెలుసుకొనెను ఆమె ఆచరించు వ్రతమును, ఆమెకు పుట్టబోయే కొడుకు తనను సంహరించునని ఇంద్రుడు తెలుసుకొనెను ఇంద్రుడు దితి వద్దకు వచ్చి ఆమెకు సేవచేయు భారమును వహించెను. ప్రతిరోజూ అతడు పుష్పములు, ఫలములు, సమిధలు, కుశఘాస ములు ఆమె చేయు వ్రతము కొరకు తెచ్చుచుండెను. ఆమె అవసరములకు పరిశుద్ధమైన జలమును తెచ్చుచుండెను. ఆమెను నిత్యము గమనించుచు ఆమె తోడనే ఉండజొచ్చెను అతని సేవాభక్తిని దితి మెచ్చుకొనెను. స్త్రీ సహజమైన వాత్సల్య గుణము కలదగుటచేత, అతని సేవాభక్తిలో దాగియున్న కుయుక్తిని ఆమె పసిగట్టలేకపోయెను. ఆమె విశ్రాంతి పొందుచు వ్రత నియమనిష్ఠలను ఉల్లంఘించు తరుణము కొరకు ఇంద్రుడు వేచి చూచుచుండెను వేటగాడు యెరకొరకు వేచియున్నట్లుగా నుండెను అత డెంతగా ప్రయత్నించినప్పటికీ, ఆమె ఒక క్షణము కూడా విశ్రాంతి తీసుకొనకుండెను. కశ్యపుని సూచనలను ఆమె అతి శ్రద్ధగా పాటించుచూ యెట్టి పొరపాటును చేయకుండెను అయినప్పటికీ ఇంద్రుడు తన ప్రయత్నమును విరమించలేదు.

చిట్టచివరకు ఇంద్రుని ఓర్పు ఫలించెను ఒకరోజు, ఆమె వ్రత నియమనిష్ఠలకు బాగా అలసి యుండెను. పైగా ఆమె ప్రసవించు దినములు దగ్గరకు వచ్చినవి. అలసట చేత, ఆమె స్నానమాచరించక, ఆచమనము చేయక ఒకనాటి సాయంత్రము నిద్రపోయెను ఇది భగవంతుడు తన కొసగిన మహదవకాశమని ఇంద్రుడు తలచెను తన యోగశక్తిచేత ఆమె గర్భములో ప్రవేశించెను. బంగారు వర్ణములో రూపమేర్పరచుకొనుచున్న శిశువును చూసెను. తన వజ్రాయుధముచే ఆ శిశువుని యేడు ముక్కలు చేసెను ఆ విధముగా ముక్కలైన శిశువులు రోదింప మొదలిడిరి అతడు 'మా రుద' అనగా యేడవవద్దు అని పలికెను. ఒకొక్క ముక్కను తిరిగి యేడు ముక్కలు చేసెను. అట్లు ముక్కలైన శిశువులు చేతులు జోడించి యిట్లనిరి. "ఇంద్రా! మేము నీకు సోదరులము. నీవెందుకిట్లు చేయుచున్నావు?" ఇంద్రుడు వారికిట్లు సమాధానమిచ్చెను. "మీరు భయపడవలదు మీరు నాకు సోదరులుగా ఉండుటకొరకే యిట్లు చేసితిని. మీరు నాతో దేవగణములో మరుత్తులను పేరుతో నుండగలరు"

దితి నిద్రనుండి లేచి తాను కుమారులను ప్రసవించినట్లు గ్రహించెను వారు అగ్నివలె ప్రకాశించుచు ఇంద్రుని ప్రక్కనే యుండిరి. ఆమె వారివైపు, ఇంద్రునివైపు తిలకించి చూచెను. ఆమె యిట్లనెను. "ఇంద్రా! ఈ కఠినమైన వ్రతమును నిన్ను చంపు కుమారుని గనుటకు ఆచరించుచున్నాను. నలుబది తొమ్మిది పుత్రులెట్లు కలిగిరి? అబద్ధము లాడి నన్ను మోసపుచ్చకు. నీవు సత్యము పలుకగలిగినచో నాకు చెప్పుము". ఇంద్రుడామెతో నిట్లనెను. "అమ్మా! నీవు నన్ను క్షమింప వేడెదను. నీ ఆగ్రహము నుండి నన్ను నేను

రక్షించుకొనుటకై, నీ గర్భములో ప్రవేశించి పుట్టబోవు శిశువును నాశనము చేయుటకు ప్రయత్నించితిని. కాని నా వజ్రాయుధముతో ఆ శిశువును ముక్కలు చేసినప్పటికీ అది చావకుండెను. ఈ ఘోరము చేసినందుకు నన్ను మన్నించి క్షమించవలెను. నీ పాదములకు నమస్కరింతును. ఇది చాలా క్రూర కృత్యమని నేనెఱుగుదును. కాని అమ్మా! జీవించవలెనన్న కోరిక ప్రతివారి హృదయమునందూ ఉండును. అదియే నేనిట్లు చేయుటకు కారణము. నీ పుత్రులందరూ జీవించి యున్నారు. నేను వారిని సంహరించలేకపోతిని''.

ఇంద్రునిపై దితి ఆగ్రహము యిగిరిపోయెను. ద్వేషము కూడ మటుమాయమయ్యెను. ఆమె యిట్లనెను. ''విధి వక్రించుట చేత కఠినమైన వ్రతము నాచరించుటలో ఒక క్షణ కాలము మైమరచి నిద్రించి, వ్రత నియమము నుల్లంఘించితిని. ప్రతిరోజూ అతి జాగ్రత్తగా వర్తించే నేను, యీ రోజు తప్పు చేసితిని. ఇది నా అజాగ్రత్త కాదు. నారాయణుని మాయచేతనే యిట్లు జరిగినది. నా శిశువుకు తండ్రి అమృతత్వము ప్రసాదించుటచేత, నీ వజ్రాయుధము శక్తిలేనిదయ్యెను. నీవు కోరుకున్న దానిని నీవు సాధించినావు. నా శిశువు మరణించకుండుట నా అదృష్టము''

కొన్ని క్షణములు దితి మౌనముగా నుండెను. ఇంద్రుడు తలవంచుకుని, వణకుచున్న చేతులు జోడించి నిలబడియుండెను. ఒక సాధుస్త్రీ యొక్క శాపము మృత్యువుకన్న తీవ్రమైనది. ఆమె అగ్రహమెంత తీవ్రమైనదో ఇంద్రునకు తెలియకుండెను.

దితి తనను తాను సముదాయించుకొనెను. క్రోధము, ద్వేషము ఆమె నుండి నిష్క్రమించగా, ఆమె యిట్లనెను. ''భగవదిచ్ఛను యెవరూ దాటలేరు. నా యీ పుత్రులను నీతో తీసుకువెళ్ళుము, వారు నీకు సహచరులుగా నుందురు. వారు అసుర జాతిలో జన్మించినప్పటికీ, నీ వలెనే వారందరిని దేవతలుగా పరిగణింతురు''.

78 యుధిష్ఠిరుని సందేహము

యుగములలో మూడవదైన ద్వాపరమందు, పాండవాగ్రజుడైన యుధిష్ఠిరుడు రాజసూయయాగము జరిపెను. యాగము పూర్తియైన పిమ్మట పాండవులు, అతిథులలో కెల్ల మిక్కిలి శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని, పూజించిరి. ఇందుకు చేది రాజైన శిశుపాలుడు మండిపడెను. శిశుపాలుడు కృష్ణుని నిందించుచు మాట్లాడెను. అతని నిందాఘాతము నరికట్టుటకు, కృష్ణుడతనిని సంహరింపవలసి వచ్చెను. మరణించిన తర్వాత శిశుపాలుని శరీరము నుండి వెడలిన ప్రాణము శ్రీకృష్ణుని పాదములవైపు సూటిగా వెళ్ళి అక్కడ అదృశ్యమయ్యెను. కొద్దిమంది మాత్రమే ఈ దృశ్యము చూడగలిగిరి. శిశుపాలుని శరీరము నుండి వెడలిన వెలుగు శ్రీకృష్ణుని పాదముల దిక్కుగా పయనించి, అతని పాద పద్మముల చెంత మోక్షము పొందెను. దీనిని చూసిన కొద్దిమందిలో ఒకడైన యుధిష్ఠిరుడు వెంటనే నారదుని యిట్లడిగెను. ''మహాప్రభూ! శిశుపాలుడు భగవంతునిలో ఐక్యమగుట చాలా చిత్రముగా నున్నది.

''భగవంతునికి భక్తులుగా నున్నవారు, భగవంతుని పాదముల ధ్యాస తప్ప అన్యచింత లేనివారు కూడా సులభముగా భగవంతుని చేరలేకపోవుచున్నారు. కాని యీ శిశుపాలుడు, కృష్ణుని ద్వేషించు పాపాత్ముడు,

యెప్పుడూ కృష్ణుని నిందించే శిశుపాలుడు కృష్ణునిచే నిహతుడై, కృష్ణుని పవిత్ర పాదముల చెంత చోటు చేసుకోగలిగినాడు. సుడిగాలిలోని ఘంటవలె నా మనస్సున్నది శ్రీకృష్ణుని నిరంతరము నిందించు శిశుపాలుడు నరకమునకు వెళ్ళక, భగవంతుని పాదముల చెంత ఆశ్రయము నెట్లు పొందగలిగెనో వివరించి చెప్పగోరెదను''. నారదుడిట్లు సమాధానమిచ్చెను. ''యుధిష్ఠిరా! నీ ప్రశ్న సముచితమైనది. కృష్ణుని నిందించువాడు యెందుకు శిక్ష పొందలేదని నీవు తెలుసుకొన గోరుచున్నావు. బహుశః నేనిప్పుడు చెప్పబోవునది నీకు తెలియకపోవచ్చు.

''మానావమానములు, నిందాస్తుతులు యీ శరీరముతో కూడినవి. మానవ శరీరములోనున్న వ్యక్తికి యిట్టి భావములు కలుగుచుండును. హృదయములో 'నేను', 'నాది' అను భావములు స్థిరపడినపుడు, అహంకారము చేత స్తుతించినపుడు పొంగుట, నిందించినపుడు క్రుంగుట జరుగును. ఈ అహంకారమే యితరులు హానిచేసినపుడు శిక్షించవలెనని, ఉపకారము చేసినపుడు ప్రతిఫల మొసగవలెనని తలంచును కాని భగవంతుడు వీటి కతీతుడు నీ వనుకునే యీ అపనిందలు భగవంతుని యేమాత్రము బాధించవు. నిందించిన వారిని శిక్షించుటలో కుతూహలము కూడ చూపడు అటులనే తనను పొగడువారిని స్వర్గమునకు పంపించుటయూ జరుగదు భక్తి సూత్రములు, భగవంతుని చేరు మార్గము అసాధారణమైనవి, ఆకర్షకమైనవి. దీనిని నీకు విశదపరచెదను.

''నిత్య ద్వేషము, నిత్యభక్తి, నిత్యానురాగము, లేక నిత్యము భగవంతునిపై అపేక్ష ఇవన్నియూ భగవంతుని దృష్టిలో ఒక్కటే, వారిని భగవంతుడు రక్షించును. భగవంతుని చేరు అనేక మార్గములలో యివికొన్ని. భగవంతుని నిరంతరమూ తలచుటే అంతిమ ధ్యేయము. భక్తి, భయము, అనురాగము, కోరిక, ద్వేషము, యివన్నీ భగవంతుని చేరుటకు మార్గములు రెక్కల పురుగు మట్టి పురుగును కన్నము ఉన్న గూటిలో నుంచి దానిని కుట్టుచుండునని నీకు తెలిసిన విషయమే. రెక్కల పురుగు తనను కుట్టునన్న భయముతో మట్టిపురుగు నిత్యము రెక్కల పురుగునే తలంచుటచేత, కొన్ని రోజులకు మట్టిపురుగు రెక్కల పురుగుగా రూపొంది గూడును ఛేదించుకుని బయటకు వచ్చును. అదే విధముగా నిత్యము భగవంతుని ద్వేషించుట చేత, అతని రూపము మనసులో స్థిరపడును. ఆ విధముగా వారి పాపములు తొలగి మనస్సు పరిశుద్ధమై నారాయణుని పాదములు చేరుకొందురు. భగవద్ద్వేషము ఒక రకమైన సంభ్రమ యోగము, యిది భగవంతుని చేరుటకు దగ్గర మార్గము. భక్తుడు నారాయణుని చేరుటకు దీర్ఘకాలము పట్టగా, భగవద్ద్వేషి తక్కువ కాలములో భగవత్పాదములను చేరుట విశేషము! భక్తివలెనే, కోరిక, ద్వేషము, భయము, రాగము కూడ భగవంతుని చేరుట కనువైన మార్గములు

''కృష్ణునిపై కాంక్షతో గోపికలు రాత్రింబగళ్ళు తలచుచుండిరి. వారు ముక్తి పొందెదరు. మేము భక్తితో నిరంతరము భగవంతుని తలచుటచేత మాయా ప్రపంచము నుండి స్వేచ్ఛను కనుగొనినాము కృష్ణుడన్న కంసునకు భయము. ఆ భయము చేత రాత్రి పగలూ కృష్ణుని తప్ప యింకెవరినీ తలంపకుండెను అతడు కృష్ణునిచే హతుడై అతని పాదముల చెంత చోటు చేసుకొనెను. కృష్ణునకు యాదవులందరూ బంధువర్గములోని వారగుటచేత, వారు ప్రేమతో కృష్ణుని తలంచుచుండిరి. వారి సమయ మాసన్నమైపుడు ముక్తిని పొందుదురు. నీవు, నీ సోదరులు కృష్ణునిపై విపరీతమైన అనురాగము కలిగియుండుటచేత కృష్ణుని యెల్లప్పుడూ చింతించుచు న్నారు మీకు కృష్ణుని పాదముల యెడ స్థానము తప్పక లభించగలదు గమ్యము ప్రధానము కాని, దానిని చేరు మార్గములు కాదు మానవుని తలంపులు భగవంతునిపై స్థిరముగా కుదిరినచో అతడు తప్పక ముక్తి పొందగలడు శిశుపాలుడు ప్రత్యేకమైన వరమును పొందియున్నాడు. భగవంతునిపై ద్వేషము కలిగి అతనిచే

విహతుడైన తర్వాత తిన్నగా భగవంతుని నివాసమైన వైకుంఠము చేరునట్లుగా వరమును బడసియున్నాడు. పురాణ కాలములో నారాయణుని ద్వారపాలకులైన జయ విజయులు, సనకసనందనాది ఋషులచేత భూమి మీద జన్మించునట్లు శాపము పొందినపుడు, వారికి జన్మ బంధముల నుండి విముక్తి కలిగించెదనని నారాయణుడు అభయమిచ్చినాడు. వారు భూమిపై జన్మించి నారాయణునిపై విపరీతమైన ద్వేషము కలిగి యెల్లపుడూ నారాయణునే చింతించుటచేత, స్వేచ్ఛ లభించునని వారికి నారాయణుడు చెప్పెను.

''వారు కృతయుగమునందు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగాను, త్రేతాయుగములో రావణ కుంభకర్ణులు గాను, ద్వాపరమందు శిశుపాల దంతవక్త్రులుగాను మూడుసార్లు యీ భూమిపై జన్మించిరి. ఇప్పుడు శిశుపాలుడుగా మూడవ జన్మ అంతమొందుటచేత, చాల కాలము క్రిందట యెచ్చటి నుండి బహిష్కృతుడ య్యెనో తిరిగి ఆ వైకుంఠమును చేరుకొనెను. త్వరలోనే దంతవక్త్రుడు అతని ననుసరించగలడు''.

యుధిష్ఠిరుడిట్లనెను. ''వారి గురించి మరికొంత విపులముగా చెప్పవలెను. వారిద్దరి గాథ నాలో కుతూహలము రేకెత్తించుచున్నది''.

నారదుడిట్లు చెప్పెను. హిరణ్యాక్ష హిరణ్యకశిపులు దితి పుత్రులు. సముద్రము నుండి భూమిని వెలికి తీసుకువచ్చునపుడు వరాహావతారము దాల్చిన నారాయణుడు హిరణ్యాక్షుని సంహరించెను. హిరణ్యాక్షుడు నారాయణునితో పోరాడి అతనిచేత నేలగూలెను''.

79 హిరణ్యకశిపుడు

నారాయణుడు వరాహ రూపములో తన సోదరుని సంహరించుట చూచిన హిరణ్యకశిపునకు తీవ్రమైన కోప విచారములు కలిగెను. అతని కనులు యెర్రబడెను, వణకుచున్న పెదవులను పళ్ల మధ్య అదిమిపెట్టెను. త్రిశూలమును చేత ధరించి అతడిట్లనెను. ''స్నేహితులారా! నా సోదరునకు సంభవించిన ఘోరమైన మృతి మీరందరూ యెఱుగుదురు. మనకు బద్ధశత్రువైన నారాయణుని చేత అతడు నేలగూలెను. ఇది నేను సహించలేను. ఈ త్రిశూలమును నారాయణుని హృదయములో గ్రుచ్చి, ఆ రక్తముతో చనిపోయిన నా సోదరునికి శాంతిని చేకూర్తును. అప్పుడే నన్ను నిలువునా దహించుచున్న యీ బాధ నమసిపోగలదు. నారాయణుడు మరణించగానే, అతని భక్తులు, చెట్టుకు చుట్టుకున్న లతలు చెట్టు సమూలంగా పెరికివేసిన పిదప యెండిపోయినట్లు, వారికి వారే మరణించి రాలిపోవుదురు. ఇప్పుడు మీరు నేను చెప్పినట్లు చేయవలెను. బ్రాహ్మణ క్షత్రియులతో నిండిన యీ భూమి మీద తపస్సు, యజ్ఞము, ధ్యానము చేయువారందరినీ నాశనము చేయండి. ధర్మమునకు నిలయుడైన నారాయణుడు, యెక్కడ యజ్ఞ యాగములు జరుగునో, యెక్కడ బ్రాహ్మణులు చేరి తమ నిత్య విధులను ఆచరింతురో, యెచ్చట దేవతలు ఉందురో, అక్కడ ఉండునని చెప్పుదురు. ఎక్కడెక్కడ బ్రాహ్మణులు, గోవులు, నున్నారో, వైదిక కర్మలు వేద విహితముగా జరుగునో అక్కడకు వెళ్ళి వాని నన్నింటినీ నాశనము గావింపుడు. అన్నింటినీ దగ్ధము చేయుడు. ప్రతి ఒక్కరినీ చంపివేయుడు. పవిత్ర వృక్షములను పెరికి పారవేయుడు. నారాయణునికి నిలువ నీడ లేకుండ మీరు చేయగల్గినదంతా చేయవలెను''.

ప్రభువు ఆజ్ఞానుసారము అసురులు ప్రతి ఒక్కరిని వేధింప దొడగిరి నగరములు, గ్రామములు, గోశాలలు, పూల తోటలు, ఋషులు నివసించు ఆశ్రమములు, భూములు, గృహములు, సర్వస్వమూ వారిచే ధ్వంసమయ్యెను గునపములు, బల్లెములు మున్నగు పరికరములతో గోపురములను, దేవాలయములను, నగర ప్రాకారములను, భవనములను కూల్చి నేలమట్టము చేసిరి. వంతెనలను, రహదారి మార్గములను పగులగొట్టిరి నారాయణునకు పవిత్రమైన మామిడి మొదలగు ఫల వృక్షములను నరికి నేల గూల్చిరి నారాయణునకు పేద ప్రజలు ప్రీతి పాత్రులగుటచేత, వారి గుడిసెలను తగులబెట్టిరి.

అసురులచే బాధలు పడుచున్న దేవతలు స్వర్గమును వదలిపెట్టి యీ భూమి మీద మారు వేషములతో సంచరించుచుండిరి. హిరణ్యాక్షుని మరణమునకు పరితపించుచున్న బంధువులను హిరణ్యకశిపుడు ఓదార్చు చుండెను వారితో అతడిట్లనెను ''ఒక గొప్ప వీరుని మరణమునకు విచారించుట సరియైనది కాదు. యుద్ధములో మరణమును వీరులు కోరెదరు. పురాతన కర్మ ఫలితముగా యిద్దరు జన్మనెత్తిరి వారి కర్మ ననుసరించి యీ జన్మలో వారికి యెడబాటు సంభవించినది కలియుట, కొంతకాలము కలిసి జీవించుట ఒక ఉత్సవములో కలుసుకొనుట వంటిది. మరణించని వాని న్నరని చెప్పగలను ఆత్మ నిత్యము, శుద్ధము, అనశ్వరము ఇది శరీరములో నివసించునప్పటికీ, దానికి భిన్నమైనది. శరీరమును ధరించు ఆత్మ మానవ గుణములు కలిగియుండును శరీరము మరణించగానే ఆ వ్యక్తి మరణించినట్లు భావించెదరు. కాని అది సరికాదు సుఖసంతోషములు, యితర ద్వంద్వానుభూతులు రక్త మాంసములతో నిండిన యీ శరీరమునకు సంబంధించినవి కాని, ఆత్మకు సంబంధించినవి కావు నదీ తీరమున నున్న చెట్ల నీడను నది జలములో మీరు కాంచ లేదా? నదిలో నీరు కదులుచున్నపుడు, చెట్ల నీడ కదలుచున్నట్లు గోచరించును కాని చెట్లు, వాని నీడలు స్థిరమైనవి వానికి కదలిక లేదు గిరగిర తిరిగే మానవునకు ప్రపంచమంతయూ తిరుగుచున్నట్లు కన్పించును కాని అట్లు జరుగుట లేదు అదే విధముగా, యీ శరీరము కప్పియున్న ఆత్మ మానవులకు కలుగు భావోద్వేగములను అనుభవించుచున్నదని తలచెదము కాని అది సత్యము కాదు స్వేచ్ఛగా నున్న ఆత్మ, శరీరమందు కట్టుపడిన ఆత్మ వేర్వేరుగా గోచరించును కట్టుపడిన ఆత్మ శరీరముతో కూడి యుండుటచేత, మానవులకు కలిగే సామాన్య అనుభవములు - విడిపోవుట, కలియుట, జన్మించుట, మరణించుట, మనస్తాపము, దుఃఖము, మున్నగునవి - ఆత్మ అనుభవించుచున్నట్లు భావించెదము కాని బుద్ధి నుపయోగించి తెలుసుకొనినచో అట్లు గాదని స్పష్టమగును. శరీరమునకు భిన్నముగా నున్న ఆత్మకు మానవుని భావములతో గాని, అనుభవములతోగాని సంబంధము లేదు మీ విచారమును వదలిపెట్టి, మనము చేయు కార్యము గురించి యోచింపుడు నా సోదరుని మరణమునకు ప్రతీకారముగా నారాయణుని నాశనము చేయు మార్గములను కనుగొనెదను''

80 హిరణ్యకశిపునకు వరప్రసాదము

హిరణ్యకశిపునకొక కోరిక యుండెను. అతడు అజేయుడుగను, మరణము లేకుండగను ఉండవలెనని తలచెను ఈ ముల్లోకములకు ఏకైక ప్రభువుగా నుండవలెనని అతని కోరిక తన కోరిక నెరవేరుటకు తపస్సు చేయ నిశ్చయించుకొనెను తీవ్రముగా తపస్సు చేసి, తపశ్శక్తిచేత బ్రహ్మదేవుని మెప్పించి అతనిచే వరములను పొందవచ్చునని భావించెను మందర పర్వతమునకేగి, అనేక సంవత్సరములు ఏకాగ్రతతో తీవ్రముగా తపస్సు

చేసెను అతడు తీవ్రమైన తపస్సు చేయుచున్నపుడు, దేవతలు మారువేషములు తీసివేసి తిరిగి స్వర్గము చేరుకొనిరి రోజులు గడిచిన కొలది హిరణ్యకశిపుని తపస్సు తీవ్రత హెచ్చెను ఆ తీవ్రత వలన అతడు మిట్ట మధ్యాహ్నపు సూర్యుని వలె ప్రకాశించు చుండెను. అతని శిరస్సున గల ప్రతి జట ముడి అగ్ని వెళ్ళగక్కు చున్నట్లుండెను లోకమంతయు తపస్సు తీవ్రతకు వేడెక్కి భస్మమగునాయని అనిపించెను. సముద్రములు, నదులు అల్లకల్లోలముగా నుండెను. భూమి కంపించెను పర్వతముల నుండి మంటలు వెడలుచుండెను. నక్షత్రములు రాలుచుండెను. దిక్కులు మండిపోవుచుండెను హిరణ్యకశిపుని తపస్సు అంత తీవ్రముగా నుండెను

ఎప్పటి వలెనే దేవతలు బ్రహ్మ కడకు వెళ్ళి యిట్లనిరి ''దేవా! మీరు మీ భక్తుని వద్దకు వెళ్ళగోరెదము. అతని కోరికలు తీర్చు సమయము యేతెంచినది. అతని తీవ్ర తపస్సుచేత జనించిన వేడిని మేము భరించలేకున్నాము అతని కోరికలు మీకు తెలియనివి కావు. అయినప్పటికీ మీకొక హెచ్చరికను చేయదలచితిమి. హిరణ్యకశిపుడు, 'తపశ్శక్తి చేత బ్రహ్మ ఒకప్పుడు యీ లోకమును, దేవతలందరి నివాసములకన్న అత్యుత్తమమైన సత్యలోకమును తన నివాసము కొరకు సృష్టించెను నేను తీవ్ర ప్రయత్నము చేసినచో, నేను కూడ బ్రహ్మను కాగలను అప్పుడు నేను సత్య లోకమును నా నివాసముగా చేసుకొనగలను. అప్పుడు నేనొక నూతన ప్రపంచమును సృష్టించి న్యాయ చట్టము లన్నిటినీ మార్చివేయుదును ఇంత కాలముగా వాడుకలో ఉన్న న్యాయములన్నింటినీ మార్చివేయుదును, వేయేల వాటిని సంపూర్ణముగా నిర్మూలించెదను. ఇంతవరకు యేది పాపమని పరిగణించుచున్నారో అసురులందరూ దేవతలగుదురు నేను బ్రహ్మనైనపుడు దేవ . అని పలికి యున్నాడట అందుకొరకే హిరణ్యకశిపుడు యింత తీవ్రముగా తపస్సు చేయుచున్నాడు దేవా! మీరు అతని వద్దకు వెళ్ళి వరము లిచ్చునపుడు యీ విషయములు జ్ఞప్తియందుంచుకొనవలెను''

బ్రహ్మ వారి మాటలు విని, హిరణ్యకశిపుడు తపస్సు చేయుచున్న గుహకు వెళ్ళెను మొదట హిరణ్యకశిపుని చూడలేకపోయెను అతని చుట్టూ చెట్లు, పుట్టలు పెరిగిపోయెను బ్రహ్మ అతనిని సమీపించి యిట్లనెను ''కుమారా! నీ తీవ్ర తపస్సుకు మెచ్చితిని. ఇంతకు ముందెవ్వరూ యింతటి భక్తితో, యేకాగ్రతతో తపస్సు ఆచరించి యుండలేదు. నాకు చాల సంతోషముగా నున్నది నీకు కావలసినది నన్ను అడుగుము. దానిని నీకు ప్రసాదించెదను''

హిరణ్యకశిపుని భక్తికి బ్రహ్మ ఆనందముతో తన్మయత్వము చెందెను. ఆ తన్మయత్వములో దేవతలు చేసిన హెచ్చరికలను మరచిపోయెను హిరణ్యకశిపుడు బ్రహ్మ పాదములకు ప్రణమిల్లగా తన కమండలములో జలము చేతిలోనికి తీసుకుని అతని శిరస్సుపై జల్లెను వెంటనే రాక్షస రాజు, అంత్యను వేరి పోగొట్టుకున్న పూర్వపు బలమును, స్వచ్ఛతను, సౌందర్యమును, తిరిగి పొందెను కరిగించిన బంగారము వలె అతడు మెరయు చుండెను అతని కండ్లలో అశ్రువులు చిమ్మగా, గద్గద స్వరముతో యిట్లనెను బ్రహ్మను చూచుటతోనే సంతోషము ముంచుకు వచ్చెను. అతడు బ్రహ్మను పొగడి, యిట్లు పలికెను ''మీరు నాకొక వరమును ప్రసాదించవలెను. ఒకే ఒక్క వరము. నాకు అనేక కోరికలు ఉండెను కాని మిమ్ములను చూచిన తక్షణమే, నేనడగకుండనే అవి అన్నియు మీరు వాటిని ప్రసాదించినట్లు తెలుసుకున్నాను నేను కోరు ఒకే ఒక్క వరము - నాకు అమరత్వము, అనగా మరణము లేకుండ అనుగ్రహించవలెను''.

బ్రహ్మ యిట్లనెను ''కుమారా! అమరుడను కాని నేను, నీకు అమరత్వమును ప్రసాదించలేను కాని, వేని వలన మరణము కలుగకుండ నివారించ వచ్చునో వాటిని కోరుకొనుము, నేను వాటిని నీకు ప్రసాదించగలను నేను అంతకన్న యేమియు చేయలేను''.

హిరణ్యకశిపుడిట్లనెను. ''అట్లయినచో మీరు సృష్టించిన వేనియూ నా మరణమునకు కారణము కారాదు ఏ ఒక్కదాని చేతనూ నేను మరణింపకూడదు. ఆయుధములచేత నేను మరణించరాదు ఇంటి వెలుపల గాని లోపలగాని నాకు మరణము సంభవించకూడదు. రాత్రి యందు గాని పగటి యందు గాని నేను మరణించరాదు, భూమిపై గాని, ఆకాశమందుగాని నాకు మరణము కలుగరాదు. నాకు మానవుని చేత గాని మృగము చేతకాని మరణము కలుగకూడదు ప్రాణమున్న జీవుల చేత గాని జడ పదార్థముల చేతగాని నేను చావ కూడదు. దేవతలు, అసురులు, సర్పములు నన్ను నాశనము గావించుటకు శక్తి లేక యుండవలెను ఈ వరమును నాకు ప్రసాదింపుడు మరియు నేను యీ ప్రపంచమునకు ఏకచ్ఛత్రాధిపతిగా నుండగలనని వాగ్దానము చేయవలెను. అంతేకాక తరగని విశేష సంపదను అనుగ్రహించవలెను''.

బ్రహ్మ హిరణ్యకశిపునకు వరములను ప్రసాదించి, మందర పర్వతము నుండి అదృశ్యమయ్యెను

హిరణ్యకశిపుడు దండయాత్రకు బయలుదేరెను. బ్రహ్మ అనుగ్రహించిన వరముల ప్రకారము, అతడు ముల్లోకములను, దిక్పాలకులను జయించెను. ఇంద్రుడు, వరుణుడు, కుబేరుడు, యముడు అతనికి సామంతులైరి స్వర్గమున కేగి ఇంద్ర భవనము నాక్రమించెను ఇంద్రుని సేవకులందరూ యిప్పుడు హిరణ్యకశిపునకు సేవ చేయుచుండిరి. ఇంద్రునికి, యితర దేవతలకు చెందవలసిన హవిస్సు హిరణ్యకశిపునకు లభించుచున్నది దున్నకపోయినప్పటికి భూమి పంటను యివ్వవలసి వచ్చెను. సప్త సముద్రములు, వాటిలో నిక్షిప్తముగా నున్న మణులను హిరణ్యకశిపున కిచ్చివేసెను

అయినప్పటికీ హిరణ్యకశిపునకు సంతోషము లేకుండెను. అతడు నారాయణుని ద్వేషించుచుండెను అడవిలో అగ్ని రగులుకున్నట్లు యీ ద్వేషము అతని లోలోపల రగులుకొనుచుండెను. ఇట్లు సంవత్సరములు గడిచిపోయెను. రాక్షసరాజు అత్యాచారములు భరించలేనంతగా నుండెను.

ప్రజలు తమ హృదయ కుహరములలో భగవంతుని ప్రార్థించుచుండిరి కాని బయట హిరణ్యకశిపుని యెడల భక్తి విధేయతలు ప్రదర్శించుచుండిరి గత్యంతరము లేక దేవతలు నారాయణుని వద్దకు వెళ్ళి రాక్షసరాజు అకృత్యముల నుండి విముక్తి కలిగించమని ప్రార్థించిరి.

భగవంతుడు వారిని సముదాయించి యిట్లనెను. ''భయము లేదు. నాకు వదలి పెట్టుడు. మీరు అనుభవించుచున్న బాధలు నాకు తెలియును. హిరణ్యకశిపుని క్రూరత్వము మితిమీరి సహింపరానిదిగా ఉంటున్నది. అతడొక ఉత్తమ పుత్రునికి తండ్రికాగలడు. పాపాత్ముడైన హిరణ్యకశిపుడు, ప్రేమ, స్నేహశీలత, నాకు ప్రియమైన యితర సద్గుణములతో మూర్తీభవించిన తన పుత్రుని మిక్కిలిగా బాధించునపుడు, నేను ప్రత్యక్షమగుదును. అతనికి బ్రహ్మ అనేక వరములు యిచ్చినప్పటికీ, నేను హిరణ్యకశిపుని నాశనము చేయుదును. దేవతలను ద్వేషించువాడు, వేదములను, బ్రాహ్మణులను, గోవులను, ఋషులను, ధర్మమును, నన్ను అవమానించువాడు, నా చేతిలో నాశన మొందునని మీరు యెఱుగరా? అయితే తగిన సమయము రావలెను. భయపడవలదు. అతని కుమారుడు హిరణ్యకశిపుని మరణమునకు కారకుడగును. నేను అతనిని

వధింతును''.

నారాయణుని అభయ వచనములకు దేవతలు సంతృప్తిపొంది అక్కడ నుండి నిష్క్రమించిరి. హిరణ్యకశిపుని మరణము త్వరలోనే సంభవించి వారి బాధలు అంతమగునను ఆలోచనలతో, యెట్లో కొంత కాలము యీ బాధలు సహించవచ్చునని తలచి, ఆ సమయము కొరకు వేచి చూచుచుండిరి. వారిలో తిరిగి ఆశ చిగురించగా, మంచి రోజులకై యెదురు చూచుచుండిరి.

81 ప్రహ్లాదుడు

నలుగురు పుత్రులకు హిరణ్యకశిపుడు తండ్రి అయ్యెను. వారు : సంహ్రాదుడు, అనుహ్రాదుడు, హ్రాదుడు, ప్రహ్లాదుడు. ఆఖరి వాడైన ప్రహ్లాదుడు దేవతా గుణములు కలిగి యుండెను. పెద్దల యెడ గౌరవము, బ్రాహ్మణుల యందు ప్రేమను చూపుచుండెను. అతని ప్రవర్తన దోషరహితముగా నుండెను. అతడు నియమములను పాటించుచు సత్యమునే పలుకుచుండెను. ఇంద్రియ నిగ్రహము కలిగియుండెను. అన్ని ప్రాణులను ప్రేమించుచుండెను. మంచి హృదయము కలవాడై యుండెను. బాధలలో నున్నవారికి స్నేహితుడుగా వారికి ఊరట చేకూర్చుచుండెను. జ్ఞానులకు సేవకునివలె సేవ చేయుచుండెను. దుఃఖములో నున్నవారిని, తండ్రి పిల్ల వానిని సముదాయించినట్లు, సముదాయించుచుండెను. సమాన వయస్కులతో సోదరునివలె మెలగుచుండెను. అతనిలో అహంకారము లేదు, హృదయము వినయముతో నిండియుండెను. ఎప్పుడు సమత్వ భావముతో నుండెను. ఒక మాటలో చెప్పవలెనన్న, రాక్షస రాజైన హిరణ్యకశిపునకు తగిన పుత్రుడు కాడు.

అసురులకు గురునైన శుక్రాచార్యునకు ఇద్దరు కుమారులు గలరు. వారు : చండ, అమార్కులు. హిరణ్యకశిపుడు, చండామార్కులను ప్రహ్లాదునికి అసుర పద్ధతి కనుగుణముగా ప్రవర్తనా నియమావళిని బోధించుటకు నియమించెను. అప్పుడు ప్రహ్లాదుని వయస్సు అయిదు సంవత్సరములు. ప్రహ్లాదునితోబాటు యితర అసుర బాలురు గూడ యీ గురువుల వద్ద శిష్యులుగా నుండిరి. ప్రహ్లాదుడు వారు చెప్పు పాఠములను, గురువులను సంతృప్తి పరచుటకు చదువుచుండెను. కాని తన హృదయము వాటి నంగీకరింపకుండెను.

ఒకరోజు హిరణ్యకశిపుడు పుత్రుడైన ప్రహ్లాదుని తన తొడపై కూర్చుండ బెట్టుకుని యిట్లనెను. ''కుమారా! కొంత కాలముగా గురువుల వద్ద నీవు పాఠములు నేర్చుచున్నావు. ఈ లోకములో అత్యుత్తమమైనదేదో చెప్పుము?'' ప్రహ్లాదుడిట్లు జవాబిచ్చెను. ''తండ్రీ! ప్రజలు దుఃఖములో చిక్కుకుని యుండుట నేను గమనించినాను. 'నేను', 'నాది' అనే రెండింటి వలన కలిగే భ్రాంతి యిందుకు కారణమని నేను భావిస్తున్నాను. ఇట్టి అసత్యమైన భ్రాంతి వారి బాధకు కారణమగుచున్నది. ఈ తప్పుడు మార్గము నవలంబించుటచేత ఆత్మ అధోగతి పాలగుట తథ్యము. నా దృష్టిలో యీ లోకమందు అత్యుత్తమమైనది గృహమును, తనది అనుకున్న వాటి నన్నింటినీ విడచి, యెండిపోయిన నూతిన విడిచిపుచ్చినట్లు, అరణ్యమున కేగి, నారాయణుని పాదములను ఆశ్రయించుట''.

ఒక క్షణ కాలము హిరణ్యకశిపునకు నోట మాట రాకుండెను. తన అయిదేండ్ల కుమారుని నోటి నుండి యిట్టి మాటలు వచ్చునని అతడెన్నడూ తలంచలేదు అతనికి ఆగ్రహము కలుగబోయెను. కాని కోపము నిగ్రహించుకుని నవ్వెను.

తనలో తానిట్లనుకొనెను. ''నా కుమారుడు యింకను పసివాడు. ఇతరులు చెప్పిన దానిని మాత్రమే వల్లవేయును. నారాయణుని ప్రేమించు వారు పలుకు మాటలనే అతడు చెప్పెను. ఇది వారందరికీ యిష్టమైన వి ి భక్తులను తప్పక చూచి యుండవచ్చును. ఈ అర్థము లేని మాటలు పలికి నందుకు నా కుమారుని నిందించరాదు''

హిరణ్యకశిపుడు గురువులైన చండామార్కులను పిలిచి, వారితో నిట్లు పలికెను ''నారాయణ భక్తులు, నారదుని వంటి భక్తులెవరూ నా కుమారుని చేరువకు రాకుండ కనిపెట్టవలెను మీ దృష్టి నుండి తప్పి వెళ్ళకుండ చూడవలెను మీ గృహములోనే ఉండి, మీ వద్దనే నేర్చుకొనునట్లు చూడుడు'' భగవద్భక్తులు సామాన్య పౌరులవలె సంచరించుచూ, వారి ప్రభావమును తన పుత్రునిపై కల్గించు చున్నారని హిరణ్యకశిపుడు నిశ్చయముగా తలపోసెను గురువుల యింటిలో ప్రహ్లాదుని ఉంచుట వలన, నారాయణ భక్తుల చేత 'కలుషితము' కాకుండ రక్షణొందునని భావించెను.

గురువుల యింట, ప్రహ్లాదుడు శుక్రాచార్యుని యిర్దరు పుత్రుల మధ్య నుండెను మృదు వచనములతో సరళముగా వారు యిట్లడిగిరి ''రాకుమారా! ఇతరుల వలె గాక నీ మనస్సు మరొక విధముగా యేల ఉంటున్నది? నీవు యితర అసుర బాలురవలె లేవు. నిజము చెప్పుము. ఈ ఆలోచనలు నీ స్వంతమైనవా, లేక యితరు లెవరైనా యీ ఆలోచనలు నీలో కల్గించినారా? అట్లయిన, అతడెవరు? భయము లేకుండ చెప్పుము. నిన్ను మేము శిక్షించము''

ప్రహ్లాదుడిట్లు సమాధానమిచ్చెను ''నాకు యిట్టి ఉత్తమ భావములను ప్రసాదించిన ఆ భగవంతునికి నమస్కారము. గురువర్యులారా! నా మాటలను విని వాటిని జాగ్రత్తగా పరిశీలింపుడు మానవులు అజ్ఞానము చేత 'నేను', 'నాది' అను భేదములతో చింతింతురు. కాని నిజముగా అటువంటిదేదియూ లేదు. నా ఆలోచనలు యితరుల ఆలోచనలు వేర్వేరని భ్రాంతి కలుగుచుండును భగవంతుడు మానవుని అనుగ్రహింప నిశ్చయించు కున్నపుడు, అతనిలోని ద్వంద్వ భావములు నిర్మూలమగును ఈ ద్వంద్వ భావములే మానవుని విచక్షణా శక్తిని హరించుచున్నవి ఈ ద్వంద్వములే అసత్యమైన దుఃఖ ప్రపంచములో మానవుని పడవేయుచున్నవి. అజ్ఞానులు భగవంతుడు వేరు, మానవుడు వేరని తలచెదరు. గొప్ప వేదాంతులు సైతము అజ్ఞానమను యెడారి యిసుకలో తిరుగాడుచున్నారు. ఈ ద్వంద్వముల కతీతుడైన భగవంతుడే నాకిట్టి ఆలోచనలు కలిగించెను. వేరెవరూ కాదు అయస్కాంతము యినుప ముక్కను ఆకర్షించినట్లు, నా మనస్సు, తనకు తానుగా, నారాయణుని ఆకర్షణకు లోనైనది. నా ఆలోచనలు నిరంతరము నారాయణుని చుట్టూ తిరుగుచున్నవి నారాయణుని నిరంతరమూ తలచు భాగ్యము కలుగుటకు, యింతకు ముందు జన్మలో నేను యేమి సుకృతములు గావించితినో నేనెఱుగను''

గురువులు సహనము కోల్పోయిరి. వారిలో ఒకరిట్లనెను. ''గురువుల యెడ అగౌరవముగా ప్రవర్తించు యీ బాలుని శిక్షించుటకు ఒక క్రమ తీసుకురండు. ఇతడు మాకు అవమానము అగౌరవము తెచ్చిపెట్టగలడు ఇతని చెడు మనస్సు, అగ్ని అరణ్యమును దహించునట్లు, కుటుంబము నంతనూ దగ్ధము చేయగలడు

శిక్ష ద్వారా మాత్రమే యితడిని సరియైన మార్గమునకు తీసుకు రాగలము. మంచి గంధము చెట్లున్న అరణ్యములో యీ బాలుడు వేరొక వృక్షమువలె నున్నాడు. నారాయణుడు గొడ్డలితో యీ అరణ్యమున నశింపజేయుటకు, యీ బాలుని గొడ్డలిని పట్టుకునే కర్రగా ఉపయోగించుచున్నాడు''. శిక్షించెదమని బెదరించి, చండామార్కులు, ప్రహ్లాదునకు రాక్షస కుమారునికి బోధింపదగిన వాటిని బోధించుటకు ప్రయత్నించిరి.

కొంత కాలము గడచెను. ప్రహ్లాదునిలో శిక్షా భయమును తగినంతగా కలిగించి, వారు బోధించిన దంతయు అతడు నేర్చెనని వారు భావించిరి. ఆ బాలుని యిప్పుడు హిరణ్యకశిపుని వద్దకు తీసుకువెళ్ళి, తాము బోధించినది తెలుపవచ్చునని తలంచిరి. ఒకరోజు వారు ప్రహ్లాదుని హిరణ్యకశిపుని వద్దకు తీసుకువెళ్ళిరి. ప్రహ్లాదుడు తండ్రి పాదములకు ప్రణమిల్లి ఆపాద ధూళిని శిరస్సుపై వేసుకొనెను కనుల వెంట ఆనందాశ్రువులు రాలగా, హిరణ్యకశిపుడు కుమారుని తన తొడపై కూర్చుండబెట్టుకొని యిట్లనెను ''నీ గురువుల వద్ద నీవు చాల నేర్చితివి నీవు నేర్చుకున్న దానిలో కొంత చెప్పి నాకు ఆహ్లాదము కలిగింపుము''

82 ప్రహ్లాదుడు నేర్చిన పాఠములు

ప్రహ్లాదుని నేత్రములు స్ఫూర్తివంతము లయ్యెను. తండ్రివైపు కనులెత్తి చూచి సరళ స్వరముతో నిట్లనెను. ''తండ్రీ! నాకు సహాయపడే తొమ్మిది ముఖ్య పాఠములను నేర్చితిని''

''అవి యేమిటి నాయనా!'' తండ్రి ప్రేమతో అడిగెను

''అవి శ్రవణము, అనగా వినుట; కీర్తనము అనగా గానము చేయుట; స్మరణము అనగా ధ్యానించుట, పాదసేవనము అనగా పాదములు సేవించుట; అర్చనము అనగా పొగడుట; వందనము అనగా పూజించుట; దాస్యము అనగా సేవచేయుట, సఖ్యము అనగా స్నేహము కలిగియుండుట, ఆత్మ నివేదనము అనగా పూర్తిగా శరణాగతుడగుట''.

''చాలా బాగున్నది, చాలా బాగున్నది'' అని హిరణ్యకశిపుడనెను. ''వీటిలో యే ఒక్క విధముచేత నైనను నన్ను సేవించినచో, నేను అమితముగా సంతోషించెదను. నీవు పాఠములను చక్కగా నేర్చితివి''.

తన సంతృప్తిని వెలిబుచ్చు నేత్రములను గురువులపై ప్రసరించెను గురువులు కూడ సంతోషము, సంతృప్తి కలిగి యుండిరి. ప్రేమ పూరిత నేత్రములతో కుమారుని గాంచి అతనిని మృదువుగా నిమిరెను.

''తండ్రీ! ఇవి నారాయణుని ఆరాధించు మార్గములు. సర్వత్రా వ్యాపించియున్న నారాయణుని, యీ తొమ్మిది మార్గములలో యే మార్గము చేతనైనను చేరవచ్చును ఈ పాఠమును నేర్వగల్గుట నా అదృష్టము''. అని ప్రహ్లాదుడు పలికెను.

ప్రహ్లాదుడు నిశ్శబ్దముగా కూర్చుండెను ఒక క్షణము తండ్రి కూడ మౌనముగా నుండెను హిరణ్యకశిపుడు ఆగ్రహముతో మండిపడి నిప్పుల వంటి తన కనులను ఉరుముని కుమారునివైపు ప్రసరించి యిట్లనెను

''నేను వినుచున్నదేమి? ఈ పాఠమును బోధింపుమనియా నేను మిమ్ములను అడిగినది? మీరు నా కుమారుని సర్వనాశనము చేయుచున్నారు. మీరు నా యెడల విశ్వాసము లేనివారని తెలుసుకున్నాను మీరు శత్రుపక్షము చేరి, నా కుమారునికి పనికిమాలినవి బోధించుచున్నారు మీచేత నేను మోసపోయినాను'' గురువులు తమ నిర్దోషిత్వమును తెల్పి హిరణ్యకశిపునికి నచ్చజెప్పుటకు అనేక విధములుగా ప్రయత్నించిరి. వారిట్లనిరి. ''ఓ ప్రభూ! ఇది మేము చెప్పినది కాదు మమ్ములను నమ్మండి ఇవి మేము యీ బాలునికి బోధించలేదు మాకు తెలిసినంతవరకు యింకెవరూ కూడ యివి బోధించలేదు అతనికి సహజముగానే అబ్బినవి మీ ఆగ్రహమును నిగ్రహించుకొనుడు అతని అవిధేయతను మాకు అంటగట్టవద్దు. మేము నిర్దోషులము''.

వారి చిత్తశుద్ధికి హిరణ్యకశిపుడు కొద్దిగా మెత్తబడి, పుత్రునివైపు తిరిగి యిట్లనెను ''కుమారా! ఇటుచూడు. అర్థము లేని యీ పాఠమును గురువులు నీకు బోధించలేదని చెప్పుచున్నారు. నన్ను, నిన్ను సర్వనాశనము గావించే యీ పాఠములు నీ కెవరు బోధించిరో చెప్పుము?'' తండ్రి ఆగ్రహమునకు చెక్కు చెదరక, ప్రహ్లాదుడు తండ్రివైపు స్థిర దృక్కులను బరపి యిట్లనెను ''భగవంతుని గొప్పదనమును నీవంటి వారు తెలుసుకొనలేరు ఈ వస్తు ప్రపంచములో నిమగ్నులై, ఇంద్రియానుభవములే సర్వస్వమూ అని తలచి, దానివలన కలిగే ఆనందము క్షణికమని తెలిసి కూడ అట్టి ఆనందము కొరకు పాటుపడువారు గుడ్డి వారిని గుడ్డి వారనుసరించి నట్లుందురు. వేదములు నిర్దేశించిన కర్మకాండలను నీవు జరుపురువు. వాటిని జరుపమని చెప్పువారు కూడ నీ వలెనే సత్యము నెఱుగని అజ్ఞానులు. ఈ జీవితము యొక్క అంతిమ ధ్యేయము ఇంద్రియ సుఖముల ననుభవించి నీచమైన దురాశతో జీవించుటే యని నీవు భావించవచ్చు నీ పరిస్థితి చాల దయనీయమైనది.

''వైరాగ్యము పొందిన మహాపురుషుల పాద ధూళిని నీవు స్వీకరించనంతవరకు, నిత్య సత్యమైన నారాయణుని పాదముల యందు నీ మనస్సు స్థిరపడలేదు ఈ లోకమును ధేరించి దానికి దూరమైనపుడే నీ మనస్సును భగవంతునిపై లగ్నము చేయగలవు భగవంతునిపై అనురాగము స్వతస్సిద్ధముగా కలుగవలెను. గురువుల బోధ చేతకాని, సజ్జన సాంగత్యముచేతగాని యిట్టి మనోభావము కలుగదు భౌతిక ప్రపంచముపై వ్యామోహము నడలనంతవరకు, నేను నేర్చిన పాఠములను నీవు తెలుసుకొనలేవు''

చాలసేపటి వరకు హిరణ్యకశిపునకు మాట రాకుండెను. అతని కోపము తీవ్రమగుటచేత మాటలు పెదవులు దాటి వచ్చుట లేదు. కుమారుని తన ఒడిలో నుండి బలముగా త్రోసివేసెను. సేవకులను పిలిచి యిట్లనెను ''ఈ పాపాత్ముని నా యెదుట నుండి దూరముగా తీసుకుపొండి. అతడిని చంపవలెను తన వారిపై వీనికి అభిమానము లేదు. నా యెదుటనే, నాకు బద్ధశత్రువు, నా సోదరుని హతమార్చిన నారాయణుని పొగడే ధైర్యము వీనికున్నది. ఇతడు నారాయణుని కీర్తించి గానము చేయుచున్నాడు. ఆ 'భగవంతుడ'ను వానిపై వీనికున్న అపార ప్రేమ చూచినచో, వీడు నాకు ప్రబల శత్రువే కాని పుత్రుడు కాడని తోచుచున్నది. అయిదేళ్ళ వయసు నందే తన తండ్రిని పరిత్యజించెను. వీనివలన నాకేమియు మంచి జరుగబోదు. ఏ కుమారుడైనను యీ విధముగా తన తండ్రి యెడల ప్రవర్తించినపుడు , భయంకర రోగమును వదిలించుకున్నట్లు ఆ కుమారుని వదిలించుకొనవలెను శరీరములో ఒక భాగము శరీరమునకంతకూ బాధ కలిగించునపుడు, ఆ భాగమును తీసివేయుటే సమంజసము అప్పుడే శరీరము రక్షణ నొందును. ఇతడు నా పుత్రుడని మీరు భావింతురు. కాని ఇతడు నాకు శత్రువు ఇతడు ఒక ఋషి హృదయములో పెరిగే కోరికవలె నున్నాడు. దీనిని నాశనము చేయకున్నట్లయితే, యిది నసించుచున్న గృహమే నాశనము కాగలదు. సాధ్యమైనంత త్వరలోనే యీ బాలుని హతమార్చవలెను''

రాజు హిరణ్యకశిపుని సమక్షములో అతని అనుయాయులు భయంకరమైన త్రిశూలములు, పొడుగైన కత్రలతో ఆ బాలుని బాధింప మొదలిడిరి. ప్రహ్లాదుడు నిశ్చలముగా నిలిచి యుండెను అతని మనస్సు భగవంతునిపై లగ్నమై యున్నది ఇంతలో ఒక విచిత్రము గోచరించెను ఆ ఆయుధములు బాలునికి యెట్టి గాయము కల్గింపక నిరర్థకము లయ్యెను భగవదనుగ్రహము లేని మానవ ప్రయత్నములు విఫలమైనట్లుండెను ఈ దృశ్యము చూచి ఆశ్చర్యపడి, హిరణ్యకశిపుడు తన సేవకులు చేయు కార్యమును ఆపివేయమని చెప్పి యిట్లనెను ''ఇతర మార్గములను ప్రయోగించి చూచెదము''

ఆ బాలుని చంపుటకు అనేక విధములుగా ప్రయత్నించి విఫలుడయ్యెను ప్రహ్లాదుని నేలపై పరుండబెట్టి అతనిని అడవి యేనుగులచే త్రొక్కించెను ఆ యేనుగులు ప్రహ్లాదుని త్రొక్కివేయగా అతడు మరణించునని రాజు తలచెను కాని ప్రహ్లాదుడు చావకుండెను పాములతో నిండిన గోతిలో ప్రహ్లాదుని బడద్రోయించిన వాటి కాటునకు బాలుడు మరణించునని భావించెను. కాని బాలుని కేమియు జరుగకుండెను ఎత్తైన పర్వతము నుండి ప్రహ్లాదుని క్రిందకు త్రోయించెను కాని ప్రహ్లాదుడు యెట్టి గాయము లేకుండ లేచి వచ్చెను ఒక గొయ్యి త్రవ్వి అందు ప్రహ్లాదుని త్రోసి ఆ గొయ్యి పూడ్పించెను అయినను ప్రహ్లాదుడు చావలేదు అతనికి విషము పెట్టిరి అతని శరీరమునకు నిప్పు అంటించిరి కాని ప్రహ్లాదునకు మరణము కలుగలేదు చిన్న వానిని అయిదేళ్ళ కుమారుని చంపలేకపోయినందుకు రాజు దిక్కుతోచని వాడయ్యెను

గురువులు, ఆలోచనలో మునిగియున్న రాజును సమీపించి, యిట్లనిరి ''కొంత కాలము తర్వాత యీ బాలుని సరిదిద్దవచ్చును మాతో తీసుకువెళ్ళి తిరిగి ప్రయత్నించెదము ఇతర అసుర బాలురను కూడ జేర్చి, వారితో ఆట పాటలందు కుతూహలము కలుగునట్లు ప్రయత్నించెదము''

బాలునిలో మార్పు రాగలదేమోనను ఆశతో రాజు, ప్రహ్లాదుని గురువులతో వారి యింటికి పంపెను

83 ప్రహ్లాదుడు నారాయణు నెఱిగిన తీరు

చండామార్కులు ప్రహ్లాదునకు, యీ లోకములో మనస్సును ప్రలోభపరచి, ఆకర్షించు విషయముల గూర్చి బోధించిరి. వారు ధర్మార్థ కామముల గూర్చి బోధింపగా, ప్రహ్లాదుని మనస్సు మోక్షముపై నుండెను. ప్రహ్లాదుని శరీరము మాత్రమే గురువుల యింట నుండెను. అతని మనస్సు యెక్కడో దూరముగా నుండెను.

ఒకసారి గురువులు ప్రహ్లాదుని ఒంటరిగా గృహమున విడచి బయటకు వెడలిరి ఇతర బాలురు ఆడుకొనుచుండిరి. తండ్రిచేత విపరీత బాధలకు గురియగుచున్న ప్రహ్లాదుని యందు ఆ బాలురకు అమితమైన అభిమానము గురువులు కూడ ప్రహ్లాదునికి అనేక యిబ్బందులు కల్గించుటచేత, ఆ బాలురకు ప్రహ్లాదునిపై ప్రేమ మరింతగా పెరిగెను ప్రహ్లాదుడు తోటి బాలురతో మాట్లాడుచుండెను. ద్వేషము దానివలన ఉత్పన్నమయే గుణములచేత వయసు పెరిగిన కొద్ది మనస్సు కలుషితమగును అట్లు కలుషితము కాని మనస్సులతో ఆ లేత బాలురు ప్రహ్లాదుని మాటలకు ఆకర్షితులైరి. ఆ బాలురతో ప్రహ్లాదుడిట్లనెను ''మీరందరు నేను చెప్పునది వినండి మనకు యీ శరీరము, అద్భుతమైన మనస్సును ప్రసాదితమైనవి వానిని నిరర్థకము

గావించుట నేరము ఒక ప్రయోజనము కొరకు అవి మనకు లభించినవి మనస్సు భగవంతుని యందు లగ్నము చేయవలెను ఈ శరీరమును భగవంతుని పూజించుటకు వినియోగించవలెను. వంశ పారంపర్యముగా వచ్చుచున్న అసుర గుణములను విడిచిపెట్టి, సద్గుణములను, అనగా ప్రతి ఒక్కరినీ ప్రేమించి ద్వేషింపకుం డుట, అన్ని జీవులయందు కరుణ కలిగియుండుట, అలవరచుకొనవలెను. అప్పుడు భగవంతుడు సులభముగా ప్రసన్నుడగును అతి తేలికగా భగవంతుని మీరు చేరవచ్చును. అతనినే తలవండి అతని కీర్తనలను గానము చేయండి మనము సులభముగా భగవంతుని చేరుకొనగలము''.

''నీకెట్లు తెలియును?'' అని ఆ బాలురడిగిరి. ''ఇది సత్యమని నీవుదృఢముగా చెప్పుచున్నావు ఇవి నీకెట్లు తెలియునో మాకు వివరించి చెప్పుము''

''నారాయణుని భక్తుడైన నారద మహర్షి నాకు బోధించెను'' అని ప్రహ్లాదుడనెను

ఆ బాలురకు అయోమయముగా నుండెను వారిట్లనిరి ''పుట్టినది మొదలు మన మందరము కలిసి తిరుగుచున్నాము ఈ గురువులను తప్ప యితర గురువుల నెరుగము నీవు నారదుని యెప్పుడు కలుసుకొని యిన్ని విషయములు నేర్చితివి?''

ప్రహ్లాదుడు నవ్వుచు యిట్లనెను ''చాల కాలము క్రిందట నా తండ్రి మందర పర్వతమున తపస్సు చేయుట కేగినపుడు, ఆ పర్వతమందు నా తండ్రి మరణించునని భావించి, దేవతలు దండెత్తి వచ్చి అసురులతో యీ రాజ్యమందు యుద్ధము చేసిరి వారి ధాటికి తట్టుకొనలేక అసురులు చెల్లాచెదురుగా పారిపోయిరి. దేవతలు నా తండ్రి నివసించు భవనము ప్రవేశించి దానిని కొల్లగొట్టిరి ఇంద్రుడు నా తల్లిని పట్టుకునెను ఆమె యేడ్చుచు బ్రతిమాలుకొనగా, ఇంద్రుడు ఆమె మాటలను లక్ష్యపెట్టకుండెను. ఇంతలో అనుకొనకుండ నారదుడక్కడకు వచ్చి ఇంద్రుని చూచి యిట్లనెను. ''ఇంద్రా! ఈమెను చెరబెట్టుట నీవంటి వానికి తగనిది ఇదియా దేవతలు పాటించు ధర్మము? సిగ్గు సిగ్గు ఆమెను తక్షణమే వదిలిపెట్టుము''

ఇంద్రుడిట్లనెను ''నారద మునీంద్రా! నీకు యిది అర్థము కాదు. చెడు తలంపుతో నేనామెను చెరబట్టలేదు ఆమె గర్భములో ఒక అసురుడు పెరుగుచున్నాడు ఆ శిశువు యిప్పుడే అగ్నివలె ప్రకాశించుచున్నాడు ఆ శిశువు జన్మించు వరకు ఆమెను నా వద్ద ఉంచెదను. శిశువు జన్మించిన తర్వాత, ఆ అసురుడు దేవతలను వేధించునుగాన అతడిని సంహరించి, ఆమెను వదలిపెట్టుదును''. అది విని నారదుడిట్లనెను ''నీవు పొరబడుచున్నావు పుట్టబోవు శిశువు మిమ్ములను వేధించదు. దేవతల కష్టములకు ఆ శిశువు కారణము కాబోడు పైగా ఆ శిశువు నారాయణుని భక్తుడై, తన తండ్రి అకృత్యముల నుంచి దేవతలకు విముక్తి కలిగించి ఆనందము చేకూర్చును''

''ఇంద్రుడు నారద మహర్షి మాటలను విశ్వసించెను నా తల్లిని వదలిపెట్టి ఇంద్రుడు వెళ్ళిపోయెను నా తల్లిని నారదుడు తన ఆశ్రమమునకు తీసుకు వెళ్ళెను ఆమెను సముదాయించి యిట్లనెను ''నీ శిశువు జన్మించు వరకు నా ఆశ్రమములో ఉండవచ్చును. నీ భర్త తపస్సు పూర్తిచేసి అప్పటికి తిరిగి వచ్చును నీవు యిక్కడ సుఖముగా నుండగలవు''. నా తల్లి నారదుని ఆశ్రమములో ఉండి అతడికి సేవ చేయుచుండెను. నన్ను మనస్సులో పెట్టుకుని, నారదుడు ప్రతి దినము నా తల్లికి, సులభముగా భగవంతుని చేరు భక్తియోగమును బోధించుచుండెను ఆమెతో జ్ఞానావధులు, నిత్య సత్యము, యీ శరీరములో నున్న ఆత్మ పరమాత్మ లేక

పరబ్రహ్మ స్వరూపము అను విషయములు ముచ్చటించు చుండెను. ఆమె వాటి నన్నిటినీ వినెను. కాని ఆమె మనస్సులో అవి యెక్కువ కాలము నిలువ లేదు కాని, నేను వాటిని విని, మరచిపోలేదు''

ప్రహ్లా విన్న విషయములను విపులముగా వివరించెను. ఆ బాలురకు సహజముగా భక్తి మార్గము నచ్చెను. ఇంతలో తిరిగి యింటికి వచ్చిన గురువులు ఆ బాలురు ప్రహ్లాదునితోబాటు సామూహికముగా నారాయణుని కీర్తించుచూ గానము చేయుట చూచిరి. గురువులు, ఆ బాలురు చేయుచున్న దానిని ఆపివేసి, మామూలుగా పాఠములు బోధించుట ప్రారంభించిరి కాని వారు చెప్పునది ఆ బాలుర చెవికెక్కుట లేదని వారు గ్రహించి విస్మయము చెందిరి ప్రహ్లాదుడు ఆ బాలుర నందరనూ తన ధోరణి కనుగుణముగా మార్చివేసెను.

ఏమి చేయుటకు పాలుపోక, గురువులు హిరణ్యకశిపుని వద్దకు వెళ్ళి, తమ యింటి వద్ద జరిగినదంతయూ చెప్పిరి. రాజు క్రోధోద్దీప్తుడయ్యెను పరిస్థితులు మితిమీరినవని నిశ్చయించుకొనెను తన చిన్న కుమారుడు చేయుచున్న దానిని యిక యే మాత్రమూ క్షమించరాదని తలచెను మొట్టమొదట యేదో అర్థము కాని మాటలు ఆడుచున్నాడని తలపోసెను. కాని యిటీవల, పూర్తిగా తెలిసియుండి ఎడ నియు, తన ఆలోచనా పద్ధతిని జీవిత విధానమును విమర్శించే ధైర్యము ప్రదర్శించుచున్నాడని గ్రహించెను వాటిని విడిచిపెట్టమని ప్రహ్లాదుడు తండ్రిని కోరెను ప్రహ్లాదుని చంపించుటకు తన అనుచరులను నియోగిం పగా, వారా కార్యమును సక్రమముగా నిర్వర్తించలేకపోయిరి. విచిత్రములు జరిగి ఆ బాలుడు సురక్షితుడుగా నుండెనను వార్తలు రాజునకు చేరెను. వధ్యుడు పసి బాలుడగుటచేత, వారు దయితలచి, చంపుటకు మనసొప్పక యూరకుండిరని రాజు భావించెను.

హిరణ్యకశిపుడు, పుత్రుడైన ప్రహ్లాదుని తన చేతులతోనే చంపుటకు నిశ్చయించుకొనెను పుత్రునిపై అతనికున్న ప్రేమ చాల కాలము క్రిందటనే హరించిపోయెను ప్రహ్లాదుడు నారాయణ భక్తుడగుటచేత అతనిపై ప్రేమ అంతరించి ద్వేషము ప్రబలెను కుమారుని చంపుటకు దృఢ నిశ్చయుడై, గిట్టిగా యిట్లరచెను ''ఈ క్షణమే నా కుమారుని యిక్కడకు తీసుకుని రండు. వాని మొండితనమును నేను అణచెదను''

84 అంతిమ ఘట్టము

హిరణ్యకశిపుడు పిలువనంపగా ప్రహ్లాదుడు వచ్చి తండ్రికి ప్రణమిల్లి పాదధూళి శిరస్సుపై నుంచుకొని, చేతులు జోడించి తండ్రి కెదురుగా నిలుచుండెను. హిరణ్యకశిపుడు కఠినముగా పుత్రునితో నిట్లనెను. ''నీవు మూర్ఖుడవు, పరమ మూర్ఖుడవు. నా వంటి గొప్ప మహారాజునకు పుత్రుడవైన నీవు, నాతో తలపడి పోరుటకు ధైర్యము లేని ఆ భగవంతుని మహా గొప్పగా పొగడుచున్నావు. ఇంత కాలము నిన్ను, నీ మొండితనమును సహించినాను. కాని నీవు ఒక చీడ పురుగువలె తయారైనావు. నీవు యీ కుటుంబమును సర్వనాశనము చేయగలవు. నన్ను, నా మాటలను నీవు గౌరవించుటలేదు. నా సహనము హద్దు మీరినది ఇప్పుడే నిన్ను యముని వద్దకు పంపెదను. సిద్ధముగా నుండుము''.

ఆ మాటలు తన మర్దించి కావళ్ళుగా, ప్రశాంతముగా యెట్టి కలవరము లేక ప్రహ్లాదుడు నిలిచి యుండెను.

ఎట్టి విచారమును లేక శాంతము నిండిన ప్రహ్లాదుని ముఖమును గాంచిన హిరణ్యకశిపునకు అగ్నిలో ఆజ్యము పోసినట్లుండెను అతని భయంకర దృక్కులను వినయముగా నిలిచియున్న ప్రహ్లాదునిపై ప్రసరింపజేసి యిట్లనెను ''నీ వంగనాచి వేషములు, దొంగ వినయములు కట్టిపెట్టు నా ప్రబల శత్రువైన నారాయణుని ఆరాధించి పొగడుచు నన్ను వేధించుచున్నావు నేను వద్దని చెప్పుచున్నను నీవు యిట్లు చేయుట కెంత ధైర్యము? నా రాజ్యములో ఆ నారాయణుని పేరు ఉచ్చరించుటకు నీ కెంత ధైర్యము? నిన్ను చంపుటకు నిశ్చయించినాను''

ప్రహ్లాదుని నేత్రములు తండ్రి నేత్రములను కలిసినవి. ప్రహ్లాదుని కనులలో శాంతము ఉట్టిపడగా, హిరణ్యకశిపుని కనులు యెర్రనై మండుచున్నవి. ప్రహ్లాదుని కనులలో జాలి, విచారము గూడు కట్టుకొనగా, యిట్లనెను ''తండ్రీ! నేను దుష్టుడనని మీ భావము కాని, నిజముగా నేను దుష్టుడను కాను మీకు సహాయము చేయవలెనని మాత్రమే నా కోరిక ఇప్పటికైనను మించిపోయినది లేదు నా మాట వినినచో మీరు రక్ష పడయగలరు నారాయణుడు అత్యుత్తమ దైవము, మహా శక్తిమంతుడు దేవతలందరికన్న గొప్పవాడు, సృష్టికర్త యగు బ్రహ్మ కన్న గొప్పవాడు, అన్ని శక్తుల కంటె శక్తిమంతుడు. ఇంద్రియములకు, మనస్సుకు, బుద్ధికి చైతన్యమును కలిగించి ప్రకాశింపజేయు వా డతడే. ఈ ప్రపంచమునకు అతడే సృష్టికర్త, అతడే పోషణకర్త, అతడే లయకర్త. నీకన్న అతడు గొప్ప శక్తిమంతుడని అంగీకరించుము నారాయణుడు నీకు శత్రువు కాదు నీ మనస్సే నీకు శత్రువు అది తప్పు మార్గముల వెంట తీసుకొని వెళ్ళును. నీకు శత్రువైన మనస్సును నిగ్రహించి అదుపులో నుంచవలసి యున్నది, నారాయణుని కాదు

''అదుపు తప్పి నిగ్రహము లేని మనస్సును మించిన శత్రువు మరొకటి లేదు దయచేసి మనసు నదుపులో నుంచుకొనుడు. సమబుద్ధిని మనసులో పెంచుకొనుడు మీ మనస్సు నుండి రాగద్వేషములను దుష్టగుణము లను తొలగింపుడు అదియే భగవంతునికి అత్యంత ప్రీతికరమైనది మీరు పది దిక్కులను జయించితి మనుచున్నారు. ఎంత అసత్యము! మీలో యిమిడియున్న ఆర్గురు భయంకర శత్రువులు - కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు జయింపలేకుంటిరి ఈ ఆరుగురు శత్రువులను జయించిన వానికి, మనస్సును అదుపులో నుంచిన వానికి, ఇంద్రియములను నిగ్రహించిన వానికి, అందరిలోను ఉన్న ఆత్మ ఒకటేయని తెలునుకున్న వానికి, శత్రువు ఉండగలడా? తండ్రీ! మీకు మీరే శత్రువు. మిమ్ము మీరు జయించవలెను''.

హిరణ్యకశిపుడు మండిపడెను. క్రోధముతో నిండిన కనులను కుమారునివైపు త్రిప్పి యిట్లనెను ''నీ తండ్రికి నీవు ధర్మబోధ చేయునంతటి వాడవైనావు నిజముగా నీ తండ్రిని గురువుగా యెంచి, దేవునివలె గౌరవించవలసినది సరే, ఆ విషయము వదలిపెట్టు, నా కంటె గొప్ప వాడైన 'భగవంతుడు' ఉన్నాడనుచు న్నావు. అతడెవరో, యెక్కడనున్నాడో నాకు చెప్పుము''

''అతడు నారాయణుడు. తండ్రీ! అతడు సర్వత్ర ఉన్నాడు''. అని ప్రహ్లాదుడు జవాబిచ్చి నిర్భయముగా నుండెను. అతని స్వరములోగాని ప్రవర్తనలోగాని భయము లేకుండెను. ప్రశాంత దృక్కులతో నిండిన మోముతో ఆ బాలుడు నిలిచి యుండెను. హిరణ్యకశిపుడు, తన పుత్రుడు మాట్లాడునపుడు యెట్టి గౌరవమును ప్రదర్శించెనో కనిపెట్టెను. ప్రహ్లాదుని మాటలు తండ్రి చెవుల కింపుగా లేకుండుటచే, సంతోషపెట్టుటకు బదులు కోపమును ద్విగుణీకృతము చేసెను ''సర్వత్రా?'' హిరణ్యకశిపుడడిగెను అతని యెర్రని కనులు ఆ సభా ప్రాంగణములోని ఒక స్తంభముపై నిలిచెను ప్రహ్లాదుని వైపు అసహ్యముగా చూసి ''ఈ స్తంభమందు

ఉన్నాడా?'' అనెను.

ఆ స్తంభమునకు ప్రహ్లాదుడు ప్రణమిల్లి యిట్లనెను. ''అవును ఉన్నాడు ఈ స్తంభము లోపల నేను చూడగలుగుచున్నాను''

హిరణ్యకశిపుడు స్తంభము చుట్టు ఒకసారి, క్రిందకు పైకి ఒకసారి చూచి యేమియు గాంచక, అతడిట్లనెను. ఇప్పుడు నిన్ను చంపబోవుచున్నాను. నీవు చెప్పే ఆ నారాయణుడు యీ స్తంభము నుండి వచ్చి, నా చేతుల నుండి నిన్ను రక్షించునేమో చూచెదను''. హిరణ్యకశిపుడు పెద్దగా అరచి, చేతిలో కత్తి తీసుకొని సింహాసనము నుండి క్రిందకు ఉరికెను. బలమైన తన మోచేతితో ఆ స్తంభమును గుద్దెను.

85 నృసింహావతారము

ఇంతలో భయంకరమైన శబ్దము వినిపించెను. పిడుగు పడిన శబ్దము వలె నుండెను. ఆ శబ్దమునకు యీ లోకమంతయు కంపించెను. కాని హిరణ్యకశిపుడు భయపడలేదు అదే పనిగా ఆ స్తంభము వైపు చూచుచుండెను. అతడట్లు చూచుచుండగనే ఆ స్తంభము రెండుగా చీలి అందు నుండి భగవంతుడావిర్భవించెను.

భగవంతుడు అతి భయంకరమైన రూపమును ధరించెను. కరిగించిన బంగారము వలె మెరయుచు అతడచట నిలుచుండెను బంగారు మచ్చలుగల కనులతో హిణ్యకశిపునివైపు చూచెను సింహము ముఖమందు కళ్ళువలె అవి ప్రకాశించుచుండెను. గుహ వలె నున్న నోటిలో రక్త వర్ణములో నున్న పెద్ద నాలుకను ఆడించుచుండెను ఆ నాలుక రక్తములో ముంచిన కత్తివలె నుండెను. ఆ సింహము యొక్క వజ్రాలులతో నుండెను. విశాలమైన వక్షముతో సింహము వలె సన్నని నడుము కలిగి యుండెను నడుము క్రింది భాగము మానవ రూపములో నున్నది. చూచిన ప్రతి ఒక్కరు భయముతో వణికిపోయిరి కాని హిరణ్యకశిపుడు బెదరక యుండెను అదే పనిగ ఆ వింత ఆకారమును చూచుచు తనలో తానిట్లనుకొనెను. ''ఏమిది చాలా వింతగా కనబడుచున్నది! ఇది మానవుడు కాదు, జంతువు కాదు''

అకస్మాత్తుగా అతని మనస్సు గతములోనికి వెళ్ళెను మందర పర్వత సానువులపై బ్రహ్మ యెదురుగా నిలచి, బ్రహ్మను అడిగిన వరమును జ్ఞప్తికి తెచ్చుకొనెను మరణము లేకుండునట్లు వరమడుగగా, అది తనకు సాధ్యము కాదని బ్రహ్మ చెప్పెను అప్పుడు బ్రహ్మ నిట్లడిగెను ''నీవు సృష్టించిన దేదియు నా మరణమునకు కారణము కారాదు. నీవు సృష్టించిన వస్తువు లేవియు నన్ను చంపకూడదు '' హిరణ్యకశిపుడు వర్తమానములోనికి వచ్చెను వింతగా నిలచియున్న ఆకారము బ్రహ్మ సృష్టించినది కాదు ఇది అతని మరణమునకు కారణమగునా?

ఈ ఆలోచనను విదిలించుకొని, చేత ఆయుధము ధరించి భగవంతుని వేగముగా సమీపించెను ఒక క్షణకాలము నృసింహుని నుండి వెలువడుచున్న బ్రహ్మాండమైన వెలుగులో హిరణ్యకశిపుడు కన్పించకుండెను హిరణ్యకశిపుడు తన గదతో భగవంతుని కొట్టెను సర్పమును గరుడుడు పట్టుకున్నట్లు, హిరణ్యకశిపుని తన చేతులతో యెత్తెను. అతని పట్టునుండి తప్పించుకుని తిరిగి తన గదతో హిరణ్యకశిపుడు నృసింహుని

కొట్టెను భగవ ... బాహువులతో హిరణ్యకశిపుని యాడ్చుకొని వెళ్ళి ద్వార బంధము వద్ద ఆగెను నృసింహుడు ద్వార బంధముపై కూర్చుని తన ఒడిలో అసుర రాజు నుంచెను

హిరణ్యకశిపుడు నిస్సహాయముగా చుట్టూ పరికించి చూచెను ఆకాశము నల్లబడుచున్నది. అది పగలూ కాదు, రాత్రియూ కాదు తనలో తాను నవ్వుకొని యిక తన జీవితము సమాప్తి కానున్నదని తలచెను అది పగలూ రాత్రియు కాని సమయము, ద్వార బంధము నందుండుటచేత యింటి వెలుపలనూ కాదు, యింటి లోపలనూ కాదు ఒక మృగము బాహువులలో చిక్కుకొనెను; దానిని మృగమనుటకు వీలుకాదు, మానవుడనుటకు వీలుకాదు భగవంతుడు తన ఒడిలో పెట్టుకొనెను అతడడిగిన వరములలో ఒకటి · తాను భూమిపైన గాని, ఆకాశమున గాని మరణించ కూడదు. ఒక విచిత్రమైన స్పష్టతతో తన మాటలు తిరిగి మంచు బిందువులో పచ్చటి బయలు ప్రతిబింబించినట్లు, తన స్ఫురణకు వచ్చుచున్నవి అయినప్పటికీ అతడు భయపడలేదు అతడు పోరాడుటకు ప్రయత్నించెను కాని నృసింహుని ... వెను తన చూపులను కుమారునిపై ప్రసరింపజేసెను ఆ చూపులు 'బహుశః నీవు చెప్పినదే సరియైనది' అన్నట్లుండెను అతని కంటె బలవంతుడు, శక్తిమంతుడు మరొకడు కలడని మొదటిసారిగా అతనికి స్ఫురించెను

తన ఒడిలో నున్న హిరణ్యకశిపుని నృసింహుడు తన గోళ్ళతోను పళ్ళతోను చీల్చి, శరీరములోని భాగములను బయటకు లాగెను. ఆ దృశ్యము చాల భయంకరముగా నుండెను. హిరణ్యకశిపుని శరీరములోని ప్రేవులను బయటకు లాగి వాటిని మెడలో హారముగా ధరించిన నృసింహుడు భయంకరమైన ఉగ్రరూపము దాల్చెను

నృసింహుని క్రోధమునకు యీ లోకము మిక్కిలి భయకంపితమయ్యెను. సముద్రము అల్లకల్లోలమయ్యెను భయముతో భూమి కంపించెను నృసింహుడు వెలుగులన్నిటినీ తనలో లీనము గావించుకొనుటచేత ఆకాశము, స్వర్గము శోభను గోల్పోయెను మేఘములు అటు యిటు చెదరిపోగా, గ్రహములు గ్రహణము పట్టినట్లుండెను. ఊర్ధ్వ లోకములో ఉత్పాతము సంభవించునట్లుగా సముద్రము అల్లకల్లోలముగా నుండెను దిక్కులను రక్షించుచున్న ఏనుగులు, నృసింహుని అరుపునకు భయపడెను. అతని మహత్తర శక్తికి తాళలేక భూమి బ్రద్దలగునా యన్నట్లుండెను.

చనిపోయిన హిరణ్యకశిపుని లాగుకొనుచూ వెళ్ళి, నృసింహుడు సింహాసనముపై కూర్చుండెను అతని దగ్గరకు వెళ్ళుటకు యెవరికీ ధైర్యము లేకుండెను. అతని ఉగ్ర రూపమునకు భయపడి యెవరికీ - దేవతలుగాని, బ్రహ్మగాని, లక్ష్మిదేవిగాని పలకరించుటకు ధైర్యము లేకపోయెను

దూరముగా నిలబడి బ్రహ్మ నృసింహుని స్తుతించెను. దేవతలు, బ్రహ్మ, మహాదేవుడు యిట్లనిరి ''భగవంతుని లీలలు అతి చిత్రములు. ప్రతి సంఘటనకు కారకుడవు నీవు. తొలుత సనకాదులకు ఆగ్రహమును కల్పించినది నీవు. నీ భక్తులైన జయ విజయులు యీ పాప లోకములో జన్మించుటకు కారణము నీవు. నేమ భ్రాంతిలో హిరణ్యకశిపుడడిగిన వరములన్నీ యొసగునట్లు చేసినది నీవు ఈ అసురుని గృహమందు నీ భక్తులలో ఉత్తమోత్తముడు జన్మించెను అదియూ నీ సంకల్ప ప్రకారమే జరిగెను. తండ్రి కొడుకును చంపు ప్రయత్నములు చేయగా, నీ భక్తుని రక్షించుటకు నీవు యీ కార్యమును చేబట్టి యీ దుర్మార్గుని నాశనము చేసితివి. నీ చర్యల వెనుక నున్న ప్రయోజనమును యెవరు ఊహించగలరు? సవినయముగా మేము

నీకు నమస్కరించుచున్నాము''

నృసింహుడు క్రోధము మూర్తీభవించినట్లుండెను. దేవతలు, బ్రహ్మ నారాయణుని కడకు వెళ్ళి, హిరణ్యకశిపుని దుర్మార్గము నణచి యీ లోకమును రక్షింపుమని వేడినపుడు, నారాయణుడిట్లనెను ''అతని కుమారుడు, నాకు భక్తుడు అయిన ప్రహ్లాదుని బాధించునపుడు, ఆ బాలుడు శత్రుత్వము, క్రూరత్వము వలన కలుషితము కాక, యెప్పుడూ సమబుద్ధితో, ప్రశాంతతతో బాధలనన్నిటినీ నా యందు గల భక్తిచేత సహించును. అప్పుడు నేను అవతరించి, యీ హిరణ్యకశిపుని, నీవు వరములను ప్రసాదించినప్పటికీ నాశనము చేయుదును''.

ఒక సామాన్య మానవుడు తనకు పరమ భక్తుడైన వానిని బాధించుట చేత ఆగ్రహావిష్టుడై భగవంతుడు నృసింహ రూపము దాల్చెను. హిరణ్యకశిపుని చంపిన చాలసేపటి వరకు నృసింహుని కోపము తగ్గకుండెను. అతని భీకర రూపమునకు వెఱచి, బ్రహ్మాది దేవతలు నృసింహుని సమీపమునకు వెళ్ళలేకుండిరి. దూరము నుండి భగవంతుని స్తుతించుచుండిరి.

వారు లక్ష్మీదేవిని సమీపించి యిట్లనిరి ''అమ్మా! నీ భర్త కోపమును నీవు మాత్రమే శమింపజేయగలవు భూమ్యాకాశములు అతని క్రోధమునకు దద్దరిల్లుచున్నవి అతని జూలు అటునిటు ఆడగా మేఘములు చెల్లా చెదరగుచున్నవి అతని అత్యంత ప్రకాశ వైభవముచేత గ్రహములు గ్రహణము పట్టినట్లు తమ శోభను కోల్పోయినవి. అతని ఉచ్ఛ్వాస నిశ్శ్వాసముల వలన సముద్రములు అల్లకల్లోలమైనవి. అష్టదిక్కులందు ఉన్నటువంటి యేనుగులు, తమను మెరుపులు పిడుగులు తాకినట్లు భయముతో వణకుచున్నవి. అందుమూలముగా భూమి కంపించుచున్నది. భగవంతుని వేడి శ్వాసను భరించలేక స్వర్గములు దూరముగా పోవుచున్నవి. భూమి కంపించుటచేత పర్వతములు కదలు ప్రమాదమును సూచించుచున్నవి భగవంతుడు శమింపకుండెనో, యీలోకము, స్వర్గము అంతమొందగలవు''.

లక్ష్మీదేవి ఒకసరి తన భర్త ముఖమును చూచెను. ఆమె ముఖము భయముతో వివర్ణము కాగా యిట్లనెను. ''ఇప్పుడతడు ఉన్న స్థితిలో సమీపించుటకు నాకు ధైర్యము చాలదు. ఇది వరకెన్నడు నేనిట్లు చూడలేదు. నాకు చాల భయముగా నున్నది''

86 ప్రహ్లాదుడు నృసింహుని స్తుతించుట

హిరణ్యకశిపుని సింహాసనముపై ఆసీనుడైన నృసింహునికి దూరము నుండి వచ్చుచున్న పొగడ్తలు వినిపించుచుండెను. బ్రహ్మ ప్రహ్లాదుని సమీపించి యిట్లనెను. ''కుమారా! నారాయణ భక్తుడనైన నీపై గల ప్రేమతో భగవంతుడు యీ నృసింహ రూపము దాల్చి నీ తండ్రిని వధించెను. నీవు యిపుడు నృసింహుని శాంతింప జేయవలెను. ఆగ్రహావిష్టుడైన నృసింహుని సమీపమునకు మేమెవరమూ వెళ్ళలేము. నీవు మాత్రమే అతని ఆగ్రహము నుండి యీ లోకమును రక్షింపగలవు''.

ఒక్కమాట అయినను పలుకక, తన ప్రేమైక స్వరూపుని గాంచిన ఆనందమున్తో కనుల నుంచి అశ్రువులు కారుచుండగా, ప్రహ్లాదుడు నృసింహుని పాదములకు ప్రణమిల్లి, తన ఆనందాశ్రువులతో అతని పాదములు కడిగెను. ప్రహ్లాదుని జూచి, నృసింహుడు దయాపూరితమైన తన దృక్కులను ఆ అమాయక బాలునిపై నిలిపెను.

బాలుని లేవనెత్తి తన చేతిని అతని శిరస్సుపై నుంచెను. భగవంతుని హస్త స్పర్శతో ప్రహ్లాదునికి శరీరమంతయు గగుర్పొడిచిన ట్లయ్యెను అతని పాపములన్నియు నశించిపోయి, ఆ క్షణమందు బ్రహ్మమును గురించిన సత్యము గోచరించెను తమ్మి మొగ్గవలె ప్రహ్లాదుని చేతులు జోడించి యుండగా, అతని కనుల నుండి అశ్రువులు అవిరామముగా వచ్చుచుండెను వృక్షమువలె స్థిరముగా నిలిచి గద్గదస్వరముతో వణకుచు భగవంతుని వైభవము కీర్తించుట మొదలిడెను. ''ప్రభూ! బ్రహ్మాది దేవతలకు అందుబాటులో లేవు, సంవత్సరముల తరబడి ధ్యానము చేయు ఋషులకు మీ దర్శనము లభించుటలేదు; సత్పురుషులకు, జ్ఞానులకు కూడ మీ దర్శనము దుర్లభమగుచున్నది వీరందరికీ లభించని మీ దర్శనము, అధమమైన రాక్షసజాతిలో జన్మించిన నాకు కల్గుట యెంతటి భాగ్యమో? మీకు నాయందున్న అనంతమైన ప్రేమచేత నాకు ప్రత్యక్షమైతివి. నేను చాల అదృష్టవంతుడను పన్నెండు గుణములు మీకు ప్రీతికరమైనవని కోవిదులందురు ఉత్తమ కుటుంబములో జన్మించుట, సంపద, రూపసౌందర్యము, తపస్సు, పాండిత్యము, నేర్పరితనము, వైభవము, కీర్తి, బలము, ధైర్యము, ప్రయత్నము, బుద్ధి వీటన్నింటి కన్న గొప్పదైన అష్టాంగయోగము సూటిగా మీ దగ్గరకు చేర్చునని చెప్పెదురు కాని, నాకు, యీ ప్రపంచమునకు భక్తి, అనగా మీపై ప్రేమ యుండిన చాలునని నిరూపించినావు. ఇతరమైనవన్నియు మిమ్ము చేరుటకు ప్రతిబంధకములని కూడ స్పష్టపరచినావు అష్టాంగయోగము భక్తి కంటెను అల్పమైనదని నా నమ్మకము లేకున్న, కేవలము ఒక గజము మీ దయ నెట్లు పొందగలిగెను?

''భగవంతుడు భక్తివలన సంతోషించునని యెరుగుదును అందమైన శరీరము, సౌందర్యవతియైన భార్య, మేరు పర్వతమంత సంపద, మాట చమత్కారము — భక్తిలేకున్న వీని వలన యేమి ప్రయోజనము? భక్తి తప్ప యింకేదియు మీకు సంతోషము నివ్వలేదు''

''ప్రభూ! ఇక్కడచేరిన బ్రహ్మాది దేవతలందరూ పరమభక్తులు వారు మీకు ప్రియులు. అసురులమైన మేము నిన్ను పూజించుచున్నప్పటికీ, దేవతల భక్తి యింతకన్న యెన్నోరెట్లు గొప్పది అట్టివారు కూడ మిమ్ము చూచి భయపడుచున్నారు ఈ నృసింహావతారములో యీ లోకము నాశీర్వదింపవలసి యున్నది. ఈ లోకమందు వైభవమును యినుమడింపజేసి, ప్రతి ఒక్కరూ సుఖముగా నుండుటకొరకే మీరు యీ లోకములో అవతరించినారు. స్వామీ! ఈ ఆగ్రహమును విడిచిపెట్టుడు. మీకు క్రోధము తెప్పించిన అసురుడు మరణించినాడు. ఇతరుల శ్రేయస్సు కొరకై ప్రసన్నులు కావలెనని కోరుచున్నాను నేను మిమ్ము జూచిగాని, మీ క్రోధమును జూచిగాని, మీ రూపమును జూచిగాని భయపడుటలేదు కాని సంసారమనే సముద్రము నాకు భయమును కలిగించుచున్నది. మీ తోనే ఉండగోరు వారికి సంసారము భయంకరమైనది, భరింపరానిది నా తండ్రి సేవకులు నా చేతులు కట్టి ప్రవహించు నీటిలో నన్ను పారవేసినట్లు, స్వయంకృతమైన కర్మలచేత కట్టుబడి నేను యీ సంసార సముద్రములో పడబోవుచున్నాను. మీ దర్శనమైన వెంటనే కర్మబంధములన్నియు దగ్ధమై, త్వరలోనే మిమ్ము చేరుకొనవలెనని ప్రార్థించుచున్నాను''.

నృసింహుడు కోపము విడనాడి, బాలుని తన ఒడిలో కూర్చుండబెట్టుకొని యిట్లనెను ''కుమారా! నీపై నాకు మక్కువ యెక్కువ అసురులలో నీవు గొప్పవాడవు, ఉత్తముడవు నీవు కోరు వరములను ప్రసాదించదల చుకున్నాను నన్నడుగుము. మానవుల కోర్కెలన్నిటిని తీర్చుటకు నేనున్నాను నీకు యేది ముఖ్యమో దాని నడుగుము. నేను తీర్చెదను''.

ప్రహ్లాదుడు ప్రాపంచిక వస్తువుల యెడ లాలసుడగుటకు వరముల నొసగెదనని భగవంతుడు చెప్పెను. కాని ప్రహ్లాదుడు భగవంతుడిచ్చు వరములపై సుముఖత కనపరచలేదు ముఖముపై హాసము చిందగా మధురవచనములతో ఆ బాలుడిట్లనెను ''ప్రభూ! నన్ను మైమరపించి మోసపుచ్చవద్దు నేను కోరునది మీతో ఉండుట. నేను అసురుడను ఇంద్రియానుభవముల నాశించుట అసుర స్వభావము దీనిని గుర్తించి, అట్టి ప్రాపంచిక సౌఖ్యములను యెరగా చూపి యీ సంసార సముద్రములో నాకు నేనుగా పడునట్లు చేయుచున్నారు ప్రభూ! నాకు వద్దు. నేను మీ దర్శనము పొందినాను. నేను యెప్పుడూ మిమ్ములను ప్రేమించుచున్నానని యెరుగుదురు ఈ ఇంద్రియముల సమూహమూ, అవి అపేక్షించు భోగములు నాకు ప్రియము కావు. బహుశః నా భక్తిని పరీక్షించుటకే యీ ప్రలోభములను కల్పించుచున్నారను కొనుచున్నాను. భక్తికి ప్రతిఫలముగా వరమును కోరువారు భక్తులు కాజాలరు, వర్తకులగుదురు ఎట్టి కోరికలు లేని భక్తుడను భక్తుల నుండి భక్తిని తప్ప యింకేదియు ఆశింపని మీరు నాకు ప్రభువు అట్టి సందర్భములో కోరికలు కోరుటకు వానిని ప్రసాదించుటకు ఆస్కారమెక్కడ?

''అయినప్పటికీ మీ ఆజ్ఞ నుల్లంఘించి అవమానపరచుట నాకిష్టము కాదు. నాకొకవరము ప్రసాదించవలెను మీరూపము నా హృదయములో యెల్లప్పుడూ స్థిరముగా నుండవలెను. మీ రూపమున్నచోట ప్రాపంచికమైన కోరికలకు తావుండదు. నాయీ హృదయములో మీయందు ప్రేమ స్థిరముగా నున్నచో, ఇంద్రియములు, మనస్సు, శ్వాస, శరీరము, ధర్మము, ధైర్యము, బుద్ధి, లజ్జ, సంపద, కీర్తి, సత్యము కూడ ఆ ప్రదేశము వదలి భక్తినే దగ్ధము కాగలవు. భక్తిసుస్థిరముగా నున్నచో వీడును అహంకారము వీడినంతనే దానితో చేరియున్న ఇతర గుణము లన్నియూ అదృశ్యమగును హృదయమందు కోరికలను విడనాడినవారు భగవంతునివలె సంపన్నులగుదురు.

''సనాతన పురుషుడు, పరబ్రహ్మ ృసింహుడు అయిన నీకు నా నమస్కారము''.

నృసింహుడు పూర్తిగా శాంతించిన పిదప, యింతవరకు దూరముగా నున్న అందరూ చేరువకు వచ్చి అతనిని కీర్తించిరి లక్ష్మీదేవి వచ్చి నృసింహుని ప్రక్కనే కూర్చున్న పిదప అతడు లక్ష్మీ- నృసింహుడయ్యెను. అతడిట్లనెను. ''కుమారా! ఈ కల్పాంతము వరకు నీవు జీవించెదవు భోగభాగ్యములందు తగుల్కొనక, నీవు సర్వసౌఖ్యములు యీ లోకములో పొందెదవు. చివరకు యీ కర్మబంధము నుండి విముక్తి పొంది నీవు నన్ను చేరెదవు''. ప్రహ్లాదుడు వినయముతో శిరస్సు వంచి యిట్లనెను. ''ప్రభూ! నా తండ్రిపై అనుగ్రహము చూపవలెను. అజ్ఞానముచే మీ వైభవమును గుర్తించక, జీవితమంతయు మిమ్ములను ద్వేషించెను. అతడు నాయెడల ప్రవర్తించిన తీరు మీకు ఆగ్రహము తెప్పించెను. క్షమించరాని భగవద్భక్త నిందన అనే పాపము నుండి నా తండ్రిని కాపాడి క్షమింపవలెను''.

''అట్లే జరుగుగాక'' అని నృసింహుడనెను. చిరునవ్వుతో మరల యిట్లు చెప్పెను ''నీవు హిరణ్యుని వంశములో జనించుట చేత అతడేకాక, అతని పూర్వులు యిరువది తరములవరకు పరిశుద్ధులైరి. నీ తండ్రి పితృలోకము చేరెను. నీవు అతని అంత్యవిధులను నిర్వహింపుము నీ వారసులందరూ కూడ నాకు ప్రీతిపాత్రులగుదురని తెలుసుకొనుము''. ఆటు తర్వాత నృసింహుడు బ్రహ్మతో యిట్లనెను. ''ఇకనుండి అసురులకు నీవు అనాలోచితముగా వరములు ప్రసాదించుట తగదు. అది పాములకు అమృతము పోసిన ట్లుండును''.

తర్వాత నృసింహుడు అదృశ్యమయ్యెను ప్రహ్లాదుడు బ్రహ్మాది దేవతలను గౌరవించిన పిదప, వారందరూ తమ తమ గృహములకేగిరి ఇంతకాలముగా వారు అనుభవించిన బాధలు సమసిపోవుటతో వారందరూ సంతోషించిరి నారదుడు యుధిష్ఠిరునితో చెప్పుచున్న వృత్తాంతము కొనసాగించుచూ యిట్లనెను ''ఆ విధముగా దితి పుత్రులు నారాయణునిచే నిహతులైరి. ద్వేషముతో వారు యెల్లపుడూ నారాయణునే చింతించుచుండిరి సనకాదుల శాపము చేత విష్ణు ద్వారపాలకులైన జయ విజయులు తిరిగి రావణ కుంభకర్ణులుగా జన్మించిరి నారాయణుడు రాముడుగా జన్మించి వారిని సంహరించెను. శిశుపాల దంతవక్త్రులుగా వారు మూడవసారి జన్మించిరి. శిశుపాలుడుగా జన్మించిన జయుడు ఇప్పుడే నారాయణుని పాదములు చేరెను త్వరలోనే విజయుడు అనుసరించగలడు

''యుధిష్ఠిరా! వీరిద్దరి మొదటి జన్మలో క్రోధము, మదము ప్రధానముగా నుండుట నీవు గుర్తించి యుండవచ్చు రెండవసారి రావణుడుగా జన్మించినపుడు, కామము ప్రధానమైన దుర్లక్షణముగా నుండెను ఈ జన్మయందు వారిద్దరిలో మత్సరము యెక్కువగా నుండెను

''ప్రహ్లాదుని వృత్తాంతమును, భగవంతుడు భక్తుని అనుగ్రహించుట వినిన వారు తిరిగి యీ లోకమున జన్మించరు'' అని పలికి నారదుడు ముగించెను

ఒక క్షణము యుధిష్ఠిరుడు మౌనముగా నుండి యిట్లనెను ''భగవంతుని ప్రత్యక్షముగా కాంచగల్గిన ఆ అసురబాలుడు ప్రహ్లాదుడు మిక్కిలి అదృష్టవంతుడు'' నారదుడు జాలిగా నవ్వి యిట్లనెను. ''యుధిష్ఠిరా! నీవు అందరికన్నా అదృష్టవంతుడవని గ్రహించలేదా? అది యెట్లో వివరించెదను

''ప్రహ్లాదుడు, అతని గురువైన నేను నీ అంతటి అదృష్టవంతులము కాము నీ పూర్వులైన పురూరవుడు, వసిష్ఠుని వంటి మహా గొప్ప ఋషులు, సృష్టికర్తయైన బ్రహ్మ కూడా నీ వంటి అదృష్టవంతులుకారు. అనేక సంవత్సరములు ఉపనిషత్తులు మొదలైన శాస్త్ర గ్రంథములు చదివి, బ్రహ్మము కొరకు అన్వేషించిరి ఉపనిషత్తుల సారమైన బ్రహ్మము, యిప్పుడు మానవ రూపములో, నీవు అడుగక పోయినప్పటికీ, నీతోనే ఉంటున్నాడు ఉపనిషత్తులన్నింటినీ ఒకచోట చేర్చిన వాని కున్న పవిత్రత, పరిశుద్ధత నీ గృహమున గలదు పరబ్రహ్మము ప్రహ్లాదుని గృహములో నివసించి యుండలేదు ఋషులు అతని గృహమునకేగి బ్రహ్మమును దర్శించలేదు. ఇప్పుడు జరుగుతున్నది నీవు యెరుగుదువా?

''ఋషులు వైకుంఠములో బ్రహ్మమును అన్వేషించు చున్నారు, సూర్యలోకములో, క్షీరసాగరములో, శ్వేతద్వీపములో వెదకుచున్నారు అక్కడెక్కడను గానక, అంతటా వెదకుచున్నారు. అతడు (బ్రహ్మము) మానవ రూపములో దాగి నీ కొరకు అంతటా తిరుగుచున్నాడు. ఇప్పుడు చెప్పుము, యితరులు అదృష్టవంతులా? లేక నీవా? కృష్ణుడుగా అవతరించిన పరబ్రహ్మము నీతో కలిసి ఉంటున్నాడు నీ కతడు మేనబావ నీవు అతనికి ప్రీతిపాత్రుడవు అతడు నీ శ్రేయోభిలాషి నీ నుండి అతడేమియూ ఆశించుట లేదు అతడు నీ మేనమామ కుమారుడు. 'అతడు నా ప్రాణము' అని యెంతో ప్రేమతో నీవు అనేకసార్లు అన్నావు ఇదంతయూ సత్యము. ఒకొక్కపుడు నీకు గురువువలె, మరొకపుడు బంధువువలె నీ కొరకు శ్రమించుచున్నాడు ఈ ఇంద్రప్రస్థమును నిర్మించునపుడు, నీ సోదరులతో జరాసంధుని కోటలో ప్రవేశించి అతడు హతమారునట్లు చేసి, నీవు రాజసూయాగము చేయునట్లు కృషి చేసిన విషయము జ్ఞప్తిలేదా? కొన్ని సమయములలో అతడు నీకు సలహాదారు, మరొక సమయములో బావ, నీ కంటె వయసులో చిన్నవాడగుటచే

అతడు నీకు ప్రణామము చేయు చుండెను. మునులు అంతటా అన్వేషించి, యెక్కడను గానక, యీ భూమికి వచ్చిరి వారు మథుర, బృందావనము వెళ్ళిరి. తర్వాత ద్వారకకు వెళ్ళి, చివరకు నీ యింటికి నీతో సామాన్యమానవునివలె నివసించుచున్న కృష్ణుని వద్దకు వచ్చిరి అతని స్వభావమును ఒకొక్కపుడు బ్రహ్మ మహేశ్వరులు కూడ తెలుసుకొనలేరు. ఋషులు మౌనముగా భక్తితో నన్యసించి పూజింతురు అయినప్పటికీ వారు అతడిని పొందలేకున్నారు. భగవంతుని గూర్చి వారికి తెలుసును. కాని వారు అతడిని చూడలేదు. ఆ బ్రహ్మమే యీ కృష్ణుడు. అతడు యీ భూమిపై సంచరించుట యెంతో అదృష్టము నీతో, నీ సోదరులతో అతడు నివసించుచుండుట మీ భాగ్యము''.

అష్టమ స్కంధము

87 గజేంద్రుని వృత్తాంతము

త్రికూట మనుకొండ ఒకటి కలదు. పాల సముద్రము చుట్టు ఆవరించి అతి రమణీయముగా నుండుటచే ఆ కొండ ప్రాముఖ్యము వహించెను. ఆ కొండపై పెరుగు లతలు వెండి బంగారములవలె తళతళ మెరయుచుండెను. ఆ ప్రకాశము దిక్కులందు ప్రసరించగా, నాలుగు దిక్కులు ప్రకాశించుచుండెను. అది నూరు యోజనములు విస్తీర్ణము కలిగి యుండెను. శంఖములు, విలువైన రాళ్ళు అచట నిశేషముగా నుండెను. ఎత్తునుంచి చూచువారికి నల్లగా నున్న భూమి, తెల్లని పాల సముద్రము, లతలు, వృక్షములు, పొదలతో ఆకుపచ్చగా నున్న కొండ వెండితో పొదిగిన పచ్చ రాయివలె గోచరించుచుండెను. ఆ కొండ చాల అందముగా నుండెను. అచట అడవి మృగములు కలవు. పక్షుల గూళ్ళ నుండి వచ్చు మధుర సంగీత ధ్వని, గుహలలో నుండి వినవచ్చే పులులు సింహముల అరుపులతో కలిసిపోవుచుండెను. అచ్చట వీచు వాయువు పరిమళ పుష్పముల సువాసనతో నిండియుండుటచే దివ్యపురుషులు ఆ ప్రదేశమునకు వచ్చి విహరించుచుండిరి. దివ్యపురుషుల కది యొక ఆటస్థలము. సిద్ధ చారణ గంధర్వులు తరచు అక్కడకు వచ్చి, అచ్చటి గుహలందు లోయలందు సంచారము చేయుచుండిరి. ఆ ప్రదేశమందలి పెద్దపెద్ద రాళ్ళతో యిమిడియున్న విలువైన మణులతో అవి మెరయు చుండెను.

ఆ కొండపై ఋతుమనువనే తోటకలదు. అందు మందార, పారిజాత, పాటల, అశోక, చంపక చూత మనే పుష్ప వృక్షములు; మామిడి మొదలగు ఫలవృక్షములు గలవు. పొడవైన దేవదారు, సాలవృక్షములు ఆకాశము నంటుచున్నట్లుండెను. ఆ తోట వరుణునకు చెందినది. ఆ కొండమీద అందమైన సరస్సుకూడ కలదు. అది చాల పెద్దది. అందు నీలి, తెలుపు, యెర్రని పద్మములు తేలుచుండెను. వాటియందున్న మకరందమును గ్రోలుటకు, ఆ పద్మముల చుట్టూ చేరిన తుమ్మెదలు చేయు ఝుమ్మను శబ్దము అన్ని వేళలందు వినిపించుచుండెను. నిర్మలముగా ఉన్న ఆ సరస్సులో పైన సంచరించు కొంగలు, హంసలు, లోపల నుండే చేపలు, తాబేళ్ళు స్పష్టముగా అగుపించుచుండెను. సరస్సు ఒడ్డు నందు మల్లె, కుంద, జాజి, పున్నాగ, కురవక మాధవీలతలు విరబూచి యుండెను. ఆ పుష్పవాసనలమత్తు మైమరపించు చుండెను.

ఆ కొండ యందు ఒక ఏనుగు తన పరివారముతో నివసించుచుండెను. తన యిష్టము వచ్చినపుడు ఆ ఏనుగు సంచరించుచుండెను. సంచరించునపుడు పరివారమంతయు ఆ యేనుగుతో సంచరించుచుండెను. వెదురు గడలను, చెరకుగడలలో లేతవానిని పెరికి తినుట వానికి ఆటగా నుండెను. ఆ అడవిలో అవి యిష్టము వచ్చినట్లు సంచరించుచుండెను. మదించిన ఆ యేనుగు నిలిచిన చోటునుండి, పులులు, సింహములు, అడవిపందులు, యెద్దులు దూరముగా పారిపోవుచుండెడివి.

ఒక వేసవికాలమందు ఆ యేనుగు తన సహచరులతో చాల దూరము నడిచి నడిచి అలసిపోయెను. మిక్కిలి దప్పికతోనున్న ఆ యేనుగు దూరమునుండి సరస్సు నుండి వచ్చు సువాసనలను ఆఘ్రాణించి, ఆ సరస్సు దిక్కుగా వేగముగా చనెను. వెంటనే తన పరివారము కూడ సరస్సును చేరి అందు ప్రవేశించెను. ఆ

సరస్సునందు స్నానము చేయగా అవి యెంతో హాయి ననుభవించి, మధురమైన సరోవర జలము త్రాగి దప్పికను తీర్చుకొనెను దప్పిక తీరిన తర్వాత వాటికి సరస్సు నుండి బయటకు రావలెననిపించలేదు. చాలసేపు స్వచ్ఛమైన సరోవరములో ఆడి ఆడి, తదుపరి దానిని బురదగా చేసెను గజరాజము తన తొండముతో సరస్సులో నీటిని చిన్నయేనుగులపై, ఆడ యేనుగుల వీపులపై జల్లుచుండెను సంసారసుఖములలో మునిగిన మానవుడు కాల ప్రవాహమును గుర్తించని విధముగా ఆ గజరాజు కాలము గతించుట గుర్తింపకుండెను. ఆ సరస్సు అడుగున దాగియున్న ప్రమాదములను మరచి, సంసారి సంసారబంధములో చిక్కుకొని పోయినట్లు, సరస్సునందు యితర యేనుగులతో ఆడుచూ ఉల్లాసముగా గడపుచుండెను

విధి ప్రేరణచే ఆ సరస్సునందే చాలకాలముగా నివసించుచున్న ఒక మొసలి, గజము కాలును తన బలమైన కోరలతో పట్టుకొనెను హఠాత్తుగా కలిగిన యీ బాధకు ఏనుగు తన శరీరము నంతనూ విదల్చి, మొసలి పట్టునుండి తప్పించుకొనుటకు ప్రయత్నించెను కాని సాధ్యము కాకపోయెను ఎంతగా ప్రయత్నించినప్పటికి మొసలి పట్టునుండి తప్పించుకొనుట అసాధ్యమయ్యెను మిగిలిన యేనుగులు సహాయపడుటకు ప్రయత్నించి విఫలమైనవి ఆ ఏనుగు బలమైన దైనప్పటికీ మకరము పట్టు అంతకన్న బలముగా నుండుటచే, ఆ పట్టునుండి విడిపించుకొనలేకుండెను కరిమకరుల మధ్య పోరు కొన్ని సంవత్సరములు సాగినది అడవిలో చక్రవర్తివలె సంచరించు గజరాజునకు సరస్సు అనే సామ్రాజ్యానికి రాజుగా ఉంటూన్న మొసలికి మధ్య జరుగుచున్న తీవ్రపోరాటము దేవతలకు కూడ ఆశ్చర్యము కలిగించెను క్రమక్రమముగా ఏనుగు బలము హరించి పోవుచుండెను. మొసలి పట్టు మరింత బలపడుచుండెను తన బలము సన్నగిల్లుటచే ఓడిపోవుట తథ్యమని, త్వరలోనే ప్రాణములు పోవునని ఆ యేనుగు గ్రహించెను ఆ క్షణములో ఏ వగాహన చేసుకొనెను బాగా ఆలోచించిన పిదప తనలో తానిట్లనుకొనెను ''నేను యిప్పుడు పెద్ద యిక్కట్టులో పడినాను నామీద ఆధారపడిన యీ యితర యేనుగులు యీ క్లిష్ట పరిస్థితి నుండి నన్ను తప్పించలేవు నాకు వాటిల్లిన యీ విపత్కర పరిస్థితిని తప్పించి, యెవ్వరూ సహాయము చేయలేరు కాని, యింకను ఒక ఆశ మిగిలియున్నది బ్రహ్మాది దేవతలకు సైతము ఆశ్రయుడైన ఆ భగవంతుని శరణు జొచ్చెదను అతడు నన్ను యీ భయంకరమైన మొసలి బారి నుండి తప్పక రక్షించగలడు. భగవంతుడు నాకు అండగా నున్నచో, మృత్యువు అతనికి భయపడి నన్ను వదలి పారిపోవును భగవంతుని ప్రార్థించెదను''

తన మనస్సును ఆలోచనలను కూడగట్టుకుని, వాటిని నారాయణునిపై నిలిపి యిట్లు స్తుతించి గానము చేసెను. ''దేవతలకు ప్రభువైన మహాప్రభూ! నీకు నా నమస్కారము. నీవు సనాతన పురుషుడవు, యీ ప్రకృతిని సృష్టించిన పురుషుడవు మానవుల మేధస్సును వికసింపజేసి ప్రకాశము నిచ్చువాడవు నీవు ఈ లోకమంతయు నీవలన యేర్పడినది నీవు లేక యీలోకము లేదు, నీ నుండి ఆవిర్భవించినది యీలోకము. దీనిని సృష్టించిన నీవు, తిరిగి నీలో లయము చేసుకొందువు అన్ని వెలుగులకు మూలము నీవు

''ప్రళయానంతరము నీవు తమస్సు, అనగా చీకటి సముద్రము అంచున నిలబడి, తిరిగి సృష్టిని ప్రారంభించి దానికి క్రొత్తగా జీవము కల్పించుచున్నావు ఈ విధముగా అనంతమైన కాలచక్రము కొనసాగుచున్నది. ఈ లోకములన్నింటికీ మూలకారణము నీవు. నీ దర్శనముకొరకు మహర్షులు వేలకొలది సంవత్సరములు ధ్యానములో నిమగ్నులై యుందురు. నీకు జనన మరణములు లేవు నీకు రూపనామములు, గుణములు లేవు. అయినప్పటికీ, నీ మాయచేత, నీకు, రూపనామములు సృష్టించి వానికి కొన్ని గుణములు ఆరోపించుచు న్నారు లోకకళ్యాణము కొరకు నీవు రూపము ధరించుట చూచినవారు నీ నిరాకార తత్త్వమును విస్మరింతురు.

నీవు ఇంద్రియములకు, మనస్సుకు, భావోద్వేగములకు, బుద్ధికి అతీతుడవు. నీవు సామాన్యుల అవగాహనకు అతీతుడవైనప్పటికీ, కొందరు మహాపురుషులు నిన్ను గ్రహించి నీలో ఐక్యము కాగల్గిరి.

''ఇంద్రియముల కార్యకలాపములకు, వాని వాని ప్రత్యేక చర్యలను కాంచు నీవు ద్రష్టవు. ప్రతి ఒక్కదానికీ నీవు కారకుడవు. కాని, నీకు యేదీ కారణము కాదు. ఏలననగా నీవు సనాతనుడవు, నిత్యుడవు, అనాదివి, నీకు పరిమితులు లేవు, అనంతుడవు.

''నీవు గుణాతీతుడవు, అవి నిన్ను అంటవు. కాని గుణదోషములచేత మాయకు వశమైనవారు నీ సత్యస్వరూపము నెరుగజాలరు. సూర్యునినుండి అగ్నినుండి వెలువడే ప్రకాశము కొంతసేపు ఉండి తిరిగి యెచ్చటి నుండి వచ్చెనో, దానియందు అదృశ్యమగును. అదే విధముగా నీ వైభవము నీ నుండియే వెలువడుచున్నది. ఈ గుణములు, మనస్సు, బుద్ధి, ఇంద్రియములు, శరీరము - యివన్నియు నీ నుండి జనించి, తిరిగి నీలో లయమగుచున్నవి. వానికి ప్రత్యేకమైన ఉనికిలేదు. నీవు గుణాతీతుడుగా ప్రసిద్ధి గాంచినప్పటికీ, నావంటి అభాగ్యజీవులయెడ నీవు కరుణామూర్తివని అందరును యెరుగుదురు. నీకు పూర్తిగా శరణాగతులైన వారు నిశ్చయముగా అవిద్య నుండి వెలువడి, నిత్యసత్యమైన నీ దర్శనము పొందగలరు.

''నా యీ జన్మ లోపలనూ వెలుపలనూ అవిద్యతో నిండియున్నది. ఈ గజాకారము వలనను మనస్సు వలనను నా కెట్టి ప్రయోజనమును లేదు. నాకు జీవించవలెనను కోరిక లేదు. కాలముచే నాశనము పొందని మోక్షమును కోరెదను. పుణ్యకార్యములకు ప్రతిఫలముగా కొంతకాలము స్వర్గములో నుండవచ్చును. ఆ పుణ్యము హరించిపోయి నంతనే తిరిగి యీ పాప ప్రపంచమున పడవలెను. దీనికి భిన్నమైన మోక్షమును కోరుచున్నాను. నా అవిద్య అణగిపోవలెనని నా ఆకాంక్ష. నేను ముముక్షువును. నీవు లోకకారకుడవు, సర్వవ్యాపివి. నీవు సృష్టించిన వానికి భిన్నముగా ఉంటూ, అంతిమ సత్యమువై యున్న నీకు నా ప్రణామములు. జ్ఞానాగ్నిచేత కర్మబంధములను దగ్ధము గావించుకొనిన యోగులు తమ హృదయములో నిన్ను దర్శించెదరు. 'నేను', 'నాది' అనుభావములతో వివేకశక్తిని కోల్పోయిన నావంటి మూర్ఖులు నీ గొప్పదనమును గుర్తించలేరు. నీవు అనంతశక్తిస్వరూపుడవు, నీవు నిత్యసత్యము, నీవు ఆత్మజ్యోతివి. నీకివే నా జోహారులు''.

బ్రహ్మాది దేవతలందరూ గజేంద్రము పలికిన పలుకులను వినుచుండిరి. ఆ గజేంద్రము ఆదిపురుషుని స్తుతించుటచేత, అవి యేవియు తమలో యే ఒక్కరికీ వర్తించవని గ్రహించిరి. గజేంద్రము పరిస్థితికి నారాయణుడు చలించి, హరి రూపములో సరస్సు తీరమున గజేంద్రునకు ప్రత్యక్షమయ్యెను.

గరుడునిపై నారాయణుడు వచ్చి చేరెను. అతని చేతిలో సుదర్శన చక్రము మెరసెను. నారాయణుని చూచిన గజేంద్రము, పద్మమును తొండముతోపట్టి తొండమును పైకెత్తియిట్లనెను. ''ఓ ప్రభూ! నారాయణా! నీకు నా నమస్కారము''. ఆ గజేంద్రము పరిస్థితిని చూచి నారాయణుడు కరుణాభరితుడయ్యెను. అతడు తన సుదర్శన చక్రముతో మొసలిని సంహరించి, ఆ గజేంద్రుని సరస్సునుండి బయటకు లాగెను. చనిపోయిన మొసలి నోరు తెరచుకుని గజేంద్రుని కాలినంటుకొని యుండెను.

స్వర్గవాసులు యీ దృశ్యమును ఆశ్చర్యముతో గాంచుచుండిరి. వారు నారాయణుని చుట్టూ చేరిరి. మొసలితోపోరి అలసిపోయిన గజేంద్రము తొండమునెత్తి అట్లే యుండెను. అమితప్రేమతో శ్రీహరి గజేంద్రుడొసగిన పద్మమును స్వీకరించగా, ఆ గజరాజము మిక్కిలి సంతోషించెను.

88 మోక్షము

వారట్లు చూచుచుండగా చనిపోయిన మొసలి శరీరమునుండి ఒక దివ్యపురుషుడు ప్రత్యక్షమయ్యెను. అతడు హూహూ అను గంధర్వుడు. అతడు భగవంతుని పాదములకు ప్రణమిల్లి, గాంధర్వ పద్ధతిలో కీర్తించి గానము చేసెను. అతడు యిన్ని సంవత్సరములుగా మొసలి రూపము ధరించి, చివరకు నారాయణుని చేతులలో విముక్తిని పొందుటకు కారణము అక్కడ చేరిన వారు తెలుసుకొనిరి.

చాల సంవత్సరములకు పూర్వము, యీ గంధర్వుడు తన భార్యలతో యిదే సరస్సునందు స్నానమాడుచుండెను. అదే సమయములో మహర్షి దేవలుడు సరస్సులో ప్రవేశించెను. జలక్రీడలో మునిగియున్న గంధర్వుడు నీటి అడుగునకుపోయి, నీటిలో నిల్చుని ధ్యానము చేయుచున్న దేవలుని కాలిబొటన వ్రేలును లాగెను. తాను చేసినది యెంత తీవ్ర అపచారమో ఆ గంధర్వుడు గ్రహింపకుండెను. దేవలుడు, తన ధ్యానమునకు అంతరాయము కల్గుటచేత మండిపడి, గంధర్వుని ఇట్లు శపించెను. ''నీవు యీ జలక్రీడలలో అమితముగా ఆనందించుచుండుటచేత, నీవు మొసలివై యీ సరస్సు నందే జీవించెదవు''. తన అపచారమును గుర్తించిన గంధర్వుడు శాపమును ఉపసంహరించవలసినదని బ్రతిమాలెను. అతని భార్యలు కూడ ఋషి ఆగ్రహమును ఉపశమింపజేయుటకు ప్రయత్నించిరి. దేవలుడు కొంతవరకు శాంతించి యిట్లనెను. ''నీవు యీ సరస్సునందు కొంతకాలము జీవించెదవు. గజేంద్రము తన సహచరులతో యీ సరస్సులో ప్రవేశించును. నీవు దాని కాలును గట్టిగా పట్టుకుని విడిచిపెట్టక యుండవలెను. ఆ గజేంద్రము భగవంతుని ప్రార్థింపగా, అతడు శ్రీహరి రూపములో ప్రత్యక్షమై, తన సుదర్శన చక్రముచే నిన్ను వధించి, నీకు మొసలి రూపము నుండి విముక్తి కలిగించును.

గంధర్వుడు భగవంతునికి ప్రదక్షిణము చేసి, భగవత్కీర్తనలను గానము చేయుచూ వెడలిపోయెను.

పరీక్షిత్తున కిదంతయు అయోమయముగా నుండుట అతని ముఖమున శుకబ్రహ్మ గుర్తించెను. అతడు ప్రశ్నించక మునుపే శుకబ్రహ్మ యిట్లనెను. ''నీ ఆలోచనలను నేను తెలుసుకున్నాను. పరమ యోగులు కూడ పలుకలేని పలుకులను, కేవలము ఒక జంతువు యెట్లు పలికెనా యని నీవు ఆశ్చర్యపడుచున్నావు. ఆ గజేంద్రమునకు పురుషుని గురించిన సత్యము యెట్లు తెలిసెను అని గదా నీ సందేహము? అది నీకు చెప్పెదను.

''దక్షిణ పాండ్యదేశమును ఒకప్పుడు ఇంద్రద్యుమ్నుడను రాజు పరిపాలించెను. అతడు ధర్మవర్తనుడు. అతడు నారాయణుని భక్తుడు. ఒకప్పుడు ఆ రాజు మలయ పర్వత సానువులలో మౌనముగా భగవంతుని ధ్యానించుచుండెను. అచ్చట నదిలో స్నానము చేసిన రాజు, ఆలోచనలను, మనస్సును, శ్వాసను నిగ్రహించి, భగవంతుని రూపమును ధ్యానించుచూ ప్రార్థించునపుడు మౌనవ్రతమును పాటించెను. ఆ పర్వతముపై నివసించుచున్న అగస్త్యమహర్షి ఆ ప్రదేశమునకు వచ్చుట తటస్థించెను. అతని శిష్యులు అగస్త్యమహర్షి చుట్టూ చేరిరి. ధ్యానమందు నిమగ్నుడైన రాజు బాహ్య ప్రపంచ జ్ఞానమును కోల్పోవుటచేత, అగస్త్యమహర్షిని గాంచక సాంప్రదాయము ననుసరించి చేయు గౌరవమర్యాదలను అగస్త్యమహర్షికి చేయకుండెను. బ్రాహ్మణుడైన అగస్త్యమహర్షి శిష్యులతో వచ్చి యుండగా రాజు వారి ఉనికిని గమనించకుండెను.

''రాజు ప్రవర్తన అగస్త్యునకు సహింపరాని దయ్యెను. అతడిట్లనెను. 'ధ్యానములో నిలిచియున్న రాజు తమస్సు మూర్తీభవించినట్లు ఉన్నాడు. తమస్సుకు సంకేతమైన ఏనుగుగా యీ రాజు జన్మించగలడు'. అట్లు శాపమొసగి అగస్త్యమహర్షి శిష్యులతో ఆ ప్రదేశమునుండి వెడలిపోయెను. ఇంద్రద్యుమ్న మహారాజు ఋషి శాపమునకు ఆగ్రహించక, శాంతముగా దానిని స్వీకరించెను అది భగవంతుని ఆజ్ఞగా భావించి, దానిని వినయముతో గ్రహించెను అతడు ఏనుగుగా జన్మించి త్రికూట పర్వతముపై నున్న అరణ్యములో సంచరించుచుండెను అతని జంతు జీవితములో ఒక విశేషము గలదు. అతని ఆలోచనలు, మనస్సు భగవంతునిపై భక్తితో నిండియుండుటచేత, పూర్వజన్మ స్మృతులు కలిగియుండెను అందుచేత, అతడు క్లిష్టపరిస్థితుల నెదుర్కొనినపుడు, భగవంతుని ప్రార్థించెను. సాధారణ జంతువుల కిది సాధ్యము కాదు

''ఇంద్రుద్యుమ్నుడు యిపుడు శాపవిముక్తు డగుటేగాక, సంసార బంధము నుండి విముక్తిపొంది మోక్షము నందెను. భగవంతుని స్పర్శ కలిగిన వెంటనే అతని గజరూపము పోయెను అతడిపుడు నారాయణుని సేవకులలో ఒకడయ్యెను అతనికి నారాయణునితో సారూప్యము కలిగెను గరుడునిపై నారాయణుని ప్రక్కనే స్థానము పొందిన ఇంద్రద్యుమ్న మహారాజు యీ మానవలోకమును విడిచిపోయెను గరుడుడు ఆకాశముపై కెగిరి, త్రికూట పర్వతముపై ఋతుమనువను తోటలోనున్న సరస్సు తీరముననున్న వారందరకూ అదృశ్యుడయ్యెను''

89 అమృత మథనము

ఒకప్పుడు దేవదానవుల మధ్య యుద్ధము సంభవించెను అసురుల తీవ్రధాటికి దేవతలు నిలువలేకపోయిరి. యుద్ధములో మరణించిన అనేకమంది దేవతలను పునరుజ్జీవించునట్లు చేయలేకపోయిరి. ఇంద్రవరుణాదులు సమావేశమై యీ తీవ్ర పరిస్థితిని అంతమొందించుటకు మార్గముల నన్వేషించగా, వారికేదియు తోచుకుండెను. సృష్టికర్తయైన బ్రహ్మ దగ్గరకు వెళ్ళుటకు వారు నిశ్చయించుకొనిరి. వారు బ్రహ్మ దగ్గరకు వెళ్ళగా, నారాయణుని వద్దకు వెళ్ళి ప్రార్థించుట తప్ప యింకొక మార్గము లేదని బ్రహ్మ సూచించెను. నారాయణుడు తమ కష్టములు గట్టెక్కుటకు సహాయపడునని బ్రహ్మ చెప్పెను.

అంతట వారు నారాయణుని వద్దకేగిరి బ్రహ్మ నారాయణుని ప్రార్థించి, దేవతలపై దయకలిగి వారి కష్టములను తీర్చుమని వేడెను. వారి ప్రార్థనలను విని నారాయణుడు ప్రత్యక్షమైన వారితో యిట్లనెను ''మీరు కోరుదానిని సాధించగలరు. మొట్టమొదట మీరు అసురులతో సంధి చేసుకొనవలెను మనము తిరిగి సన్నద్ధులమగుటకు కొంత వ్యవధి కావలెను. మీ ప్రయత్నములు సఫలమగునంతవరకు, అసురులతో సంధియే ఉచితమైన రాజనీతి మార్గము.

''ఒక ఉన్నతాశయమును సాధించుటకు చేయు ప్రయత్నములు, మార్గములు సాధ్యమైనంతవరకు శాంతిదాయకముగా నుండవలెను. మీరు మరణము లేకుండ రక్షనొందుటకు కావలసిన అమృతమును పొందవలెను. ఇది నేను మీకు యిచ్చుసూచన. ఆ అమృతముతో మరణించిన వారిని తిరిగి పునరుజ్జీవింప చేయవచ్చును అమృతము యెట్లు లభింపగలదు? అని మీ తరువాత ప్రశ్న.

''మందర పర్వతమును కవ్వముగా, వాసుకి యనే సర్పమును త్రాడుగా నియోగించి పాల సముద్రమును మథించవలెను సముద్రమును మథించుటకు అసురుల బలమైన బాహువులు అత్యవసరము మీకు మీరు దీనిని చేయజాలరు ఈ సాగర మథనములో నేను కూడా పాత్ర వహించెదను సాగరము నుండి అమృతము లభించువరకు మీరు కృషి సలుపవలెను ఆ అమృతము వల్ల పూర్తి లాభమును మీరు మాత్రమే పొందునట్లు, అసురులకు లేకుండునట్లు నేను చూచుకొందును కాని మీకు నేనొక హెచ్చరిక చేయదలచుకున్నాను ఏ విషయములోను మీరు అసురులకు అడ్డు చెప్పవద్దు వారి సూచనల నన్నిటిని ఆమోదించునట్లు మీరు నటించవలెను. మరొక హెచ్చరిక సాగరమును మథించగా మొట్టమొదట లభించునది కాలకూటవిషము దానిని చూచి మీరు భయపడవద్దు. అటు తర్వాత అనేక వస్తువులు, లభించగలవు చిట్టచివర అమృతము లభించును ఆ వస్తువులను రాక్షసులు కోరెదరని తలంచి, మీరు ముందుగా సంగ్రహించుటగాని, వాటిని కోరుటగాని చేయరాదు మీ ధ్యేయము అమృతమును పొందుట, ఇతరమైనవన్నియు అప్రధానములు మీరు వెళ్ళి బలిచక్రవర్తితో సంధి చేసుకొని మీ కార్యమును ప్రారంభింపుడు'' భగవంతుడు అదృశ్యము కాగా, బ్రహ్మాది దేవతలు వారి వారి గృహముల కేగిరి

బలిచక్రవర్తి, ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుని కుమారుడు ఇంద్రుని నాయకత్వములో దేవతలు బలిచక్రవర్తి ప్రాసాదమునకు వెళ్ళిరి చక్రవర్తి సేవకులు, దేవతలను చూచి, వారిపై దాడి జరుపుటకు సిద్ధపడిరి కాని బలి అచ్చటకు వచ్చి, సేవకులను దుడుకుగా ప్రవర్తించవలదని ఆదేశించెను ఇంద్రుని సకల మర్యాదలతో బలిచక్రవర్తి తన సభకు ఆహ్వానించెను. గౌరవనీయుడైన అతిథిని సంతోషపెట్టుటకు తానేమి చేయవలెనో చెప్పుమని బలి అడిగెను. నారాయణుని మాటలు జ్ఞప్తికి తెచ్చుకుని ఇంద్రుడు అతి సరళముగా పలికెను ఇంద్రుని వైఖరి మిక్కిలి నేర్పుతోను, మాటలు యెదుటివారిని ఒప్పించునట్లుగను ఉన్నవి సాగరమథనము గురించి ఇంద్రుడు బలితో చర్చించెను ఇంద్రుడిట్లనెను. ''ఇంతవరకు మనకు తెలియని విషయ మొకటి గలదు మనలో మనము కీచులాడక స్నేహపూర్వకముగా కొంతకాలము సంచరించుదము కనీసము సాగరమథన కార్యము పూర్తియగువంత వరకు మనము మిత్రులుగా నుందము. మీరు యీ కార్యములో సహకరించగలరని నే నాశిస్తున్నాను. ఈ కార్యము చాల క్లిష్టమైనది కాని దీనివలన కలుగు విశేష ఫలితము దృష్ట్యా యీ కార్యము చేబట్టదగినదని నా అభిప్రాయము'' బలిచక్రవర్తి ఆమోదము తెలుపగా, అతని సహచరులైన శంబరుడు, అరిష్టనేమి, త్రిపురులు కూడ మెచ్చుకొనిరి వారు తమ మధ్య నున్న శత్రుత్వమును తాత్కాలికముగా విస్మరించుటకు నిశ్చయించుకొనిరి. అందరు కలిసికట్టుగా అమృతమును సాధించుటకు ప్రయత్నింప నిశ్చయించుకొనిరి.

ప్రతి ఒక్కరూ ఉత్సాహముతో నుండిరి. అసురులు తమ బలమైన బాహువులతో భూమినుండి మందర పర్వతమును పెకలించగా, దేవతలు, అసురులు కలిసి, దానిని సముద్రతీరమునకు తీసుకువెళ్ళిరి. ఆ పర్వతము అతి బరువుగా నుండుటచే, మార్గమునందు అది క్రిందజారిపడినది. అనేకమంది దేవతలు, అసురులు దాని క్రిందపడి అణగిపోయిరి. ఈ దారుణ సంఘటన నుండి వారు తేరుకొనునంతలో నారాయణుడు వారికి ప్రత్యక్షమయ్యెను ఆ పర్వతము నతడు యెత్తి సముద్రతీరమున చేరవేసెను. ఇంతకు మునుపే దేవతలు వాసుకికి నచ్చజెప్పి, సాగరమథనమందు మందరపర్వతమును చుట్టి, త్రాడుగా నుండి అసురులకు సేవజేయవలసినదని కోరిరి. అమృతములో కొంత భాగము నీయగలమని మాట యిచ్చిరి.

90 సాగరమథనము : కూర్మావతారము

దేవదానవులు సాగరమును మథించుట ప్రారంభించిరి. శ్రీమన్నారాయణుడు అక్కడనే యుండెను. అతడు వాసుకి తలవైపునకు వెళ్ళి వాసుకి శిరస్సును తన చేతులతో అదిమిపట్టెను. దేవతలు నారయణు ననుసరించి, వాసుకి శిరస్సుపై చేతులను వైచిరి. ఇది చూచిన అసురులకు ఆగ్రహము వచ్చెను. దేవతలు భగవంతుని నాయకత్వమున వాసుకి శిరస్సు పట్టుకొనుటచేత తమ నవమానించినట్లుగా భావించిరి. వాసుకి తోకను పట్టుకొనుట వారి గౌరవమునకు భంగకరమని అసురులు భావించిరి. తమను తాము ఉన్నతులుగా భావించిన అసురులు యిట్లనిరి. ''మేము పవిత్రమైన వేద శాస్త్రములను నేర్చియున్నాము. ఉత్తమ జన్మల నొందిన మేము బహు దొడ్డ కార్యములు సలిపి లోక ప్రఖ్యాతి పొందియున్నాము. దేవతలైన మీరు యీ సర్పము తలను పట్టుకొని యుండగా, మేము ఆ సర్పము తోకను పట్టుకొనుట మిక్కిలి అవమానకరము. ఈ మథన కార్యములో యిక మేము సహాయపడుటకు నిరాకరించుచున్నాము''.

అసురులు అట్లే స్థిరముగా కదలక నిల్చుండిరి. భగవంతుడు వారివైపు మధురహాసముతో వీక్షించి, వారికి తలను వదలి పెట్టి తోకను పట్టుకొనుటకు వెళ్ళెను. దేవతలు భగవంతుని ననుసరించిరి.

ప్రప్రథమముగా యేర్పడిన అభిప్రాయభేదము సమసిపోయినంతనే, తమ మాట నెగ్గినందుకు అసురులు యెంతగానో సంతోషించిరి. ఆ సంతోషములో అత్యంత ఉత్సాహముతో భగవంతుని నాయకత్వమున నున్న దేవతలతో సాగరమును మథింపజొచ్చిరి.

శక్తిమంతమైన అనేక బాహువులు యీ మథన కార్యమునందు నిమగ్నమై యున్నప్పటికీ, విశేషమైన బరువుచేత మందర పర్వతము సముద్రములో కూరుకుపోయెను. అనుకొనని యీ దారుణ సంఘటనకు దేవ దానవులలో నిరుత్సాహము కలిగెను. మథన కార్యము ప్రారంభించినపుడు విఘ్నేశ్వరుని పూజించక ఉపేక్షించుటచేత, యిటువంటిదేదో జరుగగలదని నారాయణు డూహించెను. నారాయణుడు సముద్రములో నీటి అడుగునకు వెళ్ళి ఘనమైన కూర్మ (తాబేలు) రూపము ధరించి, తన వీపుపై మందర పర్వతమును మోసెను. మందర పర్వతము తిరిగి పైకి లేచుట చూచి దేవ దానవులు హర్షములో గంతులు వేయసాగిరి. మందర పర్వతము క్రిందికి యెట్లు పోయెనో, తిరిగి అది పైకి యెట్లు లేచెనో అది కొద్దిమంది మాత్రమే యెరుగుదురు. నారాయణుడు మందర పర్వత శిఖరమునకు వెళ్ళి తన సహస్ర బాహువులతో ఆ పర్వతమును స్థిరముగా, తిన్నగా నుండునట్లు సరిచేసెను. అతడు దేవదానవుల హృదయములలో ప్రవేశించి వారికి ఉత్సాహమును కలిగించెను. మథించుచున్న దేవ దానవుల ఉత్సాహమునకు భగవంతుడు కారకుడు; వాసుకి సర్పములోని అవిద్య, అలసత్వములకు కారకుడు భగవంతుడు. మందర పర్వతముపై నున్నది సహస్ర బాహువులు కలిగిన నారాయణుడు, పర్వతము క్రింద నున్నది ఘనమైన కూర్మము (నారాయణుని అవతారము). అసుర స్వభావము, దైవిక స్వభావము, మందర పర్వతము యొక్క స్థిర స్వభావము — అన్నియు ఆ నారాయణుడే. అతడు ఇచ్చటా, అచ్చటా, అంతటా వ్యాపించి యున్నాడు.

మథనము సాగుచుండెను. క్రమక్రమముగా తీవ్రత హెచ్చుచుండెను. ఇరుప్రక్కల నుండి అతిశక్తివంతముగా లాగుటచేత, వాసుకి భరించలేకుండెను. సర్పము నోటి నుండి అగ్ని, విషవాయువులు చిమ్మెను. తలను పట్టుకున్న అసురులకు యిది బాధాకరమయ్యెను. కాని వారు యేమియు చేయలేకపోయిరి.

ఆ విషవాయువులు వలన అందరకూ శ్వాస ఆడక యిబ్బంది కలుగుట చూచిన నారాయణునకు జాలి కలిగెను అనంత కరుణాసముద్రుడైన నారాయణుడు, వాతావరణము చల్లబడునట్లుగా వర్ష మేఘముల నాదేశించెను వర్షముపడి, సముద్రము నుండి వీచు శీతల వాయువులు వాతావరణమును చల్లబరచినవి తిరిగి మథనము కొనసాగెను

అమృతము లభించు సూచన లేవియు కన్పించుటలేదు మధించుచున్న దేవదానవులకు మరింత ఉత్సాహము కల్గించుటకు భగవంతుడు వారితో చేరి మధించుచుండెను నల్లని వర్షమేఘము బంగారు పట్టువలువ కప్పుకొన్నట్లుగా అతడు నిల్చుని యుండెను. నారాయణుడు వారితో కలిసి మధించునపుడు, అతని చెవులకు చేప ఆకారములో నున్న తాటంకములు కనిపించుచూ మెరుగివుచూ, మెరుపు తీగవలె మెరయుచుండెను అలసటలో తలమీది వెంట్రుకలు ముఖముపై పడునపుడు, వాటిని తిరిగి తల ఆడించి వెనుకకు నెట్టు చుండెను. అతని కంఠములో నున్న హారము అటు యిటు ఊగుచుండెను అలసట చేతి అతని కళ్ళు యెరుపెక్కెను ఈలోకమునకు ఆశ్రయమైన అతని బాహువులు, మధించుట తప్ప యింక యితర కార్యమేదియూ లేనట్లు క్రిందకూ మీదకూ ఊగుచుండెను అతనిని వీక్షించిన వారికి అత్యద్భుత ముగా, సముద్రతీరమున మరియొక పర్వతము తేజస్సుతో ప్రకాశించుచున్నట్లు గోచరించెను

సముద్రములోని నీరు, మథించుటకు ప్రయోగించిన ఓషధుల రసముతో నిండి, పాలవలె తెల్లగా నుండెను అమృతము లభించు జాడలు కన్పించకుండెను నిరాశ పొందుచున్న దేవదానవుల నుత్సాహపరచుటకు భగవంతుడు మథము కొనసాగించుచుండెను

మథనము కొనసాగుచుండెను సముద్రములోని చేపలు, తిమింగిలములు మున్నగునవి నిర్దాక్షిణ్యముగా అటు యిటు చెల్లాచెదరై పోవుచుండెను. సాగర మథనము కొనసాగుచునే యుండెను

91 కాలకూటము

వారట్లు మథనము గావించుచుండగా, సముద్ర ఉపరితలముపై యేదో పైకెగయుచున్నట్లు గోచరించెను. వారు దానిని పూర్తిగా గాంచక మునుపే, వారికి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యెను. అది హాలాహల మను భయంకర విషము నారాయణు డిదివరకే దేవతలను యీ విషయమున హెచ్చరించి యుండెను కాని వారు ఊహించిన దానికంటె యీ హాలాహలమను విషము భయంకరముగా నుండెను ఆ విషము అంతటా ప్రసరించెను ఆ విషము తీవ్రతకు వాతావరణమంతయు కలుషితమయ్యెను ఎవ్వరునూ దాని తీవ్రతను భరించలేకుండిరి. వాసుకిని పట్టుకున్న దేవదానవులు, ఆ సర్పమును వదలిపెట్టి అతివేగముతో దూరముగా పారిపోయిరి. కాని ఆ విషవాయువులు వారి ననుసరించెను. దేవతలు మహాదేవుని పాదములపైబడి అతనిని ప్రార్థించి యిట్లనిరి. ''మహాదేవా! నీవు సర్వ దేవతలకు దైవము లోక రక్షకుడవు ఈ విషము మాకు భయభ్రాంతులను కల్గించుచున్నది. మమ్ములను రక్షించవలెను'' తనను వేడుకొనుచున్న దేవతలను జూచి మహాదేవుడు కరుణాభరితుడయ్యెను.

తన భార్యవైపు జూచి అతడిట్లనెను "సముద్రము నుండి ఆవిర్భవించిన యీ భయంకర కాలకూట విషము బారినుండి రక్షింపమని నన్ను ప్రార్థించుచున్న యీ దేవదానవులను చూడుము నన్ను విశ్వసించిన వారిని రక్షించుట నా ప్రధమ కర్తవ్యము కాబట్టి నేను యీ విషమును మ్రింగి, నన్ను ప్రార్థించుచున్న వీరిని రక్షించెదను" లోకమాత చిరునవ్వుతో తన ఆమోదమును తెలిపెను మహాదేవుడు కాలకూట విషమును తన చేతిలో తీసుకుని మ్రింగెను ఆ విషము మహాదేవుని కంఠములో ప్రవేశించి, అప్పటి నుండి అచ్చటనే యుండెను అందుమూలముగా అతని తెల్లని కంఠము నీల వర్ణము దాల్చెను. అయితే నీలవర్ణము దాల్చిన కంఠము అతని సౌందర్యము ఇనుమడింపజేసెను. ఒక నల్లని మణిని కంఠమున ధరించి నట్లుండెను సత్పురుషులు బాధలను తాము స్వీకరించి, వారికి బాధా విప్పత్తి గావింతురు ఈ విధముగా మానవులు భగవంతుని చర్యలను అనుకరించినచో, యీ లోకమును సృష్టించిన ఆదిపురుషుడైన ఆ నారాయణుడికి యింతకన్న ప్రీతికరమైనది వేరొకటి ఉండదు.

కాలకూట విషమును మ్రింగినపుడు, ఒకే ఒక్క చుక్క మహాదేవుని చేతి నుండి జారి నేలపై పడెను దానిని సర్పములు, వృశ్చికములు, యితర విషకీటకములు, కొన్ని లతలు గ్రహించెను ఈ విషమును గ్రహించిన లతలను విష వృక్షములుగా పరిగణించుటచే, వానిని తేనెటీగలు, పక్షులు, జంతువులు పరిహరించెను

92 లక్ష్మీదేవి ఆవిర్భవించుట

మహాదేవుడు కాలకూట విషమును స్వీకరించిన తర్వాత, దేవదానవులు తిరిగి సాగరమధనము సాగించిరి అట్లు చేయుచుండగా కామధేనువను గోవు సముద్రము నుండి ఆవిర్భవించెను వేదశాస్త్రములు, వైదిక కర్మలందు నిమగ్నమైన ఋషులు, హవిస్సును సమకూర్చుకొనుటకు (గోవుపాలు, వెన్న నుండి దీనిని చేయుదురు) యీ గోవు తోడుపడునని తలంచిరి యజ్ఞములలో హవిస్సును అగ్నిదేవుకి నిరంతరముగా సమర్పించెదరు

అటు తర్వాత కుంద పుష్పమువలె నున్న తెల్లని గుర్రము — ఉచ్చైశ్శ్రవము — ఆవిర్భవించెను. ఈ గుర్రమును బలిచక్రవర్తి కోరెను నారాయణుని సలహాను ఇంద్రుడు జ్ఞప్తికి తెచ్చుకుని ఆ గుర్రమును బలిచక్రవర్తికి వదలిపెట్టెను అటు పిమ్మట ఆ సాగరము నుండి మహాదేవుని నివాసమైన కైలాసముతో సరి సమానమైన, బ్రహ్మాండమైన తెల్లని ఏనుగు ఆవిర్భవించెను దానికి వు ఐరావతమనే ఆ యేనుగును ఇంద్రుడు గైకొనెను తర్వాత అతి సుందరమైన, పద్మము రంగులో నున్న కౌస్తుభ మణి లభించెను దానిని ఆభరణముగా ధరించెదనని నారాయణుడు స్వీకరించెను. పిమ్మట పారిజాత వృక్షము, ఆ వృక్షముతోబాటు అందమైన అనేకమంది వనితలు వచ్చిరి. ఆ వనితలు అందమైన వస్త్రములు ధరించిరి వారు కంఠము నందు బంగారు హారములు, చే ధరించి యుండిరి వారి నడక తీరు అత్యంత రమణీయముగా నుండెను హావభావములు దేవతలకు ప్రీతి కలిగించెను వారు అప్సరసలు వారిని, పారిజాత వృక్షమును ఇంద్రుడు చేబట్టెను అసురులకు వీనిపై అపేక్ష లేకుండుటచే, దేవతలు వానిని తీసుకొనిరి

మెరుపుచేత సుధామమను కొండ ప్రకాశించినట్లు, సముద్రము నుండి అతి లావణ్యమైన లక్ష్మి రూపము

ఆవిర్భవించెను దేవదానవులందరూ ఆమెను కోరిరి ఆమెనుండి వారు దృక్కులను మరల్చలేకపోయిరి ఆమె ఆసీనురాలగుటకు సింహాసనము తెచ్చుటకై ఇంద్రుడు త్వరత్వరగా వెళ్ళెను నదులు రూపము ధరించి బంగారు పాత్రలలో ఆమె కొరకు జలము తీసుకువచ్చెను భూమాత లక్ష్మీదేవి అభ్యంగనమునకు కావలసిన పవిత్ర మూలికలను తెచ్చెను గోవులు పాలను పిదికెను వసంతుడు, చైత్రవైశాఖములందు మాత్రమే పుష్పించు పుష్పములను తెచ్చెను ఋషులు ఆమె చేత పవిత్ర స్నానము నాచరింపజేయగా, గంధర్వులు ఆమెను కీర్తించుచు గానముచేసిరి గంధర్వ వనితలు ఆమె యెదుట నాట్యము చేయగా, మేఘములు సంగీతమును వర్షించెను. దిక్కులను గాచుచున్న దిగ్గజములనే యేనుగులు తమ తొండములతో నీరు తెచ్చి ఆమె నభిషేకించెను సముద్రుడు ఆమె ధరించుటకు పట్టు వస్త్రములను తెచ్చెను వైజయంతి యను హారమును వరుణుడు తీసుకువచ్చెను ఆ హారమును తుమ్మెదలు చుట్టుముట్టెను విశ్వకర్మ అద్భుతముగా పొదిగిన మణులను తెచ్చెను సరస్వతీదేవి ముత్యాలహారమును యిచ్చెను బ్రహ్మ పద్మమును, నాగలోకవాసులు చెవుల తాటంకములను తెచ్చి యిచ్చిరి లక్ష్మీదేవి చేతిలో పద్మములతో కూర్చిన హారమును పట్టుకుని పెదవులపై సిగ్గుతో కూడిన హాసము చిందగా, వారందరి మధ్య సంచరించెను

తన భర్తను యెన్నుకొనుటకు చుట్టూ పరికించి చూచెను యక్షులు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, దేవతలు అచ్చట నుండిరి అసురులందరు అచ్చట నుండిరి కాని వారిలో నెవరినీ ఆమె అంగీకరించలేదు అచట నున్న ఋషులను గాంచి ''వారు తపస్సంపన్నులయినప్పటికీ, ఆగ్రహమును జయించలేదు. బృహస్పతి, ...లయిననూ, వారికి వైరాగ్యము గురించి తెలియదు. చంద్రుడు యువకుడు, సౌందర్యవంతుడు కాని అతడు కామ తృష్ణను జయింపలేకుండెను ఇంద్రుడు స్వర్గమునకు అధిపతి అయినప్పటికీ, కోరికలను జయించలేకుండెను ప్రతిఒక్కరిలో యేదో ఒక లోపము స్పష్టముగా కానవచ్చుచుండెను నారాయణుడు తప్ప, యితరులెవరూ దోషరహితులు కారు అతడు సర్వసంపూర్ణుడు అందుచే అతడు నన్ను కోరడు'' త్రిగుణములైన సత్త్వరజస్తమో గుణముల కతీతుడు, అందరివలె యెట్టి ప్రలోభములకు లోనుగానివాడు, వీచే వాయువులకు తబ్బిబ్బు చెందక ప్రశాంత సరస్సువలె నున్న నారాయణుని ఆమె గాంచెను ఆమె నారాయణుని వద్దకు నడచి, ఆమె చేతిలోని పద్మహారమును అతని మెడలో వైచి, ప్రక్కనే నిలుచుండెను భగవంతు డామెను స్వీకరించి, తన వక్షస్థలముపై నుంచెను. ఆ పవిత్ర దంపతులు పిడుగుతో కూడిన మెరుపువలె అత్యంత వైభవముతో ప్రకాశించిరి

సాగర మథనము తిరిగి కొనసాగెను ఇంతలో పద్మములవంటి నేత్రములు కల్గిన ఒక అందమైన యువతి ఆవిర్భవించెను. ఆమె పేరు వారుణి, చాల ఆనందము కల్గించునది, బాగా మత్తు నిచ్చే ద్రవము అసురులు ఆమెను తీసుకొనిరి

93 అమృతము లభించుట

మథనము సాగుచుండెను సముద్రము నుండి ఒక దివ్యరూపము ఉన్నట్లుండి ఆవిర్భవించెను అతడు నల్లగా పొడవైన బలము కలిగిన బాహువులతో నుండెను ఆ యువకుని మెడలో ఒక హారము గలదు అతని

వక్షస్థలము చాల విశాలముగను, శక్తిమంతమైనదిగా గోచరించెను విలువైన మణులతో పొదిగిన బంగారు ఆభరణములు అతడు ధరించియుండెను. పసుపు పచ్చని వస్త్రము ధరించిన ఆ యువకుని మణులను ధరించిన చేతులు ఒక బంగారు పాత్రను పట్టుకొని యుండెను. అతడు నారాయణుని అవతారమైన ధన్వంతరి దేవదానవులు తన కార్యము సమాప్తమైనదని గ్రహించిరి బంగారు పాత్రయందు పవిత్రమైన అమృతముండెను అసురులు వాసుకిని వదలిపెట్టి త్వరత్వరగా ధన్వంతరి వద్దకు వచ్చిరి అతని చేతుల నుండి ఆ పాత్రను అసురులు లాగికొని అక్కడ నుండి పారిపోయిరి. అనుకొనని యీ సంఘటనను చూచి దేవతలు నిశ్చేష్టులైరి వారు నారాయణుని పాదములపై పడగా, అతడు చిరునవ్వు నవ్వి యిట్లనెను ''అమృతము మీ కొక్కరికే దక్కునని యిదివరకే చెప్పినాను మీ చింతలను నాకు వదలిపెట్టుడు'' అసురుల వింత చర్యలను అతడు గమనించుచుండెను

అమృతమును యెవరు మొదట రుచి చూడవలెనను విషయముపై అసురులలో తీవ్ర వాదోపవాదములు సాగెను. వారిలో ధర్మశీలురైన అసురులు కొందరు యిట్లనిరి ''ఈ మథనము ఒక యజ్ఞము వలె సాగినది దేవతలతో కలిసి మనము యీ కార్యమును నిర్వహించితిమి అమృతములో వారి భాగము వారి కిచ్చుట సమంజసము'' కాని బంగారు పాత్రను చుట్టుముట్టిన అసురులెవరును యీ మాటలను వినిపించుకొనలేదు కొద్దిసేపట్లో సముద్ర తీరమునకు దూరముగాపోయి, అమృతమును మొదట యెవరు రుచి చూడవలెనను విషయముపై వాదించుకొనుచుండిరి

ఒక్కసారిగా నిశ్శబ్దమావరించెను ఇంతవరకూ కొనసాగిన తీవ్ర వాగ్వాదన ఒక్కసారిగా స్తంభించిపోయెను అందరి కన్నులు యెదుట వచ్చుచున్న వ్యక్తిపై పడెను ఆ వ్యక్తి ఒక స్త్రీ ఆమె అత్యంత సౌందర్యముతో నున్నది ఇదివర కెన్నడును అంతటి సౌందర్యవతిని వారు చూచి యుండలేదు ఆమె ముఖములోని ఆకర్షణ, సౌందర్యము, యిదివరకెన్నడునూ చూడనిది ఆమె నేత్రముల వంటి నేత్రములను వారింతకు ముందు చూచియుండలేదు ఆమె నేత్రములు, చిక్కని నీలిరంగు పద్మములవలె నుండెను ఆమె లావణ్యము అవయవ సౌందర్యము తీర్చిదిద్దినట్లుండెను ఆ అసురులు ఆమె నుండి దృక్కులను మరల్చుకొనలేకపోయిరి

వారు ఆమెను సమీపించి, చుట్టును మూగి ప్రశ్నల వర్షము కురిపించిరి

''నీవు యెవరో మాకు చెప్పవలెను నీ నేత్రములు పద్మముల కంటె అందముగా నున్నవి నీ చిరునవ్వు మమ్ములను ముగ్ధులను చేయుచున్నది నీవు యేది అడిగిన అది చేయుటకు సిద్ధము మేము కశ్యపుని పుత్రులము, అసురులము ఈ బంగారు పాత్రలోని అమృతము కొరకు మేము పోట్లాడుకొనుచుంటిమి దీనిని నీవు తీసుకొనుము ఎవరు దీనిని ముందుగా రుచి చూడవలెనను నిర్ణయము నీకు వదలి పెట్టుచున్నాము బయట నుండి వచ్చిన నీవు నిష్పక్షపాతముగా నుండగలవు. నీకు తోచిన విధముగా యీ అమృతము పంచిపెట్టుము''

దేవతలకు లాభము చేకూర్చుటకై నారాయణుడు మోహిని అవతారము ధరించెను. ఆమె చిరునవ్వు వారికి మిక్కిలి హర్షదాయకముగా నుండగా, వారితో ఆమె యిట్లనెను. ''కశ్యప పుత్రులారా! మీకు అపరిచితురాలనైన నమ్మకము కుదిరెను? నేను స్త్రీని, నా చూపులు నున్నట్లు తోచుచున్నది పురుషులలో కామ ప్రవృత్తిని కల్గించే స్త్రీలను నమ్మకూడదని బుద్ధిమంతు లెరుగుదురని జ్ఞానులు చెప్పుదురు ఆ విధముగా నమ్ముట తోడేలును నమ్ముట వంటిది''

దానిని యెట్లు యెదుర్కొనవలెనో వారికి తెలియకుండెను భక్త సంరక్షణమే ప్రథమ కర్తవ్యముగా యెంచు శ్రీమన్నారాయణుడు అచట అవతరించెను అతని సమక్షములో బలి చక్రవర్తి మాయ ఆయుధములు నిష్ప్రయోజనము అయ్యెను భగవంతుని గూర్చిన చింత మాయను పారద్రోలగలదు అటువంటపుడు భగవంతుని సమక్షములో మాయ యెట్లు నిలువగలదు? మెలకువ కల్గినంతనే స్వప్న లోకము కరగిపోయినట్లు మాయ పటాపంచలగును

కాని బలి వెనుదిరుగకుండెను. అనేక ఆయుధములతో నారాయణునిపై దాడి చేసెను బలి అనుయాయుడైన కాలనేమి ఒక పొడుగైన ఆయుధమును నారాయణునిపై విసరగా, దానిని పట్టుకుని తిరిగి కాలనేమివైపు విసరెను ఆ తీవ్రతకు కాలనేమి మృతి చెందెను. భగవంతుని సుదర్శన చక్రముచే మాలి, సుమాలి హతులైరి

ఇంద్రుడు బలి చక్రవర్తిని ద్వంద్వ యుద్ధమున కాహ్వానించెను. అతిడిట్లనెను ''ఓరి మూర్ఖుడా! మాంత్రికుని వలె మాయ పన్నాగములు అవలంబించినావు నీ శక్తులు యెంత నిష్ప్రయోజనములో గాంచలేవా? ఇదిగో చూడుము ఈ వజ్రాయుధముతో నీ తలను వేయి ముక్కలు చేయుదును. నీ మరణమునకు సిద్ధపడుము''

బలి ఇంద్రుని చూచి చిరునవ్వు నవ్వి మంద్ర స్వరముతో యిట్లనెను. ''యుద్ధము చేయుటకు పూనుకొనిన వారు, కాలప్రేరితులై తమ కర్మఫలానుసారియైన, ఒక ప్రత్యేకమైన కార్యాచరణ పద్ధతి నవలంబించెదరు జరుగబోవు దానిని నిర్ణయించుట వారి చేతులలో లేదు. అట్టివారికి విజయముగాని, పరాజయముగాని సంభవించుట తప్పదు. అట్లు జరుగటయే న్యాయము అట్లు జరిగినపుడు యిది కాల నిర్ణయమని జ్ఞానవంతులు భావించి, సమదృష్టితో, అనగా సంతోషించుటగాని విచారించుటగాని లేక యుందురు అటువంటి జ్ఞాన సంపద నీకు సంప్రాప్తించలేదని తెలియును. విజయము, కీర్తిని అనుభవించు దేహమును ఆత్మయని పొరపాటుగా భావించు నీకు నిరంతర విచారము, అసంతృప్తి తప్పవు మూర్ఖుడవైన నీవు, నీ పరుష వాక్కులతో బాధింపగలనని తలపోయుచున్నావు. కాని ఆ మాటలను మేము లక్ష్యపెట్టుటలేదు వానిని నీచాతి నీచముగా పరిగణించెదము''.

బలి చక్రవర్తి నిష్ఠుర వాక్కులకు ఇంద్రుని క్రోధము అవధులను దాటెను అవి సత్యములగుటచేత ప్రతి ఒక్కమాట ఇంద్రునికి బాధను కల్గించి అతని కోపమును ద్విగుణీకృతపరచెను ఇంద్రుడు వజ్రాయుధమును బలిపై ప్రయోగింపగా, బలి నేలపై బడెను. బలి స్నేహితులు వచ్చి ఆ ప్రదేశము నుండి బలిని తీసుకుపోయిరి. కొన్ని క్షణముల తర్వాత తిరిగి వచ్చి ద్వంద్వ యుద్ధము కొనసాగించెను వారిరువురి మధ్య తీవ్రముగా జరుగుచున్నపోరు ఒక క్షణమైనను సడలక సాగుచుండెను.

నముచి మహాశక్తిమంతుడైన రాక్షసుడు. అతడు శక్తిమంతమగు అస్త్రములను ప్రయోగించి ఇంద్రునిపై దాడిచేసెను. వారు చాల కాలము పోరాడిరి నముచి అనుయాయులు చాలమంది మరణించగా, వారిరువురి మధ్య జరుగుచున్న పోరాటము తీవ్రరూపము దాల్చెను ఇంద్రుడు వజ్రాయుధమును నముచిపై విసరెను. అది శత్రువు చర్మపు పై పొరను కూడ అంటకుండుట జూచి ఇంద్రుడు నిశ్చేష్టుడయ్యెను. వృత్రాసురుని సంహరించిన వజ్రాయుధము నముచికి యెటువంటి హాని కలిగించక తిరిగి వెనుకకు వచ్చెను. ఇంద్రుడు ఆలోచనలో మునిగెను. దధీచి యెముకలతో విశ్వకర్మ మలచిన యీ వజ్రాయుధము, వృత్రాసురుని ప్రాణములను హరించిన యీ వజ్రాయుధము, పర్వత పంక్తుల రెక్కలను త్రుంచివేసిన యీ వజ్రాయుధము

యిప్పుడు శక్తిని కోల్పోయెను. ఇది యెట్లు జరిగెను? ఎక్కడ నుండియో అశరీరవాణి స్వరము విన్పించెను అది యిట్లున్నది ''నముచి అనే అసురుడు ఒక వరమును పొంది యున్నాడు ఆ వరము వలన అతడు యెండిన వస్తువులచేత గాని, తడిసిన వస్తువులచేతగాని మరణములేక యుండును ఈ వరమును బ్రహ్మ ప్రసాదించెను దీనిని ఉల్లంఘించు మార్గము నొకదానిని నీవు కనుగొనవలసి యున్నది'' ఇంద్రుడు కొంచెముసేపు ఆలోచనలో పడెను అతని కనులు సముద్రతీరమున వచ్చు అలలపై నిలిచెను. అలల నుండి ఉత్పన్నమయే నురుగును చూడగా అతనికొక ఆలోచన స్ఫురించెను ఇందు తనకు వినియోగించు ఆయుధము కలదని భావించెను ''సముద్రము అలల నుండి వచ్చు నురుగు యెండినది, తడిసినది కాదు. అందుచే యిది ప్రస్తుత ప్రయోజనము కుపకరించును''. అని ఇంద్రుడు తలచెను. చేతినిండుగా నురుగును తీసుకుని నముచి ముఖముపై విసరెను వెంటనే నముచి నేల గూలెను.

ఇంద్రుడు సాధించిన యీ ఘనకార్యమునకు స్వర్గమునుండి పుష్పవర్షము గురిసెను.

దేవదానవ సంగ్రామము కొనసాగునా యనిపించెను ఇంతలో బ్రహ్మ పుత్రుడు నారదుడు అచటికి వచ్చి, వారితో యిట్లనెను ''మీరు అమృతము కోరిరి నారాయణుని ఆశ్రయించిన మీరు అతని అనుగ్రహముచేత అమృతము పొందిరి. నారాయణుని సతీమణి లక్ష్మీదేవి మీ పక్షమున నున్నది ఈ యుద్ధము విరమించి మీ స్వస్థలమునకు వెళ్ళిరండు'' దేవతలు అందుకంగీకరించిరి. అయితే అసురులు కూడ అంగీకరించవలసి యున్నది ప్రస్తుతము అదృష్టము వారిపక్షమున లేదని తెలుసుకొనిరి. తలలు వ్రేలవైచుకొని, వారి వారి గృహములకేగిరి

95 బలిచక్రవర్తి

బలిచక్రవర్తి సంపదను, కీర్తిని ఇంద్రుని మూలముగా పోగొట్టుకొనెను విశాల హృదయుడగు యుద్ధములో పరాజయము కలిగినందుకు విచారించకుండెను. తన జీవితమునకు భృగుమహర్షి కారకులు బలి ఉత్తమ జీవి తనకొరకై అతడు విచారించుటలేదు. ప్రస్తుత దుఃఖస్థితికి తన నిందించుకుని కాలము వ్యర్థము గావించలేదు

అతని గురువైన శుక్రాచార్యుని వద్దకు వెళ్ళి శరణుజొచ్చెను. బలి శుక్రునితో యిట్లనెను ''ప్ర మీరు నాకు గురువులు, రక్షకులు మీరు యేది చెప్పిన అది చేయుటకు సిద్ధముగా నున్నాను. నేను వాడను నన్ను మీ యిచ్ఛవచ్చినట్లు నియోగించుకొనవచ్చును క్లిష్టపరిస్థితులలో సహాయము కోరివచ్చి శిష్యుని యే గురువు వదిలిపెట్టడని నే నెరుగుదును''

బలి హృదయములో నున్న కోరికను శుక్రాచార్యుడు కనిపెట్టెను. స్వర్గమును జయించవలెనన్నదే అతని కోరిక దానిని ముందుగా ఊహించిన శుక్రాచార్యుడు బలికి మహాభిషేకము చేసి యిట్లనెను. ''నీ కొరకు మేము ఒక యజ్ఞము జరిపెదము అది నీ కోరికను తీర్చగలదు'' బలిచక్రవర్తిని శక్తిమంతుని జేసి ఇంద్రుని ఓడించి స్వర్గమును జయించునట్లు చేయుటకు శుక్రాచార్యుడు నిశ్చయించుకొనెను బలి విశ్వజిత్తు అను యజ్ఞమును జరుపుటకు అన్ని సన్నాహములు జేసెను. పవిత్ర హవిస్సుతో అగ్నిని పూజించి, మంత్రోచ్చార

ఘము గావించిరి. ఇది చాలసేపు కొనసాగెను. హోమగుండము నుండి ఎర్రగా ప్రకాశించే బంగారు రథమొకటి ఆవిర్భవించెను. గుర్రములు ఇంద్రుని గుర్రముల వలెనున్నవి. రథమునకు సింహముతో నలంకరించిన జెండాకట్టి యుండెను. రథములోపల ధనుస్సు అంచులు బంగారముతో తీర్చిదిద్దియున్నవి. దానితో బాటు యెప్పుడూ నిండుగా నుండే అమ్ములపొది, దివ్యకవచము కూడ గలవు. హోమగుండము నుండి రథము ఆవిర్భవించిన తర్వాత బ్రహ్మ బలివద్దకు వచ్చి — యెన్నడూ వాడనటువంటి పుష్పహారము నొకదానిని తెచ్చి యిచ్చెను. గురువు శుక్రాచార్యుడు బలికి ఒక శంఖము నిచ్చెను. ఈ మహాకార్యము జరుగుటకు కారకులైన వారందరికీ బలి ప్రదక్షిణము చేసి నమస్కరించెను.

బలిచక్రవర్తికి చెడు దినములు అంతము కాగా ఇదివరకు వలె అతడు నిబ్బరముగా నుండెను. నూతనముగా సంక్రమించిన శక్తిచేత, యింతకు పూర్వము కన్న యిప్పుడు అతనిలో కళాకాంతులు పెరిగి వైభవము యినుమడించెను. పెద్దసైన్యము సమకూర్చుకుని ఇంద్రుని నగరము వైపు వెడలెను. దివ్యకవచమును ధరించి అమ్ములపొదిని భుజమునకు తగిలించి, బంగారపు అంచులతో నున్న ధనుస్సును చేతబట్టి, బంగారు రథము నం దాసీనుడయ్యెను. అతని శక్తిమంతమైన బాహువులకు ధరించిన బంగారు భుజకీర్తులు తళతళ మెరయు చుండగా, చెవులకు ధరించిన పచ్చలతో పొదిగిన కుండలములు ప్రకాశించుచూ, బలిచక్రవర్తి 'ఆహవనీయ' మను అగ్నివలె గోచరించెను. అతని ననుసరించిన సేనలు, చూచినవారి హృదయములో భయమును కల్గించెను.

తన వెంట సేన రాగా, బంగారు రథమున ఆసీనుడైన బలి ఇంద్రుని అమరావతీ నగరమునకు ప్రయాణించెను.

అమరావతి అత్యంత సుందరమైన నగరముగా పేరు గాంచెను. స్వర్గాధిపతియైన ఇంద్రుని సుఖసంతోషము లకు అది నిలయము. స్వర్గవాసులకు సుఖసంతోషములను కల్గించు అందమైన వస్తువులన్నియు అచ్చట కలవు. అచట అనేక తోటలు ఫలపుష్పలతా వృక్షములతో నిండియుండెను. తుమ్మెదలు, పక్షులు చేయు సంగీతము యెల్లప్పుడూ వినవచ్చుచుండెను.

నగరము చుట్టూ లోతైన కందకము గలదు. నగరము లోపల నున్న కోట దానిని రక్షించుచున్నది. బంగారు వెండి అంచులతో మెరయుచున్న గృహద్వారములు నగరమునకు శోభను కూర్చుచున్నవి. అమరావతి నగర నిర్మాణమునకు విశ్వకర్మ ప్రత్యేకమైన శ్రద్ధ వహించి దానిని అందముగా తీర్చిదిద్దెను. ఆ నగరమందు యెట్టి దోషములను లేవు. వీధులు వెడల్పుగా పరిశుద్ధముగా నుండెను. అచట నివసించు స్త్రీల కొప్పులనుండి జారిపడిన పువ్వులు ఆ వీధులందు గోచరించుచుండెను. అచట ముసలితనమనే పదమునకు తావు లేదు. అసహ్యకరమైన దేదియు కానరాదు. సంగీతము, సువాసనలు, అందము, ఒకటేల అన్నియు అతి దివ్యముగా నుండి, మానవుని మనస్సు ఊహించ గలిగినవన్నియు ఆ అమరావతి నగరమున లభ్యమగుచుం డెను.

ఇంద్రుని, అతని సేనను ఓడించి అమరావతి నగరమును జయించవలెనను తలంపుతో బలిచక్రవర్తి ఆ నగరమువైపు వెళ్ళెను. అమరావతీపుర ద్వారములు సమీపించినంతనే, బలి శంఖమును గట్టిగా ఊదెను. ఇంద్రుడు బలిని చూచెను. అతని బంగారు రథమును, దివ్యకవచమును, ధనస్సును, అమ్ములపొదిని గాంచెను. అతని వెంటనున్న పెద్ద సైన్యమును కూడ ఇంద్రుడు చూచెను. బలితో యుద్ధము చేసినచో కలుగు పరిణామమెట్లుండునో ఇంద్రుడు తొందరగానే ఊహించగలిగెను. త్వరగా గురువైన బృహస్పతి కడకేగి యిట్లనెను. ''గురుదేవా! మన పురాతన శత్రువు తిరిగి యుద్ధమునకు సిద్ధపడినాడు. అతనిని యిప్పుడు

ఓడించుట సాధ్యముకాదని తోచుచున్నది. అతడు అంత శక్తిమంతుడెట్లయ్యెను? అతడెట్లు అజేయుడయ్యెను? అతడు శారీరికముగా, నీతి పద్ధతిని, అధ్యాత్మికముగా మహాశక్తిమంతుడు. అగ్నివలె ప్రకాశించు అతనికీ ప్రకాశమెట్లు కలిగెను? నాకు యిదంతయు చిత్రముగా నున్నది''.

బృహస్పతి యిట్లనెను. ''అతని గురువు మూలముగా బలి మహాశక్తిమంతుడయ్యెను. ఒకప్పుడు దిగజారుచున్న అతని శక్తిసామర్థ్యములను, శుక్రాచార్యుడు యినుమడింపజేసెను. నిజముగా యోచించిన, బలి ధాటికి నారాయణుడు తప్ప యింకెవ్వరు నిలువలేరు. నీవు యిప్పుడు వివేకముతో విశ్లేషణ సలిపి తగిన చర్యలు తీసుకోవలెను. ప్రస్తుతము నీవు బలిని ప్రతిఘటించుట వట్టి మూర్ఖత్వము. అది నిష్ప్రయోజనమగును. కాలము నీకు ప్రతికూలముగా నున్నది. ఇప్పుడు నీవు, యితరదేవతలు అమరావతి నగరము విడిచి వెళ్ళుటయే ఉత్తమమైనది. మీరు విడిచి వెళ్ళిన తర్వాత యీ నగరమును బలి స్వాధీనము చేసుకొనును. కొలది కాలములో, యే గురువు (శుక్రుడు) కారణముగా బలి మహాశక్తిమంతుడయ్యెనో, ఆ గురువు ఆగ్రహమునకు గురియై తన శక్తిసామర్థ్యములను కోల్పోవును. ప్రస్తుత పరిస్థితులలో, మీరందరూ యీ నగరము విడిచి పారిపోవుటయే శ్రేయస్కరము''.

ఇంద్రుడు తీరని దెబ్బతిన్నవానివలె గోచరించెను. ''అమరావతిని వదలి పారిపోవుటయా! అత్యంత ప్రియమైన యీ నగరమును నా శత్రువు చేతులో యెట్లు వదలగలను? కాదు, నేను యుద్ధము చేసెదను. ఏమి జరిగిననూ సరే. మేము శక్తి హీనులము కాము. మేము దేవతలము. బలి కేవలము ఒక అసురుడు. నేను అమరావతిని విడిచిపెట్టను''.

అమరావతిని వదలిపెట్టుటయే శ్రేయస్కరమని బృహస్పతి ఇంద్రునకు నచ్చజెప్పెను. లేకున్న దేవతలకు అనవసరముగా తీవ్రకష్టములు కామాంధులైన అసురులచే కలుగగలవని చెప్పెను. చివరకు ఇంద్రుడు గురువు సలహా ననుసరించి, యితర దేవతలతో కలిసి అమరావతి నగరము విడిచి పారిపోయెను.

యుద్ధము చేయవలసిన అవసరము లేకుండ, అమరావతి నగరము స్వాధీనమైనదని బలి తలపోసెను. దేవతల అధైర్యమును చూచి యేవగింపుతో నవ్వెను. బలి అమరావతి నగరమున స్థిరపడి, స్వర్గమున యీలోకము నేలుచుండెను. ముల్లోకములకు అతడు ప్రభువయ్యెను. ఇంక జయించవలసినదేదియు అ‌. లేకుండెను. అశ్వమేధయాగము జరుపమని గురువు శుక్రాచార్యుడు బలితో చెప్పెను. బలి చక్రవర్తి నూ. అశ్వమేధయాగములను జరిపెను. చంద్రుని వెన్నెల ప్రసరించినట్లు, బలిచక్రవర్తి కీర్తి లోకమంతటా వ్యాపించెను. అతని మంచితనము, ఔదార్యము, అనేకమైన యితర సద్గుణములు లోకములో అందరకూ తెలిసెను.

96 వామనావతారము

ఇంద్రుని, అతని సోదరులను బలి సునాయసముగా జయించుటచేత, ఇంద్రునితల్లి అదితి, విచారముతో నుండెను. ఒకప్పుడు కశ్యపుడు, ఆశ్రమము విడచివెళ్ళి చాలకాలము తీవ్రతపస్సు చేసి సమాధిలో నుండెను. తపస్సు సమాప్తమైన తర్వాత తిరిగి ఆశ్రమమునకు వచ్చెను. తిరిగి వచ్చిన భర్తకు అదితి తగిన మర్యాదలు చేసి అతని ప్రక్క మౌనముగా నిలుచుండెను. అతడు వాడిపోయిన ఆమె ముఖమును గాంచెను. అతడామె

నిట్లడిగెను. ''నీ ఆందోళనకు కారణమేమిటి? నీవు సంతోషముగా లేకుండుట గమనించినాను. నీకు యేమైన ఉపద్రవము సంభవించెనా? లేక యీ లోకమున కేదైన కీడు వాటిల్లెనా? మానవులు అధర్మపరులైతిరా? అనాలోచితముగా వచ్చిన అతిథుల నవమాన పరచగా వారు నీ ఆతిథ్యము స్వీకరించక వెళ్లిపోయినారా? ఏమి జరిగినది? కుమారులందరూ క్షేమమేగదా? నిన్ను చూడగా యేదో తీరని బాధతో సతమతమగుచున్నట్లు ఉన్నావు. అది యేమిటో నాకు చెప్పుము''.

అదితి యింతవరకు దించియున్న కనులను పైకెత్తెను. ఆమెకండ్లు అశ్రువులతో నిండి యుండెను. ఆమె భర్తతో యిట్లనెను. ''నాథా! నీవు భయపడినంత ప్రమాదమేమియూ జరుగలేదు. ఈ ఆశ్రమమునకు యెట్టికీడు వాటిల్లలేదు. నా మట్టుకు నేను యెట్టి అధర్మకార్యమును చేయలేదు. నా పిల్లలకు గల్గిన దుస్థితి నన్ను తీవ్రముగా బాధించుచున్నది. బలిచక్రవర్తి నా కుమారులకు బాధ కలిగించెను. అసురులు దేవతలను అమరావతీ నగరము నుండి తరిమివేసి వారి కీర్తిని, ధనసంపదలను దోచుకొనిరి. నన్ను, నా పుత్రుల యందు కరుణ చూపి, యీ ఉపద్రవము నుండి బయటపడుటకు సహాయము చేయవలెను''.

కశ్యప ప్రజాపతి మందహాసము చేయుచూ సరళముగా ఆమెతో నిట్లనెను. ''భగవంతుని మాయ అతి విచిత్రమైనది. ఈ లోకమంతయు అనురాగ బద్ధమై యున్నది. అదియే అత్యద్భుతమైన విష్ణుమాయ. లేకున్న, పంచభూతములతో యేర్పడిన యీ శరీరమునకు, ప్రకృతికి భిన్నమైన ఆత్మకు యేమి సంబంధము? ఎవరు యెవరికి భర్త యెవరు యెవరికి పుత్రుడు? మాయ చేతనే 'నేను', 'నాది' అని తలంచుట జరుగుచున్నది. నేను తల్లిని, వీరు నాపుత్రులు. వారు విచారముగా నుండుటచేత నేను విచారముగా నున్నాను''. ఒక క్షణమాగి, తిరిగి ఆమెను చూచి యిట్లనెను. ''అందరి హృదయములలో నివసించు నారాయణుని పూజించుట ఒక్కటే నీవు యిప్పుడు చేయవలసినది. అతనిని భక్తితో ప్రేమించి పూజించు వారలను కరుణించి, వారి కోర్కెలను తీర్చును. అతనిని ప్రార్థించి పూజింపుము''. ఆమె కశ్యపునితో యిట్లనెను. ''నేను స్త్రీని. భగవంతుని పూజించు విధానములు నాకు తెలియవు. అనేకులు మహాపురుషులు భగవంతునికి ప్రీతి కలిగించుటకు సంవత్సరముల తరబడి తపస్సు చేయుచున్నారు. నేనొక స్త్రీని. ఆ విధముగా నేనెట్లు చేయగలను? అమాయకులైన నావంటివారు భగవంతుని అనుగ్రహము పొందుటకు సులభమైన మార్గము నొకదానిని సూచించుము''.

కశ్యపుడిట్లు చెప్పెను. ''పయోవ్రతమనునది ఒకటి గలదు. ఒకప్పుడు బ్రహ్మ నాకీ వ్రతమును జెప్పెను. ఫాల్గుణమాస శుక్లపక్షమున పాడ్యమి మొదలు ద్వాదశి వరకు పండ్రెండు దినములు, పగలు రాత్రి నారాయణుని పూజించవలెను. పాలు మాత్రమే నీవు ఆహారముగా తీసుకొనవలెను. ద్వాదశాక్షరమైన యీ మంత్రము — ఓం నమో భగవతే వాసుదేవాయ — నుచ్చరించుచూ పూజించవలెను. భక్తిశ్రద్ధలతో నీవు యీ వ్రతమును ఆచరించిన, భగవంతుడు నీ కోర్కెను తప్పక తీర్చగలడు''.

అదితి పయోవ్రతము నాచరించెను. ఆమె మనస్సు స్థిరముగా నుండి ఇంద్రియములు అదుపులో నుండెను. ఆమె ఆలోచనలను భగవత్పాదములపై కేంద్రీకరించెను. పండ్రెండు రోజుల తర్వాత నారాయణుడు ఆమెకు ప్రత్యక్షమయ్యెను. ఆమెలేచి నిలుచుండెను. పదేపదే నారాయణుని పాదములకు ఆమె ప్రణమిల్లి, చేతులు జోడించి నిలబడి యుండగా ఆమె కనుల నుండి కన్నీరు యేకధారగా కారుచుండెను. ఒక్కమాటయైననూ మాట్లాడలేక పోయెను. కొంతసేపయిన తర్వాత తడబడిన అస్పష్టమైన మాటలు ఆమె పెదవుల నుండి

వచ్చుచుండెను. ''నిన్నెట్లు కీర్తించవలెనో, నీ గుణముల నెట్లు వర్ణించవలెనో నాకు తెలియదు. నేను అమాయకురాలిని. నాకు చదువుగాని, నీ గొప్పతనము గ్రహించు తెలివి తేటలుగాని లేవు. నీవు దయామయుడవు, కరుణామయుడవు. ఇంతమాత్రమే నాకు తెలుసును. ప్రభూ! నేను మీ బానిసను. నేను బాధతో సతమతమగుచున్నాను. నన్ను కరుణింపుడు''.

పద్మములవంటి నేత్రములతో తన ప్రసన్న దృక్కులను ఆమెపై బరపి నారాయణుడిట్లనెను. ''దేవమాతా! నీ బాధను నేను అర్థము చేసుకొనగలను. నీ పుత్రులు అసురుల దయాదాక్షిణ్యములపై ఆధారపడి యున్నారు. నీ పుత్రులు తిరిగి పూర్వపు ఔన్నత్యమును పొందగా చూడవలెనని నీవు కోరుచున్నావు. అది నాకు తెలుసును. ఇది కొద్దిరోజుల తర్వాత సమసిపోవును. అంతవరకు నీవు వేచి యుండవలెను. అందుకు యింకా సమయము రాలేదు. ప్రస్తుతము బలి తారాబలము ఉచ్చస్థితిలో నున్నది. ఇందుకు కారణము శుక్రాచార్యుడు అతని శిష్యులు బలికి గురువులు అగుట. శుక్రుని గొప్పదనము చేత, అతని శిష్యుడైన బలికి యెట్టి ఆపదయు కలుగబోదు.

''అయినప్పటికీ నీవు చేసిన వ్రతము నాకు సంతోషము కల్గించినది. నీవు కోరు వరమును నేను ప్రసాదించెదను. నేను నీకు కుమారుడుగా జన్మించి, నీ పుత్రులకు సహాయము చేసెదను. నా జన్మ దేవరహస్యమగుట చేత యీ విషయమును నీవు యెవ్వరికీ తెలుపకూడదు''. అటు తర్వాత నారాయణుడు అదృశ్యుడయ్యెను. కశ్యపుడు, తన యోగశక్తిచేత జరుగబోవు దానిని తెలుసుకొనెను. అతని భార్య సంతోషముగా నుండుటచేత, అతడు కూడ సంతోషభరితుడయ్యెను.

అదితికి ఒక కుమారుడు జన్మించెను. పుట్టిన శిశువును చూచిన అదితికి, అతడు నారాయణ రూపములో నున్నట్లు గోచరించెను. ఇదివరకు ప్రత్యక్షమై మాట యిచ్చిన ప్రకారము, తానే ఆమెకు కుమారుడుగా జన్మించినట్లు రూఢి పరచుటకా యన్నట్లు ఆ బాలుడు నారాయణ రూపము ధరించెను. కొన్ని క్షణముల తర్వాత సాధారణ శిశువు రూపము ధరించి, ముల్లోకములకు ఆనందము చేకూర్చెను. దేవతలందరు చాల సంతోషించిరి. భగవంతుడు యీ భూమిపై అడుగుపెట్టుట వలన భూదేవి వింతకాంతులతో విలసిల్లుచుండెను. సరస్సులలోని నీరు నిర్మలముగా నుండెను. ఆకాశము అద్భుతమైన నీలి రంగుతో ప్రకాశించెను. అన్ని ఋతువులు ఒకేసారి ప్రవేశించెను. అన్ని ఋతువులలో పుష్పించే పుష్పములు విరబూసి, పరిమళ వాయువులతో వాతావరణము ఆహ్లాదకరముగా నుండెను.

అది భాద్రపదమాస శుక్లపక్ష ద్వాదశి. అభిజిత్తు నక్షత్రమున ఆ బాలుడు జన్మించెను. తర్వాత రోజులలో భాద్రపదమాస శుక్లపక్ష ద్వాదశి విజయ ద్వాదశిగా ప్రసిద్ధికెక్కెను.

ఆ శిశువు పెరిగి బాలుడుగా యెదిగెను. కాని అతడు పొట్టిగా వామనుడై నుండెను. అతనికి తగిన వయస్సులో ఉపనయనము జరిగెను. గాయత్రి మంత్రమును సూర్యు డుపదేశించెను. దేవగురువు బృహస్పతి పవిత్రమైన యజ్ఞోపవీతము నివ్వగా, తండ్రి కశ్యపుడు మౌంజిని యిచ్చెను. భూదేవి కృష్ణాజినము (లేడి చర్మము) నిచ్చెను. చంద్రుడు బ్రహ్మ దండము నిచ్చెను. తల్లి అదితి కౌపీనమును, దేవలోకవాసులు ఛత్రమును యిచ్చిరి. వేదములను తనలో యిముడ్చుకున్న బ్రహ్మ కమండలము నివ్వగా, సప్తర్షులు కుశఘాసముల నిచ్చిరి. సరస్వతి అక్షమాలను యిచ్చెను. కుబేరుడు భిక్షాపాత్రను యిచ్చెను. మహాదేవుని సతి పార్వతి, అన్నపూర్ణగా ఆ బాలునికి మొట్టమొదటి భిక్షను ప్రసాదించెను. వామనుని మరొకపేరు ఉపేంద్రుడు.

97 బలిచక్రవర్తి యజ్ఞము

పవిత్రభూమియైన భృగుకచ్ఛపై అసుర చక్రవర్తి బలి, శుక్రాచార్యుడు భృగువంశీయుల పర్యవేక్షణలో అశ్వమేధయాగము జరుపుచుండెను. యాగమును చూచుటకు వామనుడు వెళ్ళ నిశ్చయించుకొనెను. పవిత్ర నర్మదానది ఉత్తర తీరమున భృగుకచ్ఛ యున్నది.

యాగము సాగుచుండెను. ఇంతలో ఒక గొప్ప వెలుగు యెక్కడి నుండియో వచ్చుచున్నట్లుండెను. అక్కడ చేరిన వారు చుట్టూ పరికించి చూడగా, దివ్యమైన ఆ వెలుగు తమవైపుగా వచ్చుచున్నట్లుండెను. అది చూచి వారు తమలో తాము యిట్లు మాట్లాడుకొనిరి. ''ఉదయించు సూర్యుడు యీ భూమిపై నడచి మన దిక్కుగా వచ్చుచున్నట్లు గోచరించుచున్నది''. వారందరు యెదురుగా వచ్చుచున్న పొట్టి బ్రాహ్మణ బాలుని జూచిరి. ఆ బాలుని ఒక చేతిలో కమండలము, రెండవ చేతిలో ఛత్రము నున్నవి. ''సూర్యుడు యీ పొట్టి బాలుని రూపము ధరించి యీ యాగమును తిలకించుటకు వచ్చుచున్నాడా? అగ్నిదేవుడు ఆశీర్వదించుటకు వచ్చుచున్నాడా? లేక బ్రహ్మపుత్రుడైన సనత్కుమారుడు, ఈ యాగశాలను పునీతము గావించుటకు స్వయముగా వచ్చెనా?'' అని వారు తలపోసిరి.

ఆ బాలుడు యెవరైనదీ వారట్లు ఊహించుచుండగా, వామనుడు యజ్ఞశాలలో ప్రవేశించెను. ఆ బాలుని జానెడు వక్షస్థలము మౌంజితో కప్పబడి యుండెను. ఆ వక్షస్థలముపై నున్న యజ్ఞోపవీతము మెరపు తీగవలె ప్రకాశించుచుండెను. ఆకర్షణీయమైన జటముడి తలపై అందముగా కానవచ్చుచుండెను. ఒకచేతి యందు కమండలమును, మరొక చేతితో ఛత్రమును ధరించి, ఆ పొట్టి బ్రాహ్మణ బాలుడు అక్కడ నిలుచుండెను. అక్కడ చేరిన వారందరు ఒక్కసారిగా లేచి నిలబడిరి. ఆ బాలుని వైభవము అంత గొప్పగా నుండెను. బలి ఆ బాలుని చెంతకు వచ్చి, అతని పాదములకు ప్రణమిల్లి, ఉత్తమాసనముపై కూర్చుండబెట్టి గౌరవించెను. ఆ బాలుని చిరుపాదములను పవిత్ర జలముతో కడిగి, ఆ జలమును తన శిరస్సుపై జల్లుకొనెను. బలి ఆ బాలునితో యిట్లనెను. ''కుమారా! నీకు స్వాగతము. నీవెవరో నాకు తెలియదు. కాని నన్ను, యీ యజ్ఞశాలను ఆశీర్వదించుటకు వచ్చినావని మాత్రము యెరుగుదును. బ్రహ్మర్షుల తపస్సంతయు మూర్తీభవించినట్లు నీవు నాకు గోచరించుచున్నావు. నీ రాక చేత నేను, నా పూర్వులు తరించిరి. నీ దర్శనము చేత నా జీవితము పరిశుద్ధమయ్యెను. నీ పాదములను ప్రక్షాళన చేసి ఆ జలమును నా శిరస్సుపై జల్లుకొనుటవలన నా పాపములన్నియు తుడుచుకొనిపోయి, నేను జరుపుచున్న యీ అశ్వమేధ యాగము ఫలించెను. ప్రభూ! నేను నీకేమి చేయగలనో సెలవియ్యవలెను. నీవంటి ఉత్తమ జీవులు భక్తులు కోరు వరములను అనుగ్రహించెదరు. ఇది బ్రాహ్మణుల ప్రత్యేకత, దానిని నెరవేర్చుట మహాద్భాగ్యము. తనకు కావలసినది కోరుచు బ్రాహ్మణుడు అనుగ్రహించుచున్నాడు. ఆ కోరికను ప్రసాదించుచూ క్షత్రియుడు అనుగ్రహ పాత్రుడగుచున్నాడు. నీకు యేది కావలెనో కోరుకొనుము. నీకు యీ భూమి కావలెనా? లేక బంగారమా? లేక గృహములా? నీకు అందమైన పరిచారికలను యిత్తునా, లేక ఏనుగులు, గుర్రములు, ఆవులు కావలెనా? నన్ను ఆజ్ఞాపించి, నేను యిచ్చు దానమును స్వీకరించి నన్ను గౌరవింపవలెను''.

పొట్టి బ్రాహ్మణ బాలుడు నవ్వి మధురముగా బలితో నిట్లు పలికెను. ''నీవు వినయపూరితముగా, ఉదార

స్వభావముతో, ధర్మబద్ధముగా పలుకుట యెంతో సమంజసముగా నున్నది. నీవు అట్లు పలుకుటలో ఆశ్చర్యము యెంత మాత్రము లేదు. గొప్పవారైన శుక్రాచార్యులు, భృగువు నీకు గురువులు. నీ పూర్వులలో పితామహుడైన ప్రహ్లాదుడు గొప్ప భక్తుడు. నీ తండ్రి విరోచనుడు గొప్ప దాతగా ప్రసిద్ధిగాంచెను. నీ కుటుంబములో యాచించిన వారి కోర్కెలను తిరస్కరించిన వారెవరూ జన్మించి యుండలేదు. భిక్షకై వచ్చిన వారిని యింతవరకు యెవరూ నిరాకరించలేదు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొనక ఉపసంహరించుకున్న సంఘటనలు కూడను లేవు. నీ పూర్వులలో ఒకడైన హిరణ్యాక్షునకు ఒకే ఒక ఆయుధము ఉండెను. అది గద, దానితో ముల్లోకములను అతడు జయించెను. అయినప్పటికీ అతనితో సరిసమానముగా పోరగల శక్తిమంతులు లభ్యముకాలేదని విచారించుచుండెడివాడు. నారాయణుడు వరాహరూపము ధరించినపుడు, హిరణ్యాక్షుడు అతనితో యుద్ధమునకు తలపడెను. రసాతలము నుండి భూమిని పైకి తెచ్చుచుండగా, హిరణ్యాక్షు డడ్డగించెను. వరాహునితో పోరాడి, అతనిచే హిరణ్యాక్షుడు సంహరింపబడెను. కాని ఆ భగవంతునకు యిది సంతోషమును కలిగించలేదు. హిరణ్యాక్షుని శక్తిని అతడెప్పుడూ తలంచుచూ, తాను విజయుడనని భావింపకుండెను. ఆ తర్వాత యేమి జరిగెను?

''తన సోదరుడు విహతుడయ్యెనని తెలిసిన హిరణ్యకశిపుడు నారాయణుని చంపుటకు వైకుంఠమునకు వెళ్ళెను. త్రిశూలమును చేతిలో యెత్తిన హిరణ్యకశిపుని చూచి, నారాయణుడు తనలో తానిట్లనుకొనెను. 'నేను యెక్కడకు వెళ్ళిన అక్కడకు నన్ను యీ హిరణ్యకశిపుడు వెంబడించును. మరియు నేను నివసించు ప్రదేశముల నన్నింటినీ ధ్వంసము గావించును. అతని దృష్టి, మనస్సు, ఆలోచనలు బాహ్య ప్రపంచము నందుండుటచేత, నేను అతనిలో ప్రవేశించితిని. ఆ విధముగా అతను శ్వాస పీల్చునపుడు, భగవంతుడు అణువులలో అణువుగా మారి, అతనిలో ప్రవేశించెను. భగవంతుని పై ప్రేమ కన్న ద్వేషము మిక్కుటముగా నుండెను. ప్రతిక్షణము భగవంతుని ద్వేషించుచూ చింతించుట చేత చివరకు భగవంతుని చేతులలో మృతి చెందెను.

''ఇక నీ తండ్రి విరోచనునికి సాటియైన దానశీలురు గలరా? ఒకప్పుడు దేవతలు బ్రాహ్మణ రూపము ధరించి యాచకులుగా వచ్చిరి. వారు దేవతలని తెలిసినప్పటికీ, వారు కోరగా తన ప్రాణమునే ధారపోసెను. అతడు తన జీవితములో యెవరు యేది అడిగిననూ నిరాకరింపకూడదను సూత్రము పాటించెను. అటువంటి ఉత్తమ కుటుంబములో జన్మించిన నీవు ధర్మబద్ధుడవుగా నుండుటలో ఆశ్చర్యమేమున్నది? తప్పక నిన్ను నేను వరమడిగెదను. నీవు దానిని ప్రసాదించగలవని నేనెరుగుదును. నాకు మూడడుగులు భూమి మాత్రమే కావలెను; నా పాదములతో కొలిచెదను''.

వామనుని మాటలు వినిన బలి అచ్చెరువొంది ఒక క్షణకాలము మాట్లాడలేక పోయెను. తరువాత వికసించిన నవ్వు మోముతో యిట్లనెను. ''నీవు నిజముగా అమాయిక బాలుడివి. నీవు పలికిన జ్ఞానదాయకమైన పలుకులు జ్ఞానులకు మిక్కిలి సంతోషము చేకూర్చును. అయినప్పటికీ నీవు యింకా పసి బాలుడుగా నుండుట నాకు కొంత భయమును కలిగించుచున్నది. ఏది మంచిదో నీకు తెలియక పోవుట వలన నీ ప్రవర్తన కూడ అమాయిక బాలురు ప్రవర్తించు తీరులో నున్నది. ఏది నీకు మంచిదో, లాభదాయకమో తెలియని అజ్ఞానివలె నున్నావు. నన్ను చూడుము. నేను యీ ముల్లోకములకూ ప్రభువును. నీ మాటల నేర్పుతో నాకు ఆనందము కలిగించితివి. ద్వీపములు, బంగారురాసులు అడుగక, కేవలము మూడు అడుగుల భూమిని, అదియూ నీ చిరుపాదములతో కొలిచే మూడే మూడు పాదముల భూమిని కోరుచున్నావు! నేను నీకు యిచ్చిన తర్వాత, యికముందెప్పుడు

యింకేదియు నీవు కోరవలసిన అవసరముండదు. నీ మాటలను మార్చుకుని యింకా యెక్కువ భూమిని తీసుకొని జీవితమంతయు సుఖముగా నుండుము. నీవు అడుగుటయే తడవుగా నేనిచ్చెదను''.

వామనుడిట్లనెను. ''నీ ఔదార్యమును నేను మెచ్చుకొనుచున్నాను. ఓ రాజా! కోరికను జయించని మానవుడు, లోకములోని సకల వస్తువులు యిచ్చిననూ అతనికి సంతృప్తి యుండదు. మూడు అడుగులతో తృప్తిపడని మానవుడు, సప్తద్వీపములు, అందలి సంపద అతనికి ధారపోసిననూ తృప్తిచెందడు. సప్తద్వీపములను పాలించు ప్రభువులు 'నాకు యిది చాలును' అను స్థితిని చేరుకొనలేదని అందురు. తనకు లభించిన దానితో సంతృప్తి పడువాడే నిజముగా సుఖము ననుభవించును. చంచల మనస్కులు యెప్పుడూ అసంతృప్తితో దుఃఖముతో బాధపడుదురు. అసంతృప్తియే మానవుని దుఃఖమునకు కారణము. సంతృప్తి పొందిన మానవుని ముఖము రోజు రోజుకూ వికసించి, విముక్తి పొందుటకు అర్హత కలిగియుండును. నీవు దానశీలురలో అగ్రగణ్యుడవు. నీవు దాన సామ్రాట్టువి. కాబట్టి నేను కోరిన నా పాదములతో కొలిచే మూడడుగుల భూమిని నీవు ప్రసాదించ గోరెదను''.

తిరిగి బలి నవ్వెను. నవ్వుచు యధాలాపముగా యిట్లనెను. ''అటులనే కానిమ్ము. నీ చిరు పాదములతో కొలిచిన మూడడుగుల భూమిని ప్రసాదించెదను''. వామనరూపములో నున్న భగవంతుని చిరు పాదపద్మము లను బలి వీక్షించెను.

పెదవులపై నవ్వు లాస్యము చేయుచుండగా, జలముతో నిండిన పాత్రను తీసుకుని, అందులో కొన్ని బిందువులను పద్మములవంటి ఆ బాలుని చేతిలోవైచి, ''నీవు కోరిన దానిని నేను నీకిచ్చుచున్నాను'' అని బలి పలికెను.

98 శుక్రుని అభ్యంతరము

గురువు శుక్రాచార్యుడు అడ్డుపడెను. మాట్లాడక బలి తన కనులను పైకెత్తి ప్రశ్నార్థకముగా చూచెను. శుక్రుడు జ్ఞానులలో కెల్ల జ్ఞాని. అతడు 'కవి'యను పేరుతో ప్రసిద్ధిపొందెను. ఇంద్రుని గురువు బృహస్పతి కన్న తెలివికలవాడని కొందరు అందురు. శుక్రునకు దైత్యులపై మక్కువ, బలి అతని ప్రియశిష్యుడు. అతడు బలి మోసపోవుట సహింపకుండెను. రాజును దయతో జూచి యిట్లనెను. ''కుమారా! నీవు యేమి చేయుచు న్నావో నీకు తెలియదు. ఈ చిన్నారి బ్రాహ్మణ బాలుడు అమాయకుడని, తనకేది మంచియో, లాభదాయకమో తెలియని పసివాడని నీవు భ్రమపడుచున్నావు. కాని ఆ బాలుడు సాక్షాత్తు నారాయణుడు. దేవతలకు ఉపకారము చేయనెంచి, అదితి కశ్యపులకు జన్మించెను. నీ హృదయము వెన్నవంటిది. ఈ బాలునికి దుడుకుగా వరమును ప్రసాదించెదనని మాట నిచ్చియున్నావు. ఆ వరము తేలికైనది కాదు. అది నిన్ను, అసురజాతిని నాశనము చేయునని నాకు తెలుసును. ఇది అన్యాయముతో కూడి యున్నది. నీవు యీ అన్యాయమునకు లోబడి బాధపడకూడదని నా తలంపు.

''నీ ముందర నిలిచియున్న నారాయణుడు, నీవు యీ సంపద నంతయూ పోగొట్టుకొనునట్లు చేయనున్నాడు. నీ సర్వస్వమునూ కోల్పోయెదవు. నీ అధికారము, వైభవము దేవతలు, నారాయణుని

సహాయముతో చేజిక్కించుకొందురు నీవు వట్టి తెలివితక్కువ వాడవు. నీ సర్వస్వము పోగొట్టుకున్న తర్వాత, నీవెక్కడ జీవించెదవు? నీకు నిలబడుటకు కావలసిన స్థలము కూడ యుండదు. ఈ పసిబాలుడు, తన చిరు పాద పద్మములతో కొలుచు మూడడుగుల భూమిని కోరినాడు భగవంతుని ఒక్క పాదము యీ భూమి నంతయూ కొలుచునని నీకు తెలియదా? రెండవసారి తన పాదముతో దేవలోకమును కొలుచును. మూడవసారి పాదము నెక్కడ మోపును? తన పాదమును నీ తలపై మోపి పాతాళమునకు అణగద్రొక్కునని నీవు గ్రహించలేవా? ఈ కోర్కెను నీవు తీర్చలేకపోవుట సమంజసముగానే యుండును. నీ ఆందోళనకు కారణము నేనెరుగుదును ఇచ్చిన మాటను ఉపసంహరించుకొనుట దర్మవిరుద్ధమని నీవు తలంచి బాధపడుచున్నావు. ఋగ్వేదములో ఈ విషయమున విపులమైన చర్చ యున్నది. దానిని నీకు విశదపరచి తెల్పెదను.

'' 'నేను యిచ్చెదను' అని పలుకుట సత్యము పలుకుట యగును అట్లు పలికిన తర్వాత 'నేను యివ్వను' అని పలికినచో అది అసత్యము పలికినట్లగును సత్యము పుష్పము వంటిది మాట ఆ వృక్షము యిచ్చు పండు వంటిది సత్యము పలుకువారు సత్పురుషులుగా ప్రసిద్ధిగాంచెదరు అట్టివారు, అందమైన పుష్పములను తియ్యని ఫలములను యిచ్చు వృక్షములవంటి వారు

''అసత్యము మాటల వెనుక నున్న వేరులను పెల్లగించును. పెల్లగిలిన వృక్షము వేరులు, సామాన్య మానవులు తమ సహజమైన కనులతో చూడగలిగే వేరులు, యెండిపోయి త్వరలోనే నేలగూలును అదే రీతిగా అసత్యము పలుకు మానవుడు ఆత్మ విహీనుడై, త్వరలోనే శరీరమును గోల్పోవును. అందుచేత మానవుడు అసత్యము పలుకరాదు. కాని, కొన్ని సమయములందు అసత్యము పలుకుట నిషిద్ధము కాదు వరము ప్రసాదించెదనని మాట యిచ్చినపుడు, ఆ వరము ప్రసాదించుటచేత తన శరీరమునకు హాని యేర్పడునపుడు, తన మాటను ఉపసంహరించుకుని వరమును యివ్వ నిరాకరించ వచ్చును. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అసత్యము పలుకుట నిషిద్ధము కాదు భార్య తన మాట వినునట్లు చేయుటకు, పరిహాసమాడునపుడు, వివాహ సమయములో పెండ్లి కుమార్తె లేక పెండ్లి కుమారుని గుణములను వర్ణించునపుడు, ప్రాణమునకు ముప్పు సంభవించినపుడు, గోవులకు బ్రాహ్మణులకు మంచి చేయునపుడు, అపాయములో నున్న వారిని రక్షించునపుడు అసత్యము పలుకవచ్చునని ఋగ్వేదమందు కలదు. నీవు యిచ్చిన వరముచేత వినాశము తప్పదని గ్రహించినపుడు యిచ్చిన మాటను ఉపసంహరించుకొనుటలో యెట్టి దోషము లేదు. నిన్ను యెట్టి పాపము అంటదు. ఇప్పుడు నీవు యిచ్చిన వరమును ఉపసంహరించుకొనుటయే శ్రేయస్కరము''.

గురువు పలికిన పలుకులను బలి శ్రద్ధతో వినియుండెను చాలసేపు నిశ్శబ్దముగా నుండి బలి యిట్లనెను. ''ప్రసాదించిన వరము తనకే ముప్పు కల్గించునపుడు, యిచ్చిన మాటను ఉపసంహరించుకుని వరమును నిరాకరించుటలో అసమంజసమేమియు లేదని చెప్పిన మీ వాదము సముచితముగా నున్నదని నమ్ముచున్నాను. కాని, గురువర్యా! నన్నొకసారి పరికింపుడు భౌతికమైన రక్షణయే ప్రధానమని భావించు సామాన్య మానవుల వంటి వాడను కాను నేను విరోచనుని కుమారుడను, ప్రహ్లాదునికి మనుమడను అట్టి ఉత్తమ వంశములో జన్మించిన నేను, మీరు చెప్పినట్లుగా నేనెట్లు ఆచరించగలను. అటువంటి ఆలోచనను ఒక క్షణమైనను రానీయదగునా? అది సిగ్గుచేటు కాదా? మీ సలహాను పాటించినచో, తన సంపదను విడనాడుట కిష్టపడని సామాన్య మానవులవలె ప్రవర్తించినట్లగును అసత్యము పలుకుట కన్న నికృష్టమైనది లేదని పదే పదే చెప్పెదురు ఇది తప్ప యింక ఎటువంటి ఘోర పాపము నైనను భరింతును. ఒక బ్రాహ్మణుని మోసగించుట వలన తీరని ప్రమాదము సంభవించగలదు నరకము, దారిద్ర్యము, దుఃఖము, పదవీచ్యుతి, మరణము, వీటి వలన

యింకేదియు నీవు కోరవలసిన అవసరముండదు. నీ మాటలను మార్చుకుని యింకా యెక్కువ భూమిని తీసుకొని జీవితమంతయు సుఖముగా నుండుము. నీవు అడుగుటయే తడవుగా నేనిచ్చెదను''.

వామనుడిట్లనెను. ''నీ ఔదార్యమును నేను మెచ్చుకొనుచున్నాను. ఓ రాజా! కోరికను జయించని మానవుడు, లోకములోని సకల వస్తువులు యిచ్చిననూ అతనికి సంతృప్తి యుండదు. మూడు అడుగులతో తృప్తిపడని మానవుడు, సప్తద్వీపములు, అందలి సంపద అతనికి ధారపోసిననూ తృప్తిచెందదు. సప్తద్వీపములను పాలించు ప్రభువులు 'నాకు యిది చాలును' అను స్థితిని చేరుకొనలేదని అందురు. తనకు లభించిన దానితో సంతృప్తి పడువాడే నిజముగా సుఖము ననుభవించును. చంచల మనస్కులు యెప్పుడూ అసంతృప్తితో దుఃఖముతో బాధపడుదురు. అసంతృప్తియే మానవుని దుఃఖమునకు కారణము. సంతృప్తి పొందిన మానవుని ముఖము రోజు రోజుకూ వికసించి, విముక్తి పొందుటకు అర్హత కలిగియుండును. నీవు దానశీలురలో అగ్రగణ్యుడవు. నీవు దాన సామ్రాట్టువి. కాబట్టి నేను కోరిన నా పాదముతో కొలిచే మూడడుగుల భూమిని నీవు ప్రసాదించ గోరెదను''.

తిరిగి బలి నవ్వెను. నవ్వుచు యధాలాపముగా యిట్లనెను. ''అటులనే కానిమ్ము. నీ చిరు పాదములతో కొలిచిన మూడడుగుల భూమిని ప్రసాదించెదను''. వామనరూపములో నున్న భగవంతుని చిరు పాదపద్మము లను బలి వీక్షించెను.

పెదవులపై నవ్వు లాస్యము చేయుచుండగా, జలముతో నిండిన పాత్రను తీసుకుని, అందులో కొన్ని బిందువులను పద్మములవంటి ఆ బాలుని చేతిలోవైచి, ''నీవు కోరిన దానిని నేను నీకిచ్చుచున్నాను'' అని బలి పలికెను.

98 శుక్రుని అభ్యంతరము

గురువు శుక్రాచార్యుడు అడ్డుపడెను. మాట్లాడక బలి తన కనులను పైకెత్తి ప్రశ్నార్థకముగా చూచెను. శుక్రుడు జ్ఞానులలో కెల్ల జ్ఞాని. అతడు 'కవి'యను పేరుతో ప్రసిద్ధిపొందెను. ఇంద్రుని గురువు బృహస్పతి కన్న తెలివికలవాడని కొందరు అందురు. శుక్రునకు దైత్యులపై మక్కువ, బలి అతని ప్రియశిష్యుడు. అతడు బలి మోసపోవుట సహింపకుండెను. రాజును దయతోజూచి యిట్లనెను. ''కుమారా! నీవు యేమి చేయుచు న్నావో నీకు తెలియదు. ఈ చిన్నారి బ్రాహ్మణ బాలుడు అమాయకుడని, తనకేది మంచియో, లాభదాయకమో తెలియని పసివాడని నీవు భ్రమపడుచున్నావు. కాని ఆ బాలుడు సాక్షాత్తు నారాయణుడు. దేవతలకు ఉపకారము చేయనెంచి, అదితి కశ్యపులకు జన్మించెను. నీ హృదయము వెన్నవంటిది. ఈ బాలునికి దుడుకుగా వరమును ప్రసాదించెదనని మాట నిచ్చియున్నావు. ఆ వరము తేలికైనది కాదు. అది నిన్ను, అసురజాతిని నాశనము చేయునని నాకు తెలుసును. ఇది అన్యాయముతో కూడి యున్నది. నీవు యీ అన్యాయమునకు లోబడి బాధపడకూడదని నా తలంపు.

''నీ ముందర నిలిచియున్న నారాయణుడు, నీవు యీ సంపద నంతయూ పోగొట్టుకొనునట్లు చేయనున్నాడు. నీ సర్వస్వముమూ కోల్పోయెదవు. నీ అధికారము, వైభవము దేవతలు, నారాయణుని

99 మూడడుగుల భూమి

దానము యిచ్చుట స్వీకరించుట జరిగెను. బలి కన్నులెత్తి వామనుని చూచెను. అతడట్లు చూచుచుండగనే పొట్టి బ్రాహ్మణ బాలుడు క్రమముగా పెరిగి బృహద్రూపము వహించెను. నారాయణుని విశ్వరూపమును గాంచుచున్న బలి కండ్ల నుండి ఆనందాశ్రువులు కారుచుండెను. విరాట్ పురుష రూపము దర్శించు మహద్భాగ్యము బలికి కలిగెను. పంచ మహాభూతములు, త్రిగుణములు, ఇంద్రియములు, చిత్తము, జీవులతో కూడిన యీ విశ్వమును చూచెను. భగవంతుని పాదముల వద్ద రసాతలమును, పాదముల చర్మమందు భూమిని, చూచెను. అతని మోకాళ్ళు పర్వతములు, పక్షులు; తొడలు వాయువులకు నిలయములు. బలి ప్రజాపతులను, అసురులను గాంచెను. భగవంతుని నాభి ఆకాశముగను, ఉదరమందు సప్త సముద్రములను చూచెను. వక్ష స్థలమున నక్షత్రములు ఒకచోట చేరి అందమైన హారమువలె నుండెను. విరాట్ పురుషుని హృదయమందు ధర్మము ప్రతిష్ఠితమై యుండుట బలి కనుగొనెను. వక్షముపై 'ఋత' అనగా ధర్మముతో కూడిన మధుర వచనములు ఉండెను. అచ్చటనే సత్యము కలదు. అతని మనస్సునందు చంద్రుడు, విశాల వక్షస్థలముపై పద్మమును చేతిలో ధరించిన లక్ష్మీదేవి యుండిరి. అతని గళమందు సామవేదము, పవిత్ర మంత్రములు, వివిధములైన స్వరములు నుండెను. భుజములందు ఇంద్రుని నాయకత్వములోని దేవతలు గలరు. అతని చెవులు దిక్కులు, శిరస్సు స్వర్గము. నేత్రములందు సూర్యుడు, నోటి యందు అగ్ని యుండిరి. నాలుక యందు వరుణుడు, గొంతులో వేదములు నుండెను. కనుబొమలందు విధి, కనురెప్పలు యెత్తినపుడు ఏహ్యా భావముతో కూడిన నవ్వును తిలకించెను. నుదుటి యందు రాత్రి, పగలు, క్రోధమును; అడుగు పెదవి యందు ఆశను బలి వీక్షించెను. అతని స్పర్శయే కామము; అవయముల సొంపు యజ్ఞము, నీడ మృత్యువు; నవ్వు మాయ. అతడి వెంద్రుకలే వృక్షములు, లతలు, పొదలు; నరములు నదులు. అతని బుద్ధి బ్రహ్మ. అతని శరీరము చరాచర వస్తువులు, దేవగణములు, ఋషులు, వేయేల అన్నింటికీ నిలయము.

బలి వద్ద నున్న అసుర సేవకులు భయాశ్చర్యముతో శుక్రాచార్యుడు ఊహించి చెప్పినట్లుగా జరుగుచున్న దని గ్రహించిరి. భగవంతుని విరాట్ రూపము, తేజస్సు చూచి భరించలేక మూర్ఛపోయిరి. మూర్ఛ నుండి తేరుకుని లేచిన తర్వాత, విరాట్ పురుషుని రూపముగాక నారాయణుని రూపము గాంచిరి. అతని సేవకులందరూ వైకుంఠము నుండి వచ్చిరి. భగవంతుని ఆయుధము లన్నియు నుండెను. వైభవోపేతమైన సుదర్శన చక్రము, శార్ఙమను ధనుస్సు, పాంచజన్యముగా పేరుగాంచిన శంఖము, కౌమోదకి యను గదను ధరించి యుండెను. అతని సేవకులు, భగవంతునికి ప్రీతిపాత్రుడైన సునందుని నాయకత్వములో నుండిరి.

భగవంతుడు కిరీటము ధరించి యుండెను. అందలి మణులు అత్యంత కాంతితో ప్రకాశించుచుండెను. అమోఘమైన బాహువులు భుజకీర్తులను ధరించెను. మకర కుండలములు తల ఆడించునపుడు అందముగా ఊగుచుండెను. కౌస్తుభమణి ధరించగా, వక్షముపై నున్న శ్రీవత్సమను చిహ్నము సొబగు ద్విగుణీకృతమ య్యెను. అతడు ధరించిన బంగారు వన్నెలోనున్న పచ్చని వస్త్రము గాలికి రెప రెపలాడుచుండెను. అతని ముఖమున అందమైన నవ్వు తాండవించెను.

భగవంతుని బృహద్రూపము స్వర్గమును సమీపించెను. నారాయణుడు ఒక అడుగుతో బలికి చెందిన ఈ భూమి నాక్రమించెను. అతని ఆకారము ఆకాశమంతయు నిండి, విశాల బాహువులు అన్ని దిక్కులకూ ప్రసరించెను. రెండవ అడుగునకు స్వర్గములో కొంత భాగము మాత్రమే కనుపించుచుండెను. తన పాదమునెత్తి

మహర్లోకము చేరి, అచట నుండి జనలోకము, సత్యలోకము, ద్యుర్లోకములను చేరెను. సత్యలోకము నందుండే బ్రహ్మ అమితోత్సాహముతో భగవంతుని పాదము వద్దకు వెళ్ళెను. పాదము గోళ్ళు చంద్రుని వెన్నెల వలె ప్రకాశించుచూ, సత్యలోక సౌందర్యమును యినుమడింపజేసెను. బ్రహ్మకు తోడుగా మరీచి మున్నగు ఋషులు, సనకసనందాదులు, యోగులు, వేదములు, వాటి శాఖలు వచ్చి, వారందరూ భగవంతుని పాదమును పూజించిరి. బ్రహ్మ, కమండలములోని నీటితో నారాయణుని పాదము నభిషేకించెను. నారాయణుని పాదముచే పునీతమైన ఆ నీరు ప్రవహించి మందాకినీ నదిగా ప్రసిద్ధికెక్కెను. ఆ నది ప్రవహించిన ప్రదేశములు శుద్ధియై పవిత్రములయ్యెను. మందాకిని భూమి మీదకు వచ్చిన తర్వాత గంగానదిగా ప్రసిద్ధిగాంచెను.

భగవంతుడు భూమిని, స్వర్గమును కొలిచెను. తిరిగి వామన రూపముతో నవ్వుచూ నిలబడెను. అసురులు, తమ యజమాని బలి సంపదనూ రాజ్యమునూ పోగొట్టుకొనుట గాంచిరి. వారు వామనునితో యుద్ధము చేయ నిశ్చయించుకొనిరి. వారు వామనుని ఓడించి, తిరిగి బలిని సింహాసనముపై కూర్చుండబెట్టవచ్చునని తలంచిరి. వారు తమ ఆయుధములను చేతబట్టి వామనుని రూపములో నున్న నారాయణునిపై కెగబడిరి. అంతకు ముందే అక్కడ నున్న నారాయణుని సేవకులు అసురులతో యుద్ధము చేయుటకు సిద్ధపడిరి. దీనినంతయూ గమనించిన బలి చక్రవర్తి తన సేవకులపై ఆగ్రహించెను. వారితో బలి యిట్లనెను. ''నా మాటలు విని యుద్ధము చేయు ఆలోచనను విరమింపుడు. కాలము మనకు అనుకూలము కాదు. అన్నింటిలో కాలము అతి ప్రధానమైనది. భగవంతుడు కాల స్వరూపుడు. అతని యిచ్ఛ ప్రకారమే సుఖ దుఃఖములు కలుగుచుండును. భగవంతుని ముందు మానవుడు నిస్సహాయుడు. ఒక సమయములో ఈ కాలము మన కనుకూలముగా నుండి, దేవతలకు అనుకూలముగా లేకుండెను. అప్పుడు మనము శక్తిమంతులము, వారు చాల బాధలకు లోనైరి. కాలమిపుడు పరిస్థితులను తారుమారు చేసెను. పెద్ద సేన కాని, మంత్రములుగాని, తపస్సుగాని కాల ప్రవాహమును అరికట్టలేవు. మనకు తిరిగి అదృష్ట కాలము వచ్చు వరకు వేచి యుండవలెను. అంతవరకు తెలివిగా నిగ్రహము కలిగి యుండవలెను. యుద్ధము చేయవద్దు, దాని వలన ప్రయోజనముండదు''.

భగవంతుని ప్రక్కనే గరుడుడు నిల్చుని యుండెను. యజమానివైపు ఒకసారి చూసి, వరుణ పాశముతో బలిని బంధించెను. ఇది జరిగినపుడు అన్నివైపుల నుండి హాహాకార ధ్వనులు వినవచ్చెను.

బలి తనలో తాను నవ్వుకొనెను. ఇట్లు యెందుకు జరిగెనో అతడు గ్రహించెను. 'నేను' 'నాది' అను రెండు మహా పాపములను తన హృదయము నుండి పారద్రోలుటకు నారాయణుడు ఉద్దేశించెనని బలి విశ్వసించెను. 'నాదైన యీ భూమి నంతయు నీ కొసంగెదను' అని పలికినపుడు, భగవంతుడు తనలో తాను నవ్వుకుని, అందులకు శిక్షింప నిశ్చయించుకొనెను. వామనుని వైపు బలి చూచెను. అతనిలో ప్రేమ, అనుగ్రహము గాంచి, తాను ఊహించినది సరికాదని తలంచెను. తనను అనుగ్రహించుటకే భగవంతుడు వచ్చెను. వరమడిగి తన సర్వస్వమునూ తీసుకుని, 'నాది' అను పాపమును కడిగివేసెను. శరణాగతి ద్వారా 'నేను' అను భావము విడనాడవచ్చునని లోకమునకు తెలియజెప్పుటకే, గరుడుని యీ వరుణ పాశముతో నన్ను బంధింపుమని భగవంతుడు చెప్పి యుండవచ్చును. భగవంతుని దయాగుణము బలి కనుల వెంట నీళ్ళు వచ్చునట్లు చేసెను. గరుడుడు వరుణ పాశముతో బంధించునపుడు, వినయముగా శిరస్సు వంచెను.

100 బలి మాట నిలబెట్టుకొనుట

బంధితుడైన బలి వంక నారాయణుడు చూచెను సత్యమును విడనాడకుండుటచే బలి సర్వస్వమును పోగొట్టుకొనెను నారాయణు డిట్లనెను. ''నీవు అసురులకు చక్రవర్తివి. నా పాదముంతో కొలిచే మూడడుగుల భూమిని యిచ్చుటకు మాట నిచ్చితివి. రెండడుగులను కొలిచి ఆక్రమించి, వాటిని నేను స్వంతము గావించుకొనుట నీవు చూసి యున్నావు. ఇంకొక అడుగు మిగిలి యున్నది. నా పాదము నెక్కడ నుంచుమందువు? చెప్పుము. మాట తప్పి, అసత్యము పలికినచో దానికి యెట్టి శిక్ష నొందవలెనో నీవు యెరుగుదువు నిన్ను పాతాళ లోకమునకు అణగద్రొక్క వలసివచ్చును. నీ గురువు యిదివరకే యీ విషయము నీకు చెప్పియున్నాడు''.

వామనుని మాటలు వినిన బలి బాధ చెందనూ లేదు, భయపడనూలేదు. బలి నవ్వుచూ యిట్లనెను. ''ప్రభూ! నా మాటలు అసత్యము కావని తలంతును నీ మూడవ అడుగునకు యింకనూ స్థలమున్నది నీ పాదమును నా తలపై పెట్టి నన్ననుగ్రహింపుము నాకు నరక మనిన భయము లేదు, గాని పాపాత్ముడ ననిపించుకొనుటకు భయముగా నున్నది. ఈ వరుణ పాశ బంధముల వలన నాకు భయము లేదు. దారిద్ర్యము, నిత్య దుఃఖము కూడ నాకు భయావహములు కావు. శిక్షితునకు, శిక్షించువాడు తల్లి, తండ్రి, సోదరుడు లేక శ్రేయోభిలాషివలె అత్యంత ప్రీతిపాత్రుడైనప్పుడు, అది నిజముగా అనుగ్రహమని యెంచెదము. లోక దృష్టిలో నా గర్వమునకు అహంకారమునకు నీవు శిక్ష విధించవలసి యున్నది. కాని నీవు నిజముగా నన్ను ఆశీర్వదించి అనుగ్రహించినావు. నీవు నా అంతర్నేత్రము - జ్ఞాన చక్షువు - తెరిచినావు రాక్షసులకు నీవు స్నేహితుడవేకాని శత్రువువు కాదు

''నా పితామహుడైన ప్రహ్లాదుడు నీకు మిక్కిలి ప్రేమ పాత్రుడు. అతడు తన తండ్రిచే విశేషముగా బాధలకు గురియైనపుడు, నీవూరకున్నావు. ఈ భౌతిక శరీరము పొందుచున్న బాధ నిజముగా ఒక లెక్కలోనిది కాదని అతనికి బాగుగా తెలియును ఈ శరీరము, సంపద, బంధువులు, స్నేహితులు, జ్ఞానమునకు ఆపద వాటిల్లినపుడు యెందుకూ కొరగానివని అతడెరుగును. అతడీ విషయములను ఒక క్షణమైనను యోచింపక, యెల్లకాలము నిన్ను, నీ పాద పద్మములనే చింతించుచుండెను. నేను కూడ అట్లే చేయుచున్నాను శ్రీ, అనగా సంపద మూలముగానే మానవుని గర్వము, అహంకారము కలుగుచున్నవి మనిషి గుడ్డివాడై, మరణముతో యీ శరీరము అంతమగుచున్నదనే సత్యమును విస్మరిస్తున్నాడు. ప్రభూ! ఇప్పుడు నీవు నాకేమి చేయుచున్నావు? నేను యీ సంపదకు దూరమగునట్లు చేసి, త్వరలోనే నిన్ను చేరుటకు అవకాశము కలిగించి అనుగ్రహించినావు. నేను చాల అదృష్టవంతుడను''.

ఆ క్షణములో, బలి పితామహుడైన ప్రహ్లాదుడు అచటకు వచ్చెను. అతడు నారాయణునికి పరమ భక్తుడగుటచే, బలి ప్రణామము చేయగోరెను. కాని వరుణపాశముచేత బద్ధుడగుట వలన అట్లు చేయలేకపో యెను. అశ్రువులతోనే స్వాగతము పలికి మానసికముగా పూజించెను. ప్రహ్లాదుడు నూటిగా వామనుని చెంతకు వెళ్ళి ప్రణమిల్లెను. తన అశ్రువులతో భగవంతుని పాదములకు అభిషేకము చేసెను బ్రహ్మ నారాయణుని వద్దకు వచ్చి యిట్లనెను. ''ఇంక యే మాత్రము వింధ్యావళికి దుఃఖము కలిగించవద్దు. ఈ పాశ బంధము నుండి బలిని విడిపించుము. అతడు తన సర్వస్వమును యిచ్చివేసెను. నిత్యము నిన్నే చింతించువారు, కేవలము పత్ర పుష్ప తోయములతో మాత్రమే నిన్ను పూజించుచున్నప్పటికీ, నీకు చాల దగ్గరగా నుందురని

చెప్పి యుండలేదా? బలి సర్వస్వమును నీకు అర్పించి, సంపూర్ణ శరణాగతుడయ్యెను. అతనికి నీవు ఉచిత ఫలము నందియ్యవలెను''.

నారాయణు డిట్లు పలికెను. ''ఒక వ్యక్తిని నాశనము గావించుటకు, అతనికి యీ లోకములో విశేషమైన సంపదను, అధికారమును ప్రసాదించెదను. అతడు వాని యందు తగుల్కొని, తన నిజ స్వభావమును విస్మరించును. నేను యెవరినైనా మాయ నుండి రక్షింపదలచుకున్నపుడు, వారి సంపదను తీసుకొందును. దోషములన్నిటిని పరిహరింపగా, అతడు నాలో లీనమగును. ఒకసారి నాచే రక్షితుడైన భక్తుడు నాశనము పొందడు.

''బలి యెన్నడూ మాట తప్పి సంచరించలేదు. అతడు మాయను జయించెను. అతడు సంపదను, అధికారమును, చక్రవర్తి పదవిని పోగొట్టుకుని మిక్కిలి వ్యధ నొందెను. వరుణ పాశముచే బద్ధుడైన బలిని చూచి అతని శత్రువులు నవ్వుచున్నారు. బంధువులందరూ అతనిని విడిచి వెళ్ళిపోయిరి. గురువు శపించెను. అయినప్పటికీ, అతడు ధర్మ పథమును విడువకుండుట మెచ్చుకోదగినది. నేను మాయ మాటలు పలుకగా, అతని గురువు వేదముల నుండి యెన్నో సత్యములను పలికి, అసత్యమును సత్యముగా యెంచవచ్చునని నమ్మింప బ్రయత్నించెను. కాని బలి వానిని వినకుండెను. దేవతలు అసూయచెందు స్థితిని బలి చేరుకొనెను. నా అనుగ్రహము పొందిన బలి, సావర్ణి మన్వంతరమందు ఇంద్రుడుగా నుండగలడు. అంతవరకు, నాకు ప్రియమైన సుతల మందు బలి యుండగలడు. నేను నీతోనే యుండి రక్షించుచుందును. ఎల్లపుడూ నీ చెంతనే యుండెదను. నీలోని అసుర గుణములు త్వరలోనే అంతరించి, సావర్ణిమన్వంతరమందు ఇంద్రుడుగా ప్రసిద్ధి గాంచెదవు''.

బలికి విశేషమైన ఆనందము కలిగి నోట మాట రాకుండెను. అతని కనులు యేకధారగా వర్షించుచుండెను. మాటలు గొంతులోనే ఉండిపోయి, కన్నీరుతో నిండుటచే బయటకు రాకుండెను. కొంతసేపయిన తర్వాత తనను తాను సముదాయించుకుని, యిట్లనెను. ''ప్రభూ! నా వద్దకు వచ్చి దానమడిగితివి. దాన మొసగుటలో పూర్తిగా నిమగ్నుడనైయున్న నేను నీకు సరిగా నమస్కరించ వలెనని కూడ తోచలేదు. నీకు పాద నమస్కారము చేయుటకు ప్రయత్నము మాత్రము చేసితిని. నా యీ కొద్దిపాటి ప్రయత్నమునకే నీవు అనంతమైన అనుగ్రహమును ప్రసాదించినావు. నీ పవిత్ర పాదమును, అధికార సంపదలతో గుడ్డివాడైన యీ దుష్ట బలి శిరస్సుపై మోపినావు. నీకు నాయందు గల దయను యెట్లు కీర్తింపను?''

వరుణ పాశ బంధము నుండి బలి విడుపు పొందెను. బ్రహ్మ విష్ణు రుద్రులకు బలి ప్రదక్షిణము చేసెను. అనంతరము బలి సుతల లోకము ప్రవేశించెను. ప్రహ్లాదుడు భగవంతునితో యిట్లు పలికెను. ''స్వర్గవాసులు నీ ఆశీస్సులకై నీకు ప్రణమిల్లుచున్నారు. నేను, నా మనుమడు దేవతలము కాము. కేవలము అసురులము. జన్మ చేత దేవతలకన్న తక్కువవారము. అయినప్పటికీ, నీకు మా యందు ప్రేమ యెక్కువ, అది యెంత యెక్కువనగా వారి కన్న మేము గొప్ప అదృష్టవంతులము. ప్రభూ! నా మనుమనిపై నీవు కురిపించిన అనుగ్రహమునకు నేను నీకెట్లు ధన్యవాదములు తెలుపగలను? నీవు అతనిని ఇంద్రుని జేసితివి. తనను తాను మరచే ప్రమాదము సంభవించినపుడు, నీకు నీవుగా వచ్చి, అతని సంపదను హరించి అనుగ్రహించినావు. సుతల లోకములో బలికి రక్షకుడుగా నుండగలనని వాగ్దానము చేసినావు. నీ అనుగ్రహము పొందుటకు మేము చేసిన పుణ్యమేమో నాకు తెలియదు''.

వామనుడు దయాపూర్వకముగా నవ్వి ప్రహ్లాదునితో యిట్లనెను. ''ప్రహ్లాదా! సుతల లోకము ప్రవేశించి, నీ మనుమనితో నుండుము. నేను మీతోనే యెల్లపుడును ఉండెదను. చేతిలో గదను ధరించి మీ గృహమును పరిరక్షించెదను''.

దేవతలందరకూ నమస్కరించి, ప్రహ్లాదుడు సుతల లోకము ప్రవేశించెను భగవదాజ్ఞానుసారము బలి ప్రారంభించిన యజ్ఞమును శుక్రాచార్యుడు సంపూర్తి గావించెను.

101 మత్స్యావతారము

మత్స్యావతారమును సవివరముగా తెలుపమని పరీక్షిత్తు శుక బ్రహ్మను అడిగెను.

శుకు డిట్లనెను. ''గోవులకు, బ్రాహ్మణులకు, దేవతలకు, సత్పురుషులకు హాని కలుగు ప్రమాదము యేర్పడినపుడు, ధర్మము, వేదములు లేక లోకమే నాశనమగునపుడు వానిని రక్షించుటకు భగవంతుడు యీ భూమిపై అవతరించును. ఇంతకు పూర్వ కల్పాంతమున బ్రహ్మ దీర్ఘ నిద్రలో నుండగా, యీ లోకము నీటిలో మునిగిపోయెను. బ్రహ్మ నిద్రించుచున్నపుడు, హయగ్రీవుడను అసురుడు వేదములను దొంగిలించెను వేదములతోబాటు ఆ అసురుడు నీటి అడుగునకు బోయెను మహా ప్రళయము నైమిత్తికము. ఆ ప్రళయమునకు పర్యవసానమే యీ లోకము నీటి అడుగునకు బోవుట

''ఆ సమయమందు సత్యవ్రతుడను రాజు యీ లోకమును పాలించుచుండెను. అతడు సాధు పురుషుడు, నారాయణునకు పరమభక్తుడు ప్రళయానంతరము లోకమును తిరిగి సృష్టించిన తర్వాత సత్యవ్రతుడు, ద్వాదశాదిత్యులలో ఒకడైన వివస్వతునకు కుమారుడుగా జన్మించెను అప్పటి మన్వంతరము వైవస్వత మన్వంతరమని పేరొందెను వివస్వతుని కుమారుడు శ్రార్ధదేవుడు

ఒకరోజు సత్యవ్రతుడు ఉదయమున కృతమాలా నదీ తీరమున నిత్యకృత్యములను జరుపుచుండెను. పితృదేవతలకు అర్ఘ్యమిచ్చుటకై దోసిటిలో జలము తీసుకొనగా అందు ఒక చిరు చేపను అతడు కనుగొనెను. వెంటనే ఆ చిరు చేపను నీటిలో వదలిపెట్టెను. ఆ చిరు చేప మానవ స్వరముతో నిట్లనెను. ''ఓ రాజా! నాపై దయజూపుము నేను అతి చిన్న చేపను పెద్ద చేపల వలన నాకు భయము; అవి నన్ను తినివేయగలవు. ఈ నీటి నుండి నన్ను తీసుకొనిపోయి రక్షింపుము'' ఆ చేప మాట్లాడిన పలుకులకు అతని హృదయము ద్రవించెను ఆ చిరు చేపను చేతులతో తీసి తన కమండలములో నైచి గృహమున కేగెను.

''ఒక రాత్రి గడిచెను. మరునాటి ఉదయము ఆ చేప యిట్లనెను. ''ఈ పాత్రలో తగినంతగా నాకు స్థలము లేదు. వెడల్పైన మరొక పెద్ద పాత్రలో యుంచిన యెడల నేను సంచరించుటకు వీలుగా నుండును''. వేరొక పెద్ద పాత్రలో నీరు పోసి అందు యీ చేప నుంచెను. ఒక గంటలో ఆ చేప పాత్రను మించి యెదిగెను. సత్యవ్రతుడు దానినొక సరస్సులో నైచెను. తిరిగి అట్లే జరిగెను. తాను సంచరించుటకు స్థలము చాలుట లేదని ఆ చేప మొరపెట్టెను. ఆ రాజు ఒకదానికంటె పెద్దదైన మరొ సరోవరములో నైచుట, ఆ చేప పెరుగుచు మొరపెట్టుట జరుగుచుండెను. అఖరుకు ఆ చేపను సముద్రములో పడనైచెను. ఆ చేప రాజుతో యిట్లనెను